www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

భారత్‌లో ఏ ప్రాంతాన్నీ పాకిస్థాన్ అని అనొద్దు

అది ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధం.. కర్ణాటక న్యాయమూర్తి వ్యాఖ్యలపై సీజేఐ ఆక్షేపణ

న్యాయమూర్తులు యథాలాపంగా చేసే వ్యాఖ్యలు వివక్షాపూరితంగా ఉండే ప్రమాదం

న్యాయనిర్ణయంలో నిష్పాక్షికత, సహేతుకత అవసరమని హితబోధ

2



బడిలో పిల్లల భద్రత యాజమాన్యం బాధ్యతే!

కేంద్రం మార్గదర్శకాలు పాటించాల్సిందే

రాష్ట్రాలు, యూటీలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

గురువారం | 26-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 162 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ. 12.26 తదుపరి దశమి; నక్షత్రం: పునర్వసు రా. 11.34 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ. 10.58-12.39; దుర్ముహూర్తం: ఉ. 10.06-10.54, మ. 2.53-3.41; అమృతఘడియలు: రా. 9.02-10.43; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.04 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి సరఫరా వెనుక పెద్ద సిండికేటే ఉందా? తెర వెనుక ఒక సంస్థ లేదా బడా వ్యక్తి ఉండి.. వేర్వేరు సంస్థల పేరుతో కథ నడిపించారా? ఈ మొత్తం దందా సాఫీగా సాగడం కోసం పెద్దలతో సహా అందరూ ముందే లాలూచీ పడ్డారా? లడ్డూని అపవిత్రం చేసిన వ్యవహారంలో వెలుగులోకి వస్తున్న కొత్త కోణాలు లేవనెత్తుతున్న అత్యంత కీలక ప్రశ్నలివి..



దీని మతలబేమి గోవిందా?

నెయ్యి సరఫరాలో భారీ గోల్‌మాల్

పేరు ఏఆర్‌ది..
ట్యాంకర్ వైష్ణవి డెయిరీది

జూలై 4న వచ్చిన టీఎన్ ట్యాంకరే మళ్లా 6న ప్రత్యక్షం

అంతలో దుండిగల్ వెళ్లి రావడం అసాధ్యం కదా!

అంటే నెయ్యి వచ్చింది తిరుమలకు సమీపం నుంచేనా?

ఆ రోజు వచ్చిన ఆ రెండు ట్యాంకర్లలోనూ కొవ్వు కల్తీ

తెర వెనుక సిండికేట్ బాగోతంపై సందేహాలు

ఇదంతా పెద్దలకు ముందే తెలుసా అనే అనుమానాలు

లడ్డూ అపచారంలో తెరపైకి సంచలన అంశాలు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

లాభాలే పరమావధిగా కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామితోనూ కల్తీ వ్యాపారం చేశారు. స్వచ్ఛమైన నెయ్యికి బదులు కల్తీ నెయ్యి సరఫరా చేసి దేవదేవుడు గోవిందుడి చెంతనే భారీ గోల్‌మాల్ చేశారు. విశ్వాసాలు, పవిత్రత వంటి అంశాలను మంటగలిపి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. కాసుల కక్కుర్తితో శ్రీవారిని, కోట్లాది భక్తులను మోసం చేసి జేబులు నింపుకొన్నారు. ముఖ్యంగా ఏఆర్ డెయిరీ కాంట్రాక్టుకు సంబంధించి టెండర్ల దగ్గరి నుంచి నెయ్యి సరఫరా వరకు భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగిందా అన్న అనుమానాలకు తావిచ్చే పలు సంచలనాంశాలు తాజాగా బయటపడ్డాయి.

8 ట్యాంకులు.. 4 నంబర్లు!

ఏఆర్ డెయిరీ తమిళనాడులోని దుండిగల్‌లో ఉంది. తిరుమలకు, దుండిగల్‌లో ఉన్న ఆ డెయిరీకి నడుమ 500 కిలోమీటర్లకు పైనే దూరం ఉంది. ఏఆర్ డెయిరీ దుండిగల్ నుంచి నెయ్యిని ట్యాంకర్ల ద్వారా తిరుమల ఆలయానికి సరఫరా చేస్తోంది. జూన్ 12 నుంచి జూలై 12 మధ్య ఆ సంస్థ పేరిట మొత్తం 8 ట్యాంకుల నెయ్యి తిరుమలకు చేరింది. నాలుగు వేర్వేరు నంబర్లున్న ట్యాంకర్ల ద్వారా ఆ నెయ్యి సరఫరా అయింది. వాటిలో నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో కల్తీ జరిగినట్లు తేలింది. ఇలా తిరస్కరణకు గురైన

మిగతా 11వ పేజీలో...

ఏఆర్ ఫుడ్స్‌పై క్రిమినల్ కేసు

టీటీడీ ఫిర్యాదుతో తిరుపతిలో నమోదు

నేరపూరిత కుట్ర, మోసం, కల్తీ సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు

కోట్లాది భక్తులను మోసగించిన 'ఏఆర్'

నోటీసుతో తక్కిన సరఫరా సంస్థలు దారికి

కానీ, పద్ధతి మార్చుకోని ఏఆర్ ఫుడ్స్

జంతువుల కొవ్వు కలిపినట్టు నిర్ధారణ

లడ్డూ అపవిత్రాన్ని మించిన కుట్ర ఉండదు

ఆహార కల్తీ నిరోధక చట్టం కిందా ఇది నేరమే

ఈ వ్యవహారంలో లబ్ధి పొందినవారెవరో తేల్చండి

ఫిర్యాదులో కోరిన టీటీడీ జీఎం మురళీకృష్ణ

11

పోటీ పూజలు!

ఎల్లుండి ఆలయాలన్నిటిలో పూజలకు జగన్ పిలుపు

అదే రోజు శ్రీవారిని దర్శించుకోనున్న మాజీ సీఎం

కొన్ని ట్యాంకర్లు అంగీకరించినట్లు
జగనే చెప్పారు

11

అలాంటప్పుడు కల్తీ నెయ్యి వాడినట్లే కదా!

పూజలకు పిలుపు మీకు పొలిటికల్ ఈవెంట్ మాకు సెంటిమెంట్.. మంత్రి పయ్యావుల ఫైర్

ఇక భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని హితవు

డిక్లరేషన్ ఇచ్చి జగన్ తిరుమల వెళ్లాలి

పురందేశ్వరి డిమాండ్



ఆటో రిపేరు కోసం గరికపాటి రాజుకు రూ.10 వేల సాయం అందిస్తున్న సీఎం చంద్రబాబు

మక్కెలు విరగ్గొడతాం

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఊరుకోం

ఒళ్లు దగ్గర పెట్టుకోమని హెచ్చరిస్తున్నాం

క్రిమినల్ బ్రెయిన్‌తో వస్తే వదిలిపెట్టేది లేదు

చొక్కా పట్టుకొని తీసుకెళ్తాం

నేరాలు చేయాలనుకుంటే అదే చివరి రోజు

బోట్లను నదిలోకి వదిలి ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసే ప్రయత్నం వెనుక వైసీపీ ఉంది

ఈ పని చేసినందుకు క్షమాపణ చెప్పరా?

ఇప్పుడు మళ్లీ అనంతలో రథం తగలబెట్టారు

వరదల నష్టం రూ.7,600 కోట్లు

4 లక్షల మందికి రూ.602 కోట్ల పరిహారం విడుదల

దాతల నుంచి ప్రభుత్వానికి రూ.400 కోట్ల విరాళాలు

30 నాటికి బాధితులకు పరిహారం పంపిణీ పూర్తి

సాయంపై కేంద్రంలో ఇంకా కసరత్తు జరుగుతోంది: సీఎం

అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో రామాలయానికి చెందిన రథానికి నిప్పంటించిన ఘటనతో పాటు ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొన్న ఘటనపైనా సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన 4లక్షల మంది బాధితులకు బుధవారం రూ.602 కోట్ల పరిహారాన్ని

మిగతా 11వ పేజీలో...

రాములోరి రథానికి నిప్పు వైసీపీ నేత పనే.. 'అనంత'లో అరెస్టు

16 మంది ఐపీఎస్‌ల బదిలీ



సీఐడీకి వినీత్ బ్రిజ్‌లాల్.. ఇంటెలిజెన్స్‌కు పీహెచ్‌డీ రామకృష్ణ

సెబ్ రవిప్రకాశ్‌కు పీఅండ్‌ఎల్.. డీజీపీ అడ్మిన్ డీఐజీగా అమ్మిరెడ్డి

రోడ్ సేఫ్టీకి విజయారావు.. నిఘా విభాగానికి ఫక్కీరప్ప

అనకాపల్లి ఎస్పీగా తుహీన్ సిన్హా.. హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని బాబూజీ, శ్రీనివాసరావుకు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 16 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. సీనియర్ ఐపీఎస్‌లు వినీత్ బ్రిజ్‌లాల్, పీహెచ్‌డీ రామకృష్ణ, ఎం.రవిప్రకాశ్‌తో పాటు వెయిటింగ్‌లో ఉన్న ఎస్పీ స్థాయి అధికారులకూ పోస్టింగ్ ఇచ్చింది. ఎస్‌ఐబీ ఐజీగా ఉన్న వినీత్ బ్రిజ్‌లాల్‌ను సీఐడీకి.. ఆయన స్థానంలోకి ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ (పీఅండ్‌ఎల్)

మిగతా 12వ పేజీలో...



లడ్డూ కల్తీ కుట్రను ఛేదించండి

లడ్డూ అపవిత్రంలో దురుద్దేశం ఉందా?

భక్తుల మనోభావాలపై కుట్ర జరిగిందా?

నిజాలు నిగ్గు తేలాలి..పకడ్బందీగా దర్యాప్తు

రివర్స్ టెండరింగ్‌లో అసలు ఏం జరిగింది?

తక్కువ రేటుకు ఎందుకు అంగీకరించారు?

నాసిరకం నెయ్యిని పైపైనే తనిఖీలు చేశారా?

దీనిలో నాటి టీటీడీలోని ఎవరి పాత్ర ఏమిటి?

తెలిసీ బయటికి చెప్పలేని వారెవరు?

వ్యతిరేకించిన శ్రీవైష్ణవులను బెదిరించారా?

ఏ పొరపాటుకూ తావివ్వకుండా విచారించండి

సిట్ సభ్యులకు డీజీపీ నిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): "ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుమల ఆలయంలో లడ్డూ ప్రసాదం అపవిత్రం అవడం పట్ల ప్రభుత్వం సీరియస్‌గా ఉంది.. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించండి.. ఏదీ వదలకుండా ముందుకెళ్లండి.. భవిష్యత్తులో చిన్న పొరపాటు చేయాలంటేనే భయపడేలా దర్యాప్తు ఉండాలి" అని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులకు డీజీపీ ద్వారకా తిరుమల రావు దిశానిర్దేశం చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు రంగంలోకి దిగబోతున్న సిట్ సభ్యులతో బుధవారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. దర్యాప్తు

మిగతా 11వ పేజీలో...



సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పెట్టుబడులతో రండి

మరింత మెరుగ్గా మౌలిక సదుపాయాలు

అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యం

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు ప్రణాళికలు

ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు

దేశంలో ఐదో ఆర్థిక నగరంగా విశాఖ

15 రోజుల్లో అంతర్జాతీయ కార్గో రవాణా

సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విశాఖను దేశంలో ఐదో ఆర్థిక నగరంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన మౌలిక వసతుల సదస్సుకు మంత్రి టీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, పెట్టుబడిదారులకు రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో వచ్చేలా పోటీ వాతావరణం

మిగతా 3వ పేజీలో...

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు.. అది వైసీపీ దుష్ప్రచారమే: లోకేశ్



3

మాగుంట పార్వతమ్మ
కన్నుమూత

ఎంపీ, ఎమ్మెల్యేగా సేవలు

సీఎం చంద్రబాబు, వెంకయ్య నాయుడు సహా పలువురు ప్రముఖుల సంతాపం

ప్రభుత్వ లాంఛనాలతో నెల్లూరులో నేడు అంత్యక్రియలు

ఎయిడెడ్ పోస్టుల భర్తీకి
గ్రీన్ సిగ్నల్

దరఖాస్తులు ఆహ్వానించాలని ఆర్జేడీలు, డీఈవోలకు ఆదేశం

2

చెన్నైలో కామ్‌దార్‌నగర్ మొదటి వీధికి
ఎస్పీ బాలు పేరు సినిమా పేజీలో

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దందాలో రూ.2586 కోట్ల దోపిడీ జరిగినట్టు ఏసీబీ చెబుతోంది. కానీ అనధికారికంగా 15 వేల కోట్లపైనే కొల్లగొట్టారని గనుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఒక్క 'తాడేపల్లి'కే 9 వేలకోట్లకు పైనే చేరినట్టు తెలుస్తోంది. ఇవేవీ గనుల శాఖ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, నివేదికల్లో కనిపించవు. తెరవెనుక సాగిన దందా ఇది. పైకి కాంట్రాక్టు ఇచ్చినట్టే ఇచ్చి.. గుట్టుచప్పుడు కాకుండా ఉమ్మడి జిల్లాల వారీగా వైసీపీ నేతలకు ఇసుక దోపిడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. 2021 మే నుంచి 2024 మే వరకు వారి నుంచి నెలానెలా కప్పం వసూలు చేశారు. ముఖ్య నేత సాగించిన ఈ దోపిడీపై ఏసీబీ విచారణ చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి.

'తాడేపల్లి' దందా సంగతేంటి?

ఇసుక దోపిడీలో భారీ వాటా

ముఖ్య నేతకు 9 వేల కోట్ల కప్పం

ముఖచిత్రమే వెంకటరెడ్డిది

అసలు పాత్రధారి తెర వెనుకే

ఉమ్మడి జిల్లాలవారీగా వైసీపీ నేతలకు కాంట్రాక్టులు

జిల్లాకు 20-25 కోట్లు డీల్

2021-24 మధ్య వసూళ్లు

దోపిడీ 15 వేల కోట్లపైనే

గుట్టు విప్పాల్సిన కోణం ఇదే



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో ఇసుక కాంట్రాక్టులో నాటి గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి ముఖచిత్రమే కనిపిస్తోంది. ఆ ముఖచిత్రం ముసుగు తీసేస్తే అసలు దొంగలు బయటకొస్తారు. ఇసుక అనధికారిక దందాను ఏసీబీ కూకటివేళ్లతో పెకిలిస్తే తాడేపల్లి గుట్టు బయటకొస్తుంది. ఆ కనెక్షన్‌ను పట్టుకొని విచారిస్తే 15 వేలకోట్ల పైనే ఇసుక కుంభకోణం బయట పడుతుందని స్వయంగా గనుల శాఖ వర్గాలే చెబుతున్నాయి. ప్రభుత్వం, అవినీతి నిరోధక శాఖ మాత్రం

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రమంతా
గ్రీన్ ఎనర్జీ!

'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'ని తీసుకొస్తున్న ప్రభుత్వం

ఇంధన శాఖతో సీఎం సమీక్ష.. రేపు కూడా భేటీ

పాలసీకి తుదిరూపు.. బ్యాటరీ స్టోరేజీ విద్యుత్‌కు పెద్దపీట

బయో ఇంధనోత్పత్తులకు ప్రోత్సాహం

పెట్టుబడిదారులకు 2 నెలల్లోనే అనుమతులు

'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' విధానంలో కేటాయింపు

2 వేల ఎకరాల విస్తీర్ణంలో సోలార్ పార్కులు

మినీ హైడల్ ప్లాంటుకు యంత్రసామగ్రిపై 20% సబ్సిడీ

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యావరణ హితమైన క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకొస్తోంది. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టులతో పాటు.. వ్యవసాయ విద్యుత్ కోసం ఫీడర్ల పరిధిలో సౌర విద్యుదుత్పత్తి.. బ్యాటరీలో కరెంటు స్టోరేజీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంధన శాఖను ఆదేశించారు. ఫీడర్లవారీగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ.. పగటిపూట నేరుగా పంటలకు 9 గంటలపాటు కరెంటును ఇస్తూనే.. డిమాండ్ లేని సమయంలో బ్యాటరీల్లో కరెంటు నిల్వ చేసే ప్రక్రియను ప్రోత్సహించాలని ఆయన నిర్ణయించారు. దీనిని 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'లో ప్రత్యేకంగా పొందుపరచాలని స్పష్టం చేశారు. బ్యాటరీ స్టోరేజీ సౌర ప్లాంట్లను మైదాన ప్రాంతాల్లో కంటే.. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా స్థాపించేలా చూడాలని సూచించారు. పొదుపు సంఘాలు, పారిశ్రామిక సంస్థలు, డిస్కంలు కలసి పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ (పీ4) విధానంలో అమలు చేసేలా పాలసీలో

మిగతా 12వ పేజీలో...



బుధవారం తన నివాసంలో చెస్ గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, అర్జున్‌లతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే
హరియాణా అభివృద్ధికి బ్రేక్!

2

నేతల గ్రూపులతో రాష్ట్రం విధ్వంసం

కర్ణాటక, హిమాచల్, తెలంగాణల్లో ముఖ్యమంత్రి, మంత్రుల కుమ్ములాటలు

అస్థిరతకు, అవినీతికి కాంగ్రెస్ మారుపేరు

ఎస్సీ, ఎస్టీల హక్కులనూ దోచేసింది

కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గి.. బీజేపీ గ్రాఫ్ పెరిగింది

హరియాణా ఎన్నికల ప్రచారంలో మోదీ

48 గంటల్లో పాస్‌పోర్టులు
సరెండర్ చేయండి

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో వైసీపీ నేతలకు సుప్రీం ఆదేశం

12

జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వకపోతే రోడ్డెక్కుతాం



జమ్మూ, సెప్టెంబరు 25: అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వకపోతే పార్లమెంట్‌తో పాటు రోడ్డెక్కి ఇండియా బ్లాక్ ఆందోళన నిర్వహిస్తుందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. జమ్మూలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. బయటివారికి ప్రయోజనం కలిగించేందుకే కేంద్రం జమ్మూకశ్మీర్ నుంచి రాష్ట్ర హోదా తొలగించిందని ఆయన ఆరోపించారు. స్థానికులతో కాకుండా బయటివారితో రాష్ట్రాన్ని పాలించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం యోచిస్తోందని రాహుల్ ఆరోపించారు. రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజల హక్కు అని, భవిష్యత్తు కూడా అదేనన్నారు. రద్దు చేసిన రైతు చట్టాలను మళ్లీ వెనక్కు తీసుకురావాలంటూ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై మోదీ వివరణ ఇవ్వాలని రాహుల్ డిమాండ్ చేశారు.

ఆసియాలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: ఆసియాలో అత్యంత ప్రభావం చూపుతూ, శక్తిమంతంగా ఎదుగుతున్న ప్రపంచ దేశాల్లో మూడో స్థానానికి ఎగబాకింది. తాజాగా విడుదలైన ఆసియా పవర్ ఇండెక్స్‌లో జపాన్‌ను వెనక్కునెట్టిన భారత్ మూడో అతిపెద్ద శక్తిగా అవతరించిందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ప్రభావం చూపే ప్రపంచ దేశాల ఆధారంగా.. లోవీ ఇనిస్టిట్యూట్ 2018లో ఆసియా పవర్ ఇండెక్స్‌ను ప్రారంభించింది. ఈ ఏడాది ఈ జాబితాలో అమెరికా, చైనా.. సూపర్ దేశాలుగా తొలి రెండు ర్యాంకుల్లో కొనసాగుతుండగా.. జపాన్, ఆస్ట్రేలియా, రష్యా వరుసగా 4, 5, 6వ స్థానాల్లో నిలిచాయి.

రూ.1.27లక్షల కోట్లకు చేరిన రక్షణ ఉత్పత్తులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: రక్షణ రంగంలో భారత్ గణనీయమైన వృద్ధి సాధిస్తోందని, 2023-24లో దేశ రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయిలో రూ.1.27 లక్షల కోట్లకు చేరుకుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు. ప్రస్తుతం 90కి పైగా దేశాలకు భారత్ తన రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం వల్ల ఈ పదేళ్లలో ఘనమైన వృద్ధి సాధ్యమైందని చెప్పారు. రక్షణ రంగంలో భారత్ ప్రపంచంలోనే కీలక శక్తిగా ఎదుగుతోందన్నారు. రక్షణ ఎగుమతులు తొలిసారిగా 2023-24లో రూ.21వేల కోట్లు దాటాయని వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో దీన్ని రూ.50 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఏజీ, ఏఏజీ, డీఎస్‌జీ, పీపీలకు ఘన సన్మానం



అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ ఇవన సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణలను ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, చిత్రపటాలను అందజేశారు. ఏజీకి గజమాల వేసి సత్కరించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం తన వద్దకొచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు.

హైకోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

» ఎమ్మెల్యేలు రఘురామ, నానాజీలపై చర్యలకు డిమాండ్



హైకోర్టు వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసి అవమానించారంటూ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై న్యాయవాదులు మండిపడ్డారు. ఆయన తీరును నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం ఆధ్వర్యంలో హైకోర్టు వద్ద న్యాయవాదులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. అలాగే, రంగరాయ కళాశాలలో దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావుపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అనుచితంగా ప్రవర్తించారంటూ, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రఘురామను శాసనసభ నుంచి బర్తరఫ్ చేయాలని, పంతం నానాజీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎయిడెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పార్వతి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని స్పష్టంచేశారు. అయితే ఆమె ఇచ్చిన ఉత్తర్వులను మాత్రం మీడియాకు విడుదల చేయకుండా రహస్యంగా ఉంచారు. సాధారణంగా పోస్టుల భర్తీ, టెట్, డీఎస్సీ లాంటి సమాచారాన్ని పాఠశాల విద్యాశాఖ ప్రకటనల ద్వారా విడుదల చేసి అభ్యర్థులకు చేరవేస్తుంది. కానీ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పార్వతి ఈ విధానాన్ని పక్కనపెట్టి ఎక్కువ సమాచారం రహస్యంగా ఉంచేలా ఉత్తర్వులిచ్చారు. ఆమె గతంలోనూ టీచర్లకు సంబంధించి అనేక ఉత్తర్వులు ఇచ్చినా అవి ఉపాధ్యాయులకు సకాలంలో చేరేవి కావు. కాగా, కోర్టు ఆదేశాలకు లోబడి ఎయిడెడ్ పోస్టుల భర్తీ జరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధికి బ్రేక్!

హరియాణా ప్రజలారా జాగ్రత్త.. ఆ పార్టీని పొరపాటున కూడా అధికారంలోకి రానివ్వొద్దు

» నేతల కుమ్ములాటతో రాష్ట్రం విధ్వంసం
» కర్ణాటక, హిమాచల్, తెలంగాణల్లో ముఖ్యమంత్రి, మంత్రుల కుమ్ములాట
» అస్థిరతకు ఆ పార్టీ మారుపేరు
» హరియాణా ఎన్నికల ప్రచారంలో మోదీ



సోనిపట్, సెప్టెంబరు 25: హరియాణాలో పొరపాటున కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంతర్గత పోరుతో రాష్ట్రం తల్లడిల్లడం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. అంతే కాదు.. హరియాణాలో సుస్థిరత, అభివృద్ధి ఆగిపోతాయని తెలిపారు. కాబట్టి హరియాణా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "కాంగ్రెస్‌కు ఓటేయడమంటే.. హరియాణా అభివృద్ధి, సుస్థిరతలను విధ్వంసంలోకి నెట్టినట్టే. వారి అంతర్గత పోరు పెట్టుబడులు, ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అస్థిరతకు మారుపేరుగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు అంతర్గత కుమ్ములాటలతో రోడ్డున పడడం కాంగ్రెస్ పాలనలోనే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు వారికి కనిపించవని దుయ్యబట్టారు. దీనికి కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారే పెద్ద ఉదాహరణ అని మోదీ పేర్కొన్నారు. "కర్ణాటకలో సీఎం, డిప్యూటీ సీఎం అంతర్గత కుమ్ములాటలతో తీరికలేకుండా ఉన్నారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ ఇదే కథ నడుస్తోంది" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి కూపంలో పూర్తిగా కూరుకుపోయిందని మోదీ నిప్పులు చెరిగారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే అక్కడి ముఖ్యమంత్రి సిద్దరామయ్య భూకుంభకోణంలో చిక్కుకున్నారని, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేయాల్సిందేనని కోర్టు కూడా తేల్చి చెప్పిందంటే.. కుంభకోణం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సోనిపట్, గొహానాలలో బీజేపీ అభ్యర్థుల తరపున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలకు ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటకలో వెలుగు చూసిన మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూ కుంభకోణాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ కుంభకోణంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రధాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. "కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి భూ కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హైకోర్టు కూడా ఆయన అప్పీల్‌ను తిప్పికొట్టింది. అంతేకాదు.. దీనిపై సరైన విచారణ జరగాల్సిన అవసరం కూడా ఉందని తేల్చి చెప్పింది. పదేళ్ల కిందట ఇక్కడ(హరియాణ) కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములను గుంజుకుని దలాల్, దమాడ్‌లకు పంచిపెట్టింది. కాంగ్రెస్ పాలనలో మోసం, అవినీతి చేయని సంస్థలు లేవు" అని ప్రధాని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలను కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాలను అందుకునేందుకు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు కాంగ్రెస్ హయాంలో పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జీవితాలకు హక్కులు లభించాయని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే దళితులు, బీసీల హక్కులను కాలరాచేందుకు ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. "కాంగ్రెస్‌ను మించిన అవినీతి పార్టీ మరొకటి లేదు. ప్రతి అడుగులోనూ అవినీతి, బంధుప్రీతికి ఆ పార్టీ ఆలవాలం. భారత ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిని పెంచి పోషించింది కూడా కాంగ్రెస్ పార్టీనే" అని వ్యాఖ్యానించారు.

మా గ్రాఫ్ పెరుగుతోంది!

హరియాణాలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని ప్రధాని అన్నారు. ఇదేసమయంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ నానాటికీ దిగజారుతోందని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ప్రాధాన్యం ఏమిటో హరియాణా ప్రజలకు తెలుసునని, అందుకే ఇక్కడి వారు కేంద్రంలోను, రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వాన్ని ఎంచుకుంటారని వ్యాఖ్యానించారు.

ఇదీ కాంగ్రెస్ లక్షణం

హరియాణాలోని రైతులకు బీజేపీతోనే మేలు జరుగుతోందని ప్రధాని మోదీ తెలిపారు. "24 పంటలకు బీజేపీ ప్రభుత్వం కనీస మద్దతు ధరలు(ఎంఎస్‌పీ) నిర్ణయించింది. కాంగ్రెస్ హయాంలో ఎంఎస్‌పీ ప్రకారం పంటలు కొనుగోలు చేసేందుకు అసహ్యించుకుంది. ఇదీ.. కాంగ్రెస్ పార్టీ లక్షణం. దీనిని రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది" అని ప్రధాని అన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సును కోరుకునే పార్టీ బీజేపీనేనని తెలిపారు. హరియాణా 'పతకాల పరిశ్రమ'గా రూపాంతరం చెందిందని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో హరియాణా క్రీడాకారులు రాష్ట్రం గర్వపడేలా పతకాల పంట పండించారని తెలిపారు.

లోకం తీరు



జమ్మూకశ్మీర్ రెండో విడతలో 56 శాతానికి మించి పోలింగ్

జమ్మూ, సెప్టెంబరు 25: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడతలో 56.05% పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పీకే పోలే తెలిపారు. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఎక్కడా రీపోలింగ్ జరపాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన అనేక చోట్ల ప్రజలు ఈసారి భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటేశారన్నారు. మరోవైపు, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను 16మందితో కూడిన అత్యున్నత స్థాయి విదేశీ దౌత్యవేత్తల బృందం పరిశీలించింది. ఎన్నికలు అత్యంత ఆరోగ్యకరంగా, ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్నాయని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల చివరి విడతలో భాగంగా అక్టోబర్ 1న 40 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 8న ఫలితాలు వెల్లడిస్తారు.

కంగన కారుకూతలతో బీజేపీకి నష్టం

» సాగు చట్టాలను తిరిగి తేవాలనడం తప్పు
» ఆ వ్యాఖ్యలకు బీజేపీకి సంబంధం లేదు
» బీజేపీ అధికార ప్రతినిధి జయవీర్ షెర్గిల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: మండి ఎంపీ కంగనారనౌత్ కారుకూతలతో బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జయవీర్ షెర్గిల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె నిరాధారమైన.. అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "సిక్కు, సామాజికవర్గం,పంజాబ్ రైతులపై ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా తర్కవిరుద్ధం. పంజాబ్ అభివృద్ధికి ప్రధాని మోదీ చేస్తున్న కృషికి కంగన తీరు విఘాతం కలిగిస్తోంది" అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కంగన తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు. సాగు చట్టాలను తిరిగి తీసుకురావాలని కంగన చెప్పడాన్ని తప్పుబట్టారు. "కంగన కారుకూతలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమె వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యం" అని దుయ్యబట్టారు. సొంత పార్టీ బీజేపీ నుంచి కూడా వ్యతిరేకత వస్తుండడంతో కంగన నష్టనివారణ చర్యలను ప్రారంభించారు. "నా వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెబుతున్నాను. ఇకపై నేను పార్టీ అభిప్రాయాల మేరకు మాట్లాడతాను" అంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. బీజేపీ మరో అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా కూడా.. "కంగన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం. సాగు చట్టాలపై ఆమె మాటలు బీజేపీ విధానాన్ని ప్రతిబింబించబోవు" అని వ్యాఖ్యానించారు. కాగా, కంగన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా స్పందించారు. "750 మంది రైతులు చనిపోయిన తర్వాత కూడా రైతు వ్యతిరేక బీజేపీ, మోదీ ప్రభుత్వంలో మార్పు రాలేదు" అన్నారు. హరియాణాతోపాటు.. ఇతర రాష్ట్రాల్లో త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రధాని మోదీ కూడా పార్లమెంట్ సాక్షిగా రైతులను ఆందోళన జీవులు, పరాన్నజీవులు అన్న విషయాన్ని గుర్తుచేశారు. "కంగనకు ఆరెస్సెస్, బీజేపీ నేపథ్యం లేదు. కేవలం మోదీ ప్రత్యేక శ్రద్ధతో మండి నుంచి ఆమె ఎంపీగా గెలిచేందుకు సహకరించారు. అందుకే.. కంగన వ్యాఖ్యలను మోదీ స్వయంగా ఖండించాలి" అని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

హరియాణా ఎన్నికల వేళ దుమారం

పంజాబీ రైతులపై.. రైతు చట్టాలపై కంగన చేసిన వ్యాఖ్యలు హరియాణా అసెంబ్లీ ఎన్నికల వేళ తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. సాగుచట్టాలను తిరిగి తేవాలని, రైతులే ఆ డిమాండ్ చేయాలని ఆమె అనడంతో బీజేపీ ఇరకాటంలో పడిపోయింది. రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో రోజుల తరబడి ఆందోళనలు చేపట్టిన రైతుల్లో పంజాబ్, హరియాణాకు చెందినవారే ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే..! హరియాణా ఎన్నికల ప్రచారంలో ఓ వైపు కాంగ్రెస్.. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) దూసుకుపోతుండగా.. కంగన తాజా వ్యాఖ్యలతో బీజేపీ ఆత్మరక్షణలో పడిపోయినట్లయింది.

సిద్దరామయ్యను విచారించండి!

» డిసెంబరు 24లోగా దర్యాప్తు నివేదిక ఇవ్వండి
» లోకాయుక్త పోలీసులకు కోర్టు ఆదేశం

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్యపై వచ్చిన మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల వివాదంపై బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కేసుల ప్రత్యేక కోర్టు ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం విచారణ జరిపింది. సీఎంను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన మేరకు లోకాయుక్త పోలీసులు విచారణ జరపాలని, దర్యాప్తు నివేదికను డిసెంబరు 24లోగా సమర్పించాలని న్యాయాధికారి సంతోష్‌గజానన భట్ ఆదేశించారు. విచారణకు సిద్దరామయ్య సహకరించాలని ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. మైసూరు లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి, అవసరమైతే విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకోవడానికి కూడా అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒకటి రెండు రోజుల్లో సీఎం సిద్దరామయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత విచారణ ప్రారంభమవుతుంది. కోర్టు ఉత్తర్వులు లోకాయుక్త డీజీకి చేరాల్సి ఉంది. ఆయన సూచన మేరకు లోకాయుక్త ఎస్పీ విచారణ జరపాల్సి ఉంటుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సిద్దరామయ్య వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు జేడీఎస్ అధికార ప్రతినిధి ప్రదీప్.. లోకాయుక్త ఎస్పీ కార్యాలయానికి వెళ్లి సిద్దరామయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విచారణకు భయపడేది లేదని సిద్దరామయ్య తెలిపారు.

భారత్‌లో ఏ భాగాన్నీ పాకిస్థాన్ అనడానికి వీల్లేదు

అది ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధం: సీజేఐ

» కర్ణాటక జడ్జి వ్యాఖ్యలపై తీవ్ర ఆక్షేపణ
» ఇప్పటికే జడ్జి విచారం వ్యక్తం చేయడంతో సుమోటో విచారణ మూసివేత



బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: భారతదేశంలోని ఏ భాగాన్నీ పాకిస్థాన్ అని అనకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. అలా సంబోధించడం దేశ ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధమన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద ఓపెన్ కోర్టులో చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్ ఇటీవల కలకలం రేపాయి. ఒక వీడియోలో ఆయన బెంగళూరులో ముస్లిం ప్రాబల్య ప్రాంతాన్ని 'పాకిస్థాన్' అని వ్యాఖ్యానించారు. రెండో క్లిప్పింగ్‌లో.. ప్రత్యర్థి న్యాయవాదిని అడిగిన ప్రశ్నకు ఓ మహిళా లాయర్ జవాబు చెప్పినందుకు ఆమెను ఆయన మందలించారు. ఈ క్లిప్పింగులు వైరల్ కావడంతో సుప్రీంకోర్టు ఈ నెల 20న సుమోటో కేసుగా స్వీకరించింది. హైకోర్టు రిజిస్ట్రార్‌ను నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసుపై చీఫ్ జస్టిస్‌తో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం బుధవారం మళ్లీ విచారించింది. జస్టిస్ వి.శ్రీశానంద వ్యాఖ్యలపై సీజేఐ అభ్యంతరం తెలిపారు. తన వ్యాఖ్యలపై సదరు న్యాయమూర్తి ఇప్పటికే విచారం వ్యక్తంచేయడంతో సుమోటో విచారణను కొనసాగించరాదని ధర్మాసనం నిర్ణయించింది. అయితే సీజేఐ ఈ సందర్భంగా న్యాయమూర్తులకు కీలక సూచనలు చేశారు. 'ఎలక్ట్రానిక్ మీడియా శకంలో న్యాయమూర్తులు సంయమనం పాటించాలి. యథాలాపంగా చేసే వ్యాఖ్యలు కొంత వివక్షాపూరితంగా ఉండేందుకు అవకాశం ఉంది. ప్రత్యేకించి ఫలానా లింగం, వర్గానికి వ్యతిరేకంగా చేశారని అనుకుంటారు. అందుచేత కోర్టులు విచారణ సందర్భంగా వ్యాఖ్యలు చేయకుండా నియంత్రణ పాటించాలి. ఆ వ్యాఖ్యలను స్త్రీద్వేషంతో చేసినవి గానో, సమాజంలోని ఓ వర్గంపై పక్షపాతంతో చేసినట్టుగానో పరిగణించే అవకాశం ఉంది. పితృస్వామ్యం, మహిళలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగరూకతతో ఉండాలి. న్యాయనిర్ణయ ప్రక్రియలో నిష్పక్షపాతం, సహేతుకత అవసరం. భారత రాజ్యాంగంలో పొందుపరచిన విలువలే న్యాయమూర్తులకు మార్గదర్శకం కావాలి' అని సూచించారు. ఇలాంటి వివాదాల నేపథ్యంలో కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేయాలన్న సూచనను సీజేఐ తోసిపుచ్చారు. 'సూర్యకాంతికి జవాబు మరింత వెలుగే. కోర్టుల్లో జరిగేవాటిని తొక్కిపెట్టలేం' అని స్పష్టంచేశారు. తన వ్యాఖ్యల వివాదంలో సుప్రీంకోర్టు జోక్యంతో జస్టిస్ శ్రీశానంద ఓపెన్ కోర్టులోనే విచారం వెలిబుచ్చారు. 21వ తేదీ మధ్యాహ్నం కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే తన ప్రకటన చదివి వినిపించారు. ఉద్దేశపూర్వకంగా తాను ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు.

బడిలో పిల్లల భద్రత యాజమాన్యం బాధ్యతే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: పాఠశాలలో బాలల రక్షణకు యాజమాన్యాన్ని బాధ్యురాలిని చేస్తూ కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు (యూటీలు) అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తన ఆదేశాల అమలును పర్యవేక్షించాలని జాతీయ బాలల హక్కుల కమిషన్‌ను (ఎన్‌సీపీసీఆర్) కోరింది. నోబెల్ విజేత కైలాశ్ సత్యార్థి నేతృత్వంలోని 'బచ్‌పన్ బచావో ఆందోళన్' సంస్థ దాఖలుచేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య బెంచ్ ఈ ఆదేశాలు జారీచేసింది. బాలల రక్షణ కోసం తయారైన 2021 నాటి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఇప్పటికీ చాలా రాష్ట్రాలు, యూటీలు అమలుచేయడం లేదని కోర్టుకు పిటిషనరు తెలిపారు. పాఠశాలల్లో బాలలపై వేధింపులు, నేరాలు పెరిగిన దరిమిలా ఈ మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావాలన్నారు. తద్వారా 6-14 ఏళ్ల లోపు బాలలకు స్వేచ్ఛాయుత విద్యను తప్పనిసరి చేసిన ఆర్టికల్ 21ఏ స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు.

శ్రీలంక ప్రధానికి భారత్‌తో ప్రత్యేక అనుబంధం

» ఢిల్లీ వర్సిటీలో చదువుకున్న హరిణి అమరసూర్య



న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: శ్రీలంక నూతన ప్రధాని హరిణి అమరసూర్యకు భారత్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఢిల్లీ యూనివర్సిటీలో ఆమె సోషియాలజీలో బ్యాచిలర్ డిగ్రీని అభ్యసించారు. వర్సిటీ పరిధిలోని హిందూ కళాశాలలో ఆమె చదివారు. తమ పూర్వ విద్యార్థిని శ్రీలంక ప్రధానికావడం ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ అంజు శ్రీవాస్తవ అన్నారు. హరిణి 1991-94 వరకు సోషియాలజీ విద్యార్థినిగా ఉన్నారని చెప్పారు. తమ కాలేజీలో విద్యార్థి ప్రభుత్వం అనే సంప్రదాయం సుదీర్ఘకాలం నుంచి అమలులో ఉందని, ఏటా విద్యార్థుల్లో ఒకరిని ప్రధానిగా, మరొకరిని ప్రతిపక్షనేతగా ఎన్నుకొంటామన్నారు. అప్లైడ్‌ఆంత్రోపాలజీ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో మాస్టర్స్ చేసిన హరిణి అమరసూర్య... ఎడిన్‌బర్గ్ వర్సిటీ నుంచి సోషల్ ఆంత్రోపాలజీలో డాక్టరేట్ పట్టా పొందారు.

కుంగిన అవుకు రిజర్వాయర్ రివిట్‌మెంట్

» భారీగా లీకవుతున్న నీరు
» మట్టితో పూడ్చిన అధికారులు
» గతంలోనే మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిన వైనం
» పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



అవుకు రిజర్వాయర్ కట్టలోపల కుంగిన రివిట్‌మెంట్

నంద్యాల/అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాలు వేంటాడుతూనే ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని అవుకు రిజార్వయర్‌కు మరమ్మతులు అవసరమని అప్పటి జగన్ ప్రభుత్వానికి అధికారులు నివేదికలు పంపించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అవుకు రిజర్వాయర్ భద్రత ప్రమాదంలో పడింది. రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు కట్ట లోపలి భాగంలోని ఎర్రరాతి రివిట్‌మెంట్ ఒక మీటరు పొడవు, రెండు మీటర్ల వెడల్పులో కుంగిపోయింది. దీంతో చెరువు కట్ట కింద నుంచి నీరు లీకవుతోంది. రిజర్వాయర్ నిర్మించడంలో సరైన చర్యలు తీసుకోకపోవటంతో పాలేరు, తిమ్మరాజు చెరువులకు గతంలో ఉన్న తూముల వద్ద లోపాలు ఉన్నట్టు గుర్తించారు. రిజర్వాయర్ మొదటి దశ పూర్తయ్యాక 1.86 టీఎంసీల నీటిని నింపినపుడే ఇవి బయటపడ్డాయి. అప్పట్లో పాలేరు చెరువు తూము వద్ద రివిట్‌మెంటు కుంగి భారీ గండి పడటంతో పొలాల్లోకి నీరు చేరి తీవ్రనష్టం వాటిల్లింది. తిమ్మరాజు తూము వద్ద నీరు లీకవుతుండటంతో 2015లోని అప్పటి టీడీపీ ప్రభుత్వం డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ బృందంతో పరిశీలన చేయించింది. రివిట్‌మెంటు కుంగిన ప్రాంతంలో రంధ్రాలు వేసి ప్లాస్టిక్ పైపుల ద్వారా కాంక్రీట్‌ను లోపలికి పంపించి.. లీకేజీని కొంత మేర అరికట్టారు. అవుకు స్పిల్‌వే గేట్ల మరమ్మతుల కోసం రూ.2.01 కోట్లు, పాలేరు స్లూయిస్ మరమ్మతుల కోసం రూ.45లక్షల అంచనా వ్యయాన్ని రూపొందించి 2022లో అధికారులు అప్పటి వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే, జగన్ ప్రభుత్వం నిధుల విడుదలలో నిర్లక్ష్యం వహించి రిజర్వాయర్‌ను గాలికి వదిలేసింది. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ నుంచి 11,300, ఎస్సార్బీసీ నుంచి 600 క్యూసెక్కులతో పాటు, ఎర్రమల కొండల నుంచి భారీగా నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లో 4.148టీఎంసీల నిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి జీఎన్ఎస్ఎస్ ద్వారా కడప జిల్లాకు 20వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంది. కానీ, బుధవారం మధ్యాహ్నం వరకు 5,300 క్యూసెక్కులను మాత్రమే విడుదల చేయగా, సాయంత్రానికి 7వేల క్యూసెక్కులకు పెంచినట్లు తెలుస్తోంది. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోలో భారీ తేడాతో పాటు, రివిట్‌మెంటు పటిష్ఠంగా లేకపోవటంతోనే కుంగిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. గతంలో రివిట్‌మెంటు కుంగిన తిమ్మరాజు చెరువు ప్రాంతంలోనే ప్రస్తుతం మళ్లీ కుంగింది. అధికారులు రివిట్‌మెంటు కుంగిన చోట నల్లమట్టితో పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. రివిట్‌మెంటు కుంగితే ఏమవుతుందని, రివిట్‌మెంటును ఎర్రరాతితో లేదా కాంక్రీట్‌తోనే పూడ్చాల్సిన పనిలేదని, మట్టితో కూడా పూడ్చవచ్చని ఎస్సార్బీసీ డీఈ కొండన్న చెప్పడం గమనార్హం.

నీళ్లు తరలించండి: మంత్రి నిమ్మల

అవుకు జలాశయం రివిట్‌మెంట్ కుంగడంపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరా తీశారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖ అధికారులతో సమీక్షించారు. రిజర్వాయరులో నీటినిల్వను తగ్గించేందుకు వీలుగా గండికోటకు జలాలను తరలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తక్షణమే రివిట్‌మెంట్ పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు సొంత భూముల విక్రయానికి ఓకే

» స్టేటస్ కో ఉత్తర్వులు సవరిస్తాం: హైకోర్టు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్(ఆర్ఐఎన్ఎల్) తన సొంత నిధులతో కొనుగోలు చేసిన 24.99ఎకరాలు విక్రయించేందుకు అనుమతిస్తామని బుధవారం హైకోర్టు మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. ప్లాంట్ ఏర్పాటు కోసం సేకరించిన భూముల విక్రయంపై యథాతథస్థితి పాటించాలని గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు ఇచ్చింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విశ్రాంత ఐపీఎస్ అధికారి వాసగిరి లక్ష్మీనారాయణ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు అనే వ్యక్తి వేర్వేరుగా పిల్స్ వేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా స్టీల్‌ప్లాంట్ తరఫు సీనియర్ న్యాయవాది డెబ్ల్యుబీ.శ్రీనివాస్ వాదనలు వినిపించారు. హైకోర్టు ఉత్తర్వుల కారణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సొంతంగా కొనుగోలు చేసిన ఆస్తులను అమ్మలేకపోతున్నదని, ఆ ఉత్తర్వులను సవరించాలని కోరారు. అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ స్పందిస్తూ ఆర్ఐఎన్ఎల్ తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన భూములను విక్రయించుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు.

ఐదు రోజుల్లోనే
నిరుపేదకు ఇంటి స్థలం

▸ సీఎం హామీని అమలు చేసిన అధికారులు


శ్రీనుకు ఇంటి స్థల పట్టా అందిస్తున్న వీఆర్వో హనోక్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 25: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రకాశం జిల్లా అధికారులు ఐదు రోజుల్లో నెరవేర్చారు. నాగులుప్పల పాడు మండలం మద్దిరాలపాడులో ఈ నెల 20న సీఎం చంద్రబాబు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కల్లుగీత కార్మికుడు అల్లుదాను శ్రీను కుటుంబ సభ్యులను కలిశారు. పక్కా ఇల్లు లేక ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను చూసి సీఎం చలించిపోయారు. తక్షణమే శ్రీను కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఐదు రోజుల్లోనే శ్రీను కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేశారు. మూడు సెంట్ల ఇంటి స్థలం పట్టాను బుధవారం వీఆర్వో ఊదరగుడి హనోక్ శ్రీనుకు అందజేశారు. సీఎం చంద్రబాబుకు శ్రీను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో 1వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజ, నైవేద్య కార్యక్రమాలను నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

పెట్టుబడులతో రండి


సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల కంటే దీటైన మౌలిక వసతులు, పాలసీలు రూపొందిస్తామని చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అనంతపురంలో కియా మోటార్స్ కర్నూలులో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం, చిత్తూరు, నెల్లూరులో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్, ప్రకాశం జిల్లాలో బయో ఫ్యూయల్స్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కేపిటల్ రీజియన్, ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా కల్చర్, ఐటీ డెస్టినేషన్‌గా ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. విశాఖను ప్రపంచానికి డేటా హబ్‌గా మారుస్తామన్నారు. భోగాపురంలో నిర్మించే అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత రూపురేఖలనే మార్చేస్తుందని తెలిపారు. దానిని కేవలం విమానాశ్రయంగానే కాకుండా నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాలింగ్(ఎంఆర్ఓ) కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందన్నారు. విశాఖ నుంచి 15 రోజుల్లో అంతర్జాతీయ కార్గో రవాణాకు చర్యలు చేపడతామన్నారు. సరుకు రవాణాకు డెడికేటెడ్ కారిడార్ ప్రతిపాదన ఉందని తెలిపారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను త్వరగా పూర్తి చేయనున్నట్టు చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'గా మార్చి మరింత వేగవంతం చేశామన్నారు. పారిశ్రామికవేత్తలకు సౌలభ్యంగా ఉండేలా ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఐటీ, టూరిజం తదితర రంగాలకు విధానాలను రూపొందిస్తున్నామన్నారు.

మౌలిక సదుపాయాలు కీలకం

రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కీలకమని చెప్పారు. పోర్టుల అభివృద్ధి ద్వారా లాజిస్టిక్స్ వ్యయం తగ్గించుకుని వ్యాపారంలో మరింత రాణించగలుగుతామన్నారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయానికి సులువైన రవాణా సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. జీఎంఆర్ ప్రతినిధి జీబీఎస్ రాజు మాట్లాడుతూ.. విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణలో జీఎంఆర్ గ్రూప్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో సీఐఐ ప్రతినిధులు డాక్టర్ మురళీకృష్ణ, గ్రంధి రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జీఏడీ కిందకు ఏపీ ఈడీబీ

▸ సీఎస్ నీరబ్ కుమార్ ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ)ను ప్రభుత్వం పరిశ్రమల శాఖ నుంచి తప్పించింది. ప్రస్తుతం ఈడీబీ వ్యవహారాలు మొత్తం పరిశ్రమల శాఖ పరిధిలోనే నడుస్తున్నాయి. రాష్ట్రానికి కొన్ని కీలకమైన పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ఈడీబీ పని చేస్తోంది. పెట్టుబడులు తీసుకువచ్చే ఈడీబీని ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ కిందకు తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన బిజినెస్ రూల్స్‌ను ప్రత్యేకంగా విడుదల చేస్తారు. ఇకపై ఈడీబీ సాధారణ పరిపాలన శాఖ కింద పని చేస్తుంది.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

'ప్రైవేటీకరణ' వైసీపీ దుష్ప్రచారమే: మంత్రి లోకేశ్ ఆగ్రహం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగదని, దీనిపై గతంలోనే తాము స్పష్టమైన ప్రకటన చేశామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అయితే, వైసీపీ నేతలు మాత్రం అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బుధవారం విశాఖపట్నంలో మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరిస్తున్నట్టు ఎవరు ప్రకటించారో చెప్పాలన్నారు. ప్లాంటు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామని గతంలోనే తమ పార్టీ అధినేత చంద్రబాబు చెప్పారని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా కార్మికులకు అదే మాట చెప్పారని గుర్తుచేశారు. కానీ, వైసీపీ మాత్రం ప్రైవేటీకరణ జరిగిపోతోందంటూ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో స్టీల్‌ప్లాంట్‌కు వైసీపీ ఎలాంటి మేలు చేసిందో చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి గత ఐదేళ్లలో స్టీల్‌ప్లాంటు కోసం రూపాయి కూడా వైసీపీ తీసుకురాలేదని, తాము వచ్చిన మూడు నెలల్లోనే రూ.500 కోట్లు ఇప్పించామని చెప్పారు. గతంలో తాము విశాఖకు లూలూ మాల్ తీసుకువస్తే వైసీపీ నేతలు వారిని వెళ్లగొట్టారని ఆరోపించారు. అదే గనుక వచ్చి ఉంటే నగరంలో 20 వేల మందికి ఉపాధి లభించడంతోపాటు పాటు అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ అందుబాటులో ఉండేదన్నారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు.

పారిశ్రామిక కారిడార్ల మాస్టర్‌ప్లాన్‌కు సీఎం ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామిక కారిడార్లకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను ముఖ్య మంత్రి చంద్రబాబు ఆమోదించారు. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్ర బాబు అధ్యక్షతన బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఐసీడీఏ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైజాగ్-చెన్నయ్ కారిడార్ పనులకు బోర్డు ఆమోదం లభించింది. చెన్నయ్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, కృష్ణపట్నం నోడ్, కొప్పర్తి నోడ్‌ల మాస్టర్ ప్లాన్‌లను సీఎం ఆమోదించారు. కృష్ణపట్నంలో 10,834 ఎకరాలు, ఓర్వకల్లులో 9,718 ఎకరాలు, కొప్పర్తిలో 6,740 ఎకరాల్లో పారిశ్రామిక అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తారు.

రేషన్‌డీలర్లకు సర్కారు అండ

▸ మ్యానిఫెస్టో హామీలు అమలు చేస్తాం: టీడీ జనార్దన్

▸ బెజవాడలో జాతీయ రేషన్ డీలర్ల సమావేశం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడంతో గత ఐదేళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న రేషన్ డీలర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ భరోసా ఇచ్చారు. రేషన్ డీలర్ల సమస్యలపై ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేషన్ డీలర్ల పక్షపాతి అన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి బిస్వంబర్ బసు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి త్వరలో దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని చెప్పారు. అనంతరం రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు, తెలంగాణ అధ్యక్షుడు నాయకోటి రాజు మాట్లాడారు.

లడ్డూ కల్తీ నిగ్గు తేల్చాలి : సీపీఐ

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : తిరుమల లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే అంశంపై నిగ్గు తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మత విశ్వాసాలతో ఆటలాడుకోవడం రాష్ట్రానికి ప్రమాదకరమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన 'సిట్' దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా నివేదిక సమర్పించాలని కోరారు. సిట్ నివేదిక వచ్చేవరకు రాజకీయ పార్టీలు, ధార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు సంయమనం పాటించాలన్నారు.

జనసేనలోకి బొత్స తమ్ముడు లక్ష్మణరావు

▸ అదే బాటలో మరికొందరు..!

విజయనగరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా వైసీపీలో భారీ కుదుపు వచ్చింది. సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యుడు, అన్న కనుసన్నల్లో నడిచే తమ్ముడు బొత్స లక్ష్మణరావు కీలక రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. కుమారుడి రాజకీయ జీవితాన్ని దృష్టిలో పెట్టుకొని జనసేనలోకి వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారు. లక్ష్మణరావు గత అసెంబ్లీ ఎన్నికల నుంచే వైసీపీకి దూరంగా ఉంటున్నారు. జనసేనకు అనుకూలంగా మాట్లాడేవారని ఆయన అనుచరులు చెబుతున్నారు. వైసీపీ హయాంలో నెల్లిమర్ల ఎమ్మెల్యేగా ఉన్న బడుకొండ అప్పలనాయుడితో విభేదించిన లక్ష్మణరావు ఆ తరువాత నియోజకవర్గంలో తనకంటూ ఒక వర్గాన్ని సమీకరించుకున్నారు. క్రమంగా వారి మధ్య దూరం మరింత పెరిగింది. మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన ఈ స్థానం నుంచి అభ్యర్థిగా నిలిచిన లోకం నాగమాధవికి మద్దతు ప్రకటిస్తూ ఆమె విజయానికి సహకరించారని సమాచారం. కుమారుడు చైతన్య, అనుచరులతో కలిసి అక్టోబరులో జనసేనలో చేరనున్నట్లు లక్ష్మణరావు బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వైసీపీకి మాజీ ఎమ్మెల్యే రెహమాన్ రాజీనామా

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), సెప్టెంబరు 25: వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్ ప్రకటించారు. బుధవారం నగరంలోని డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం పెద్దలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లిం నేతల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. హజ్ యాత్రికులకు రూ.లక్ష వంతున చెల్లింపు, నూర్ బాషా ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు, ముస్లింల ఆస్తుల పరిరక్షణకు సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడంతో తాను వైసీపీకి రాజీనామా చేసినట్టు చెప్పారు.

బడులు తెరిచే నాటికి స్టూడెంట్ కిట్లు సిద్ధం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో బడులు తెరిచే నాటికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర-స్టూడెంట్ కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉంచుతామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. స్టూడెంట్ కిట్ల కొనుగోళ్లకు షెడ్యూలు వెల్లడిస్తూ ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల నాలుగో వారంలో బడ్జెట్ అంచనాలు రూపొందించాలని, అక్టోబరు రెండో వారానికి ఆర్థిక అనుమతులు పొందాలని స్పష్టంచేశారు. అక్టోబరు నాలుగో వారంలో టెండర్లు పిలవాలని, డిసెంబరు మొదటి వారంలో టెండర్లు ఖరారు చేసి, మూడో వారంలో వర్క్ ఆర్డర్లు జారీ చేయాలన్నారు. ఏప్రిల్ రెండో వారం నుంచి స్కూల్ కాంప్లెక్స్‌లకు కిట్లు డెలివరీ ప్రారంభం కావాలని, జూన్ 12న బడులు తెరిచే రోజున పంపిణీకి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

'నాడు-నేడు' పనుల జాప్యానికి విద్యార్థి బలి

పాఠశాల సన్‌షేడ్ కూలి బాలుడు మృతి
ఆస్పత్రికి తరలించడంలో ఉపాధ్యాయుల ఉదాసీనత


కృష్ణంరాజు

రణస్థలం, సెప్టెంబరు 25: 'నాడు-నేడు' పనుల నిర్లక్ష్యం ఓ విద్యార్థి ప్రాణాలను బలిగొంది. అపస్మారక స్థితిలో ఉన్నా ఉపాధ్యాయులు స్పందించకపోయినా, తోటి విద్యార్థులు చెక్క బల్లపై అతి కష్టమ్మీద ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు కాపాడలేకపోయారు. ఈ విషాద ఘటన శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతర్లపల్లిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పాతర్లపల్లి గ్రామానికి చెందిన వనుము కృష్ణంరాజు (15) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం తోటి విద్యార్థులతో నిర్మాణంలో ఉన్న భవనం సన్‌షేడ్ ఎక్కడంతో అది ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో కృష్ణంరాజు సన్‌షేడ్ కింద ఉండిపోయాడు. తొమ్మిదో తరగతి విద్యార్థి కోరాడ శ్రీరామ్‌కూ గాయాలు అయ్యాయి. తోటి విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వారు వచ్చి కృష్ణంరాజును బయటకు తీసేసరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వాహనంలో తరలించే ఏర్పాటు చేయకపోవడంతో తోటి విద్యార్థులే చెక్క బల్లపై కృష్ణంరాజును పడుకోబెట్టి హైస్కూల్‌కు అర కిలోమీటరు దూరంలో ఉన్న పాతర్లపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లేటప్పటికి కృష్ణంరాజు ప్రాణాలు వదిలాడు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే తమ పిల్లాడి ప్రాణం తీసిందని తల్లిదండ్రులు మండిపడ్డారు. ఘటనా స్థలానికి స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేరుకుని విద్యార్థి మృతిపై ఆరా తీశారు. కృష్ణంరాజు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు ఆర్థిక సహాయం మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పాఠశాల నాడు-నేడు పనులు ఎందుకు ఇంత జాప్యం జరిగిందో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా, పాతర్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి మృతి చెందడంపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో ఆ భవనం నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారని తెలిపారు. పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


సాయిశ్రియ

మా బిడ్డ మరణానికి కారణాలు చెప్పండి!

▸ హైదరాబాద్ నుంచి వచ్చిన తల్లిదండ్రులు

▸ వారం క్రితం వీఐటీ హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్య

▸ క్యాంపస్‌లోనికి వెళ్లకుండా అడ్డుకున్న సెక్యూరిటీ

తుళ్లూరు, సెప్టెంబరు 25: వీఐటీ-అమరావతి ఏపీ విశ్వవిద్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న తమ కుమార్తె సాయిశ్రియ(19) మరణానికి పూర్తి కారణాలేమిటనేది చెప్పాలని ఆమె తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన వారు.. విట్ క్యాంపస్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీనిపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీరుమున్నీరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన సాయిశ్రియ విట్ హాస్టల్ క్యాంపస్‌లో ఉంటూ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదివేది. ఈ నెల 17న హాస్టల్‌లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే తమ కుమార్తె మరణంపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకున్నరోజు.. తాము వచ్చేదాక ఆగకుండా మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించేశారని సాయిశ్రియ తల్లి తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు చెప్పండని వైస్ చాన్సలర్‌ను కలిసేందుకు వస్తే బయటికి గెంటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన రోజే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ-2 అంజయ్య చెప్పారు. తోటి విద్యార్థి సాయిశ్రియను ప్రేమించాడని, ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మనస్తాపం చెంది విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరి వేసుకుందని, పోస్టుమార్టం నివేదిక వస్తే వివరాలు తెలుస్తాయన్నారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

మెడికవర్ ఆస్పత్రి ఇప్పుడు బెంగళూరులోనూ!

▸ 300 పడకలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

▸ అధునాతన సౌకర్యాలు, అత్యాధునిక ల్యాబ్‌లు ప్రారంభించిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

▸ రాబోయే 3-4 ఏళ్లల్లో అక్కడ మరో నాలుగైదు ఆస్పత్రులు


కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సత్కరిస్తున్న మెడికవర్ గ్రూపు ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధునాతన సమగ్ర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలతో మెడికవర్ యాజమాన్యం కొత్తగా మరో ఆస్పత్రిని బెంగళూరులో బుధవారం ప్రారంభించింది. రూ.120 కోట్లతో రెండున్నర లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో, 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్డియాక్ సైన్స్, ఆర్థోపెడిక్స్, న్యూరో సైన్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో సైన్స్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని వైద్యవర్గాలు తెలిపాయి. వైద్య పరీక్షలకు సంబంధించిన అత్యాధునిక ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు మెడికవర్ యాజమాన్యం తెలిపింది. క్యాథ్‌ల్యాబ్, 3టీ ఎంఆర్ఐ, సీటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే లాంటి యంత్రపరికరాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది. ఓపీ కోసం ప్రత్యేకంగా 45 రూమ్‌లను, వంద పడకలతో ఐసీయూ, ఎన్ఐసీయూ, పీఐసీయూ, కార్డియాక్ ఐసీయూ, ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ, డేకేర్ సపోర్ట్, 24 గంటల ఎమర్జెన్సీ ట్రామాకేర్ సదుపాయం ఉన్నట్లు వెల్లడించింది. తమ ఆస్పత్రిలో కాగితరహిత విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపింది. తమ కార్యకలాపాల్లో సమగ్ర కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించనున్నట్లు పేర్కొంది. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రలో ఉన్న మెడికవర్ ఆస్పత్రులు ఇప్పుడు కర్ణాటక రాష్ట్రంలో కూడా అడుగుపెట్టాయి. బెంగళూరు నూతనంగా ఏర్పాటైన మెడికవర్ ఆస్పత్రిని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కన్నడనాట వైద్యరంగంలో మెడికవర్ ఆస్పత్రులు రావడం గొప్పమార్పునకు సంకేతం అని, అన్ని రాష్ట్రాల్లో కలిపి ఈ గ్రూపునకు 24 ఆస్పత్రులున్నాయన్నారు. మెడికవర్ యాజమాన్యానికి తమ ప్రభుత్వం నుంచి మద్దతు తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మెడికవర్ గ్రూపు ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడారు. తమ గ్రూపు ఆస్పత్రుల్లో 14 వేల మంది నిపుణులు పనిజేస్తున్నారని, ఇందులో వైద్యులు, నర్సులు, ఇతర పారామెడికల్ సిబ్బంది ఉన్నారని, కొత్తగా బెంగళూరులో ఏర్పాటైన మెడికవర్‌లో మరో 1000 మంది వైద్య సిబ్బందికి ఉపాధి లభించనుందని తెలిపారు. రాబోయే మూడు నాలుగేళ్లలో బెంగళూరులో మరో4-5 నూతన ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామని, ఫలితంగా దేశవ్యాప్తంగా తమ ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 6 వేలకు చేరుతుందని వెల్లడించారు.

మాగుంట పార్వతమ్మ కన్నుమూత

▸ సీఎం చంద్రబాబు, వెంకయ్య నాయుడు సహా పలువురు ప్రముఖుల సంతాపం

▸ ప్రభుత్వ లాంఛనాలతో నెల్లూరులో నేడు అంత్యక్రియలు


పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి, పక్కన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

చెన్నై, నెల్లూరు, అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ (77) బుధవారం తెల్లవారుజామున కనుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం చెన్నైలో తుది శ్వాస విడిచారు. మాగుంట కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న పార్వతమ్మ మృతి ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. 1947 జూలై 27న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో బెజవాడ రామిరెడ్డి, భూదేవమ్మ దంపతులకు ఆమె జన్మించారు. 1967 ఫిబ్రవరి 19న మాగుంట సుబ్బరామిరెడ్డితో వివాహం జరిగింది. ఆయన మరణానంతరం రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె... 1996లో ఒంగోలు ఎంపీగా, 2004లోగా కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2012లో ఒంగోలు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. భర్త ఆశయాలకు అనుగుణంగా, రాజకీయాల పరంగా ఒంగోలు, కావలి ప్రాంతాల్లో పార్వతమ్మ తనదైన ముద్ర వేసుకున్నారు. పార్వతమ్మ భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం చెన్నై నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. పార్వతమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు విజయ్‌బాబు అనారోగ్యంతో గత ఏప్రిల్‌లో మృతి చెందడంతో మనోవేదనకు గురయ్యారు. పార్వతమ్మ పార్థివ దేహాన్ని నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న నివాసంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. గురువారం మధ్యాహ్నం పార్వతమ్మ అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పార్వతమ్మ మృతి బాధాకరం: సీఎం

పార్వతమ్మ మృతిపట్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాగుంట పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, ఆనం, స్వామి, శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణ... పార్వతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కోటంరెడ్డితోపాటు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, చెన్నైలోని పలువురు తెలుగు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు సంతాపం ప్రకటించారు.

ఎమ్మెల్యే ఆదిమూలానికి హైకోర్టులో ఊరట

▸ ఆయనపై లైంగిక వేధింపుల కేసు కొట్టివేత

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు హైకోర్టులో ఊరట లభించింది. తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎమ్మెల్యే ఆదిమూలంపై తిరుపతి తూర్పు పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం తీర్పు ఇచ్చారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై పలుమార్లు లైంగిక దాడి చేసి, అత్యాచారానికి పాల్పడ్డారంటూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాని ఆధారంగా తిరుపతి తూర్పు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై తాను చేసిన ఆరోపణలు అన్నీ అవాస్తవమేనని న్యాయస్థానానికి నివేదించారు. ఈ నేపథ్యంలో కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొలిటికల్ ఎన్‌కౌంటర్

మహారాష్ట్రలోని థానేజిల్లా బద్లాపూర్ స్కూల్లో ఇద్దరు పిల్లలపై లైంగిక దాడిచేసిన అక్షయ్ షిండే సోమవారం ఎదురుకాల్పుల్లో మరణించడంమీద ముంబై హైకోర్టు బుధవారం అనేక అనుమానాలు వ్యక్తంచేసింది. ఏమాత్రం నమ్మదగ్గట్టుగా లేదనీ, ఓ కట్టుకథలాగా కనిపిస్తున్నదని ఆక్షేపించింది. పాఠశాలలో చోటుచేసుకున్న అత్యాచార ఘటనకు సంబంధించి ఒక పక్క విచారణ జరుగుతూండగా, నిందితుడిమీద అతని మొదటిభార్య పెట్టిన కేసులో ప్రశ్నించడానికి పోలీసులు సిద్ధమైనారు. తలోజా జైల్లో ఉన్న అతడిని బద్లాపూర్ తీసుకుపోతుండగా, మార్గమధ్యంలో అక్షయ్ షిండే తప్పించుకొనే ప్రయత్నంలో ఒక పోలీసునుంచి తుపాకీ లాక్కొంటే మరో పోలీసు అధికారి కాల్పులు జరిపాడు, దీంతో నిందితుడు మరణించాడు. ఈ ఎన్‌కౌంటర్ మీద ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు అయినా నిజాయితీగా జరిగేట్టు చూడాలని కోర్టు వ్యాఖ్యానించింది.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరొందిన సంజయ్‌షిండే అనే పోలీసు అధికారి చేతిలో అక్షయ్‌షిండే అనే ఈ నిందితుడు మరణించినట్టుగా ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చేసిన ప్రకటన రాజకీయంగా కూడా అగ్గిరాజేసింది. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని విపక్షాలు వ్యాఖ్యానించినందుకు ఒక పాపిని వెనకేసుకొస్తున్న పాపం మీకు తగులుతుందని బీజేపీ నాయకులు శపిస్తున్నారు. బద్లాపూర్ ఘాతుకం మహారాష్ట్రనే కాదు, యావత్ దేశాన్ని నిర్ఘాంతపరచింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు భద్రతలేదని, రక్షణకరువై వారు నిస్సహాయంగా అత్యాచారాలకు గురికావాల్సి వస్తున్నదని పశ్చిమబెంగాల్ ఉదంతం గుర్తుచేసిన తరుణంలోనే, అభంశుభం తెలియని పిల్లలకు చివరకు అక్షరాలు దిద్దేచోటకూడా రక్షణలేకుండా పోయిందని బద్లాపూర్ ఘటన హెచ్చరించింది. బెంగాల్ అత్యాచార ఘటనమీద వీరోచితమైన పోరాటం సాగిస్తున్న బీజేపీని బద్లాపూర్ ఆత్మరక్షణలోకి నెట్టేసింది. వందలాదిమంది వీధుల్లోకి వచ్చి ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. రైళ్ళరాకపోకలను నిలిపివేశారు, విధ్వంసకాండకు పాల్పడ్డారు.

అరెస్టులు, సస్పెన్షన్లు, సిట్ ఏర్పాటు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ ఇత్యాదివి ప్రకటించి, సీనియర్ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించినప్పటికీ, ఈ ఉదంతం తమకు రాజకీయంగా తీవ్ర నష్టం చేస్తుందన్న భయం పాలకులకు లేకపోలేదు.

ఈ నేపథ్యంలో నిందితుడి ఎన్‌కౌంటర్‌ను మిగతా రాజకీయపక్షాలు అనుమానించడం, ప్రశ్నించడం సహజం. కేసు దర్యాప్తు, విచారణ కొనసాగినంత కాలం, మీడియాలో ఆ వార్తలు వినబడుతున్నంత వరకూ సదరు ఘోరం ప్రజలకు గుర్తుకొస్తూనే ఉంటుంది కనుక అధికారపక్షానికి ఆ మేరకు నష్టం తప్పదు. బుధవారం నాటి వ్యాఖ్యలను బట్టి దానిని బూటకపు ఎన్‌కౌంటర్ గా న్యాయస్థానం భావిస్తున్నదని అర్థం. నిందితుడు మూడుబుల్లెట్లు పేల్చితే ఒకటి మాత్రమే పోలీసు అధికారి తొడలోకి దూసుకుపోతే, మిగతా రెండు బుల్లెట్లు ఏమైనాయని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇందుకు ప్రతిగా సదరు ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు కాల్చిన ఒకే ఒక్క బుల్లెట్ నేరుగా నిందితుడి తలలోకి దూసుకుపోయి అతడు అక్కడికక్కడే మరణించాడు. కారులో మరో నలుగురు ఉన్నా నిందితుడు మీదకు లంఘించి నియంత్రించకపోవడం, పోలీసుల నుంచి అతడు తుపాకీ లాక్కోవడం, అతి సులువుగా సెకన్లలో లాక్ తీసి పోలీసు అధికారి దిగువభాగంలో కాల్చడం ఇత్యాది ప్రతీ దశమీదా న్యాయమూర్తి వెలిబుచ్చిన అనుమానాలు సామాన్యులకు సైతం కలిగేవే.

న్యాయస్థానం ఎంతగా హూంకరించినప్పటికీ, తమకు ఒనగూరే నష్టమేమీ లేదని, ఈ ఎన్‌కౌంటర్‌తో బద్లాపూర్ కథ సుఖాంతమైందని పాలకులు నమ్ముతున్నారు. 'బద్లా పూరా' అంటూ తుపాకీ ధరించిన ఫడ్నవీస్ కటౌట్‌లు మహారాష్ట్రలోని చాలా ప్రాంతాల్లో దర్శనమిచ్చాయి. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఏలిన పవిత్రభూమిలో ఆడపిల్లమీద అఘాయిత్యాలకు పాల్పడే దుర్మార్గులకు శిక్షలు ఇలాగే ఉంటాయి అని వాటిమీద రాశారు. ఈ నకిలీ ఎన్‌కౌంటర్ కీర్తి తమ నాయకులకు దక్కాలని ఫడ్నవీస్, షిండే అభిమానులు పోటీపడుతున్నారు. తమ కుమారుడిని అన్యాయంగా చంపేశారంటూ నిందితుడి తల్లిదండ్రులు గుండెలుబాదుకుంటున్నా, హక్కుల సంఘాలు ప్రశ్నిస్తున్నా, ఈ తక్షణన్యాయానికి సామాన్యజనం తన్మయులై తమను కీర్తిస్తున్నందుకు పాలకులు సంతోషిస్తున్నారు. జమ్మూకశ్మీర్, హర్యానాతో పాటు జరగాల్సిన మహారాష్ట్ర ఎన్నికలను ఎన్నికల సంఘం ఏ కారణంతో వాయిదావేసినప్పటికీ, నవంబరులో అవి జరగవచ్చునని అంటున్న తరుణంలో ఈ నకిలీ ఎన్‌కౌంటర్ తమకు మరో నాలుగు ఓట్లు తెస్తుందని పాలకులు గట్టిగా నమ్ముతున్నారు.

ఆయన సన్నిధి సాహిత్య పెన్నిధి

స్వాతంత్ర్య సమరంతో సమాంతరంగా తెలుగునాట సాగిన గ్రంథాలయోద్యమం.. తెలుగు జాతికి మహోపకారం చేసింది. నాలుగు తరాల సాహితీ పిపాసులకు ఆశ్రయమిచ్చింది. తొలినాళ్ళలో, పలువురు ఉద్యమనేతలు, స్వచ్ఛంద సంస్థలు నెలకొల్పిన గ్రంథాలయాలు, ఆ తర్వాత కాలంలో ప్రభుత్వ అధీనంలోకి వెళ్ళిపోయాయి. కందుకూరి వీరేశలింగం, అయ్యంకి వెంకటరమణయ్య పంతులు, పాతూరి నాగభూషణం, జయంతి రామలక్ష్మణమూర్తి, వావిలాల గోపాలకృష్ణయ్య వంటి మహనీయులెందరో గ్రంథాలయోద్యమ సారథులుగా తెలుగు సాహితీ చరిత్రలో నిలిచిపోయారు.

ఈ గ్రంథాలయాల నిర్వహణకు ప్రభుత్వాలు గ్రంథాలయాల పాలకుల వ్యవస్థ నేర్పాటు చేశాయి. వారిలో అత్యధికులు వారి వారి శాఖా గ్రంథాలయాల బాధ్యతలు నిర్వహించి పాఠకుల హృదయాలలో నిలిచిపోయారు. అయితే, గ్రంథాలయం నిర్వహణ బాధ్యతలు అపురూపంగా నిర్వహించడమే కాకుండా, అనేక గ్రంథాలయాలను పరిశీలించి అపూర్వ సాహితీ పరిజ్ఞానాన్ని ప్రోది చేసుకున్న సాహితీమూర్తి సన్నిధానం నరసింహశర్మ. వేల గ్రంథాల, సంపుటాలను, దిన, వార, మాసపత్రికలను ఔపోసన పట్టిన సాహితీ భగీరథుడు సన్నిధానం వారు. వంశపారంపర్యంగా వచ్చిన సాహితీ జిజ్ఞాస వలన గ్రంథాలయ పాలన, ఓ పవిత్రమైన బాధ్యతగా భావించిన నిబద్ధత ఆయన స్వంతం. తన శాఖలోకి అడుగుపెట్టిన అపరిచిత సాహితీవేత్తలను, సాహిత్య పిపాసులను అనతికాలంలోనే తన ఆత్మబంధువులుగా మార్చుకొనే వశీకరణ మంత్రమేదో ఆయనకు తెలిసి ఉండాలి. లేకపోతే, ఏదో సమాచారం కోసం రాజమహేంద్రవరం శ్రీ గౌతమీ గ్రంథాలయానికి వెళ్ళిన, తెలుగు సాహితీ స్రష్టలను, తన ఇంటి అతిథులుగా మార్చి, వారికి షడ్రసోపేతమైన విందుతో పాటు, సాహితీ విందులను ఏర్పాటు చేయడం అందరికీ సాధ్యంకాని పని.



"కొండ అద్దమందు కొంచెమై ఉండదా..." అన్నట్లు, విశేష పాండితీ సంపన్నులు సన్నిధానం నరసింహశర్మకు ఇప్పటికే ఎన్నో సత్కార, పురస్కారాలు లభించాయి. అయినా, కోట్లాది మంది తెలుగువారిలో గొప్ప సాహిత్యవేత్త, విశేషవక్త అయిన ఆయనకు విశ్వవిద్యాలయాల, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో సరైన పురస్కారాలు లభించకపోవడం దురదృష్టకరం.

ఆ మహానుభావుడికి సాంఘిక, సామాజిక రాగద్వేషాలు తెలియవు. సాహితీ ప్రక్రియల రాగద్వేషాలు లేవు. మానవత్వం అతని సాహితీ మనస్తత్వం. తెలుగు సాహిత్యంలో, అజరామరమైన సంప్రదాయ ఛందోబద్ధ సాహితీ దిగ్గజాలతో పాటు, అభ్యుదయ, జానపద, వామపక్ష భావజాల సాహితీవేత్తలతో ఆయనది వ్యక్తిగత అనుబంధం. చివరికి, వామపక్ష సాహిత్య ప్రస్థానంలో, ఒక దశలో సంచలనాలు సృష్టించిన దిగంబరకవులు కూడా, సన్నిధానం నరసింహశర్మ సాహితీ వాత్సల్యానికి ఫిదా అయిపోయిన, అనితర సాధ్యమైన సాహితీయజ్ఞ సోమయాజి.

తెలుగులో వివిధ ప్రక్రియలలో, వక్తలుగా పేరుగాంచిన ప్రసిద్ధులెందరో... కానీ, వారితో సమతూగగలిగిన ప్రతిభా పాటవాలు కలిగివుండీ, ఎవరు ప్రసంగించినా, ఎవరు మాట్లాడినా, ఏమీ తెలియనట్లు అమాయకతనంతో వినడం ఆయనకే చెల్లు. అరుదైన వక్త. బాగా శ్రద్ధగా వింటేనేకానీ, ఆయన వక్తృత్వపు విశ్వరూపం శ్రోతలు, పాఠకులు దర్శించలేరు. అద్భుతమైన అంశాలు, అపురూపమైన చరిత్రలు అలవోకగా ప్రసంగిస్తూ, మధ్య మధ్యలో, "నేను సరిగ్గా మాట్లాడుతున్నానో లేదో?" అన్నట్లు, శ్రోతల వైపు అమాయకపు దృక్కులు సారిస్తుంటారు. మాట్లాడటం కంటే, వినడం, చదవడం, పరిశీలన, పరిశోధన ఓ తపస్సులా భావించారు. కాబట్టే, ఏ సభలో, ఏ అంశంపై ప్రసంగించినా, అభిరుచి కలిగిన శ్రోతలకు గొప్ప సాహితీ విందు ఆయన ప్రసంగాలు.

విశాఖపట్నంలో నాలుగు దశాబ్దాల సాహితీ సభల పరిచయాలు, సాహితీ దిగ్గజాల అనుబంధం కలిగిన సామాన్య సాహిత్యాభిలాషినైన నేను, దశాబ్దం క్రితం తొలిసారి, బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతి సభలో సన్నిధానం వారి ప్రసంగం విని గొప్ప అనుభూతికి లోనయ్యాను. ఆ తర్వాత విశాఖలో, కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుతరామరాజు స్మారక పురస్కారం స్వీకరించిన సభ, 2020 మార్చిలో తూర్పుగోదావరి జిల్లా పల్లిపాలెంలో జరిగిన కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యన్నారాయణ శాస్త్రి శతజయంతి సభల వంటి సందర్భాలలో, సన్నిధానం నరసింహశర్మ సాహితీ ప్రసంగధారలో తడిసి ముద్దయిన ధన్యుణ్ణి. వందల పద్యాలు ఆయన నాలుకపై నాట్యం చేస్తుంటాయి. వేలాది అంశాలు అలవోకగా జాలువారుతాయి. చరిత్ర తారీఖులు, దస్తావేజులతో సహా వల్లెవేయడం సన్నిధానం శైలి.

ఆర్థిక, రాజకీయ రిజర్వేషన్ల కోసం, అధికార ప్రాపకం కోసం అర్రులుచాచే, వెనుకబడిన సామాజిక వర్గాలు ఒక్క శాతం వారికీ తెలియని మహా సాహితీమూర్తులు నేదునూరి గంగాధరం అపురూప సాహితీ పాండిత్య ప్రకర్షను అక్షరబద్ధం చేసి అందించిన సౌహార్ద్రమూర్తి. గొప్ప కథకులు, రంధి సోమరాజు సాహితీప్రస్థానం గురించి ఈ తరానికి గుర్తుచేశారు. ఎనిమిది పదుల వయస్సులోనూ, ఇటీవల విశాఖపట్నంలో జరిగిన, రా.వి. శాస్త్రి జయంతి సభ, అజో–విభో, కందాళం ఫౌండేషన్ వారి విశ్వనాథ రామాయణం సభలకు, హైదరాబాదు నుంచి వచ్చి శ్రోతగా పాల్గొన్న చైతన్యశీలి.

"కొండ అద్దమందు కొంచెమై వుండదా..." అన్నట్లు, విశేష పాండితీ సంపన్నులు సన్నిధానం నరసింహశర్మకు ఇప్పటికే ఎన్నో సత్కార, పురస్కారాలు లభించాయి. అయినా, కోట్లాది మంది తెలుగువారిలో గొప్ప సాహిత్యవేత్త, విశేషవక్త అయిన ఆయనకు విశ్వవిద్యాలయాల, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో సరైన పురస్కారాలు లభించకపోవడం దురదృష్టకరం. ఆ చింత ఆయన కేనాడూ లేకపోయినా, ఆయన అభిమానులు, శ్రేయోభిలాషుల తీరని ఆవేదన ఇది. ఈ నెల 26న హైదరాబాద్ త్యాగరాయ గానసభలో సన్నిధానం నరసింహశర్మ 'కిన్నెర–చిలకమర్తి స్మారక సాహితీ పురస్కారం' స్వీకరిస్తున్న సందర్భంగా వారికి సాహిత్యాభివందనాలు.

• బి.వి. అప్పారావు

శ్వాస తెగిపోయాక, ఇక ఏమి సుందరీకరణ?



ఒకప్పుడేమో ప్రజలు మాకు అవి కావాలి, ఇవి కావాలి అని ప్రభుత్వాన్ని గట్టిగా అడిగేవారు, ఆలకించకపోతే ఆగ్రహించేవారు, ఆవేశపడేవారు. అయినా అడిగినవాటిని ప్రభుత్వం ఇచ్చేది కాదు. అడిగితే ఇవ్వడానికి నేనంత లోకువనా? ఉక్కుపాదంతో నొక్కిపెడతాను కానీ, ససేమిరా ఇవ్వననేది. కొంత హింస, కొన్ని బలులు జరిగాక, ఎంతో కొంత కొసరి విసిరేది.

ఇప్పుడు ప్రభుత్వాలు చాలా మారిపోయాయి. అడిగేది ఇవ్వరు సరే, కానీ, అడగకుండానే చాలా ఇస్తున్నాయి. అక్కర లేదు దొరలారా, అంటున్నా, ఫ్యూచర్ సిటీలట, ఫార్మా విలేజిలట, మహా జలాశయాలట, పన్నెండు వరసల రోడ్లట, అణుకర్మాగారాలట ఎన్నెన్నో నిర్మిస్తామంటున్నారు. అంతటి అభివృద్ధికి ఉడతాభక్తిగా జనం తమ కాలి కింది నేలనో, పంటనిచ్చే పొలాన్నో, పచ్చటిచెట్లూ పారేనీరూ ఇచ్చే ఆరోగ్యాన్నో సమర్పించుకుంటే చాలట. ఇంత అభివృద్ధి తీసుకువస్తుంటే ఆ మాత్రం త్యాగం చేయలేరా, మహాజనులారా?

ఒకప్పుడు అడిగినవి ఇవ్వకపోవడంలో వారికేదో నష్టం ఉండి ఉండాలి. ఇప్పుడు అడగనివి ఇవ్వడంలో వారికేదో లాభం ఉండి ఉండాలి.

ఇప్పటి అయాచిత ఉపద్రవం పేరు, దామగుండం.

వాళ్ల అభివృద్ధి ఇస్తామంటారు, ప్రజలు కాదంటారు. వాళ్లది దేశభక్తియుత ఘనకార్యం అవుతుంది. ప్రజలది అభివృద్ధి నిరోధక దేశద్రోహం అవుతుంది.

హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో, మూసీనది ప్రవాహ ప్రాంతంలో, దామగుండం రక్షితారణ్యంలో 2900 ఎకరాలలో భారత నావికాదళం 'వెరీ లోఫ్రీక్వెన్సీ' రాడార్ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఆ భూమిలో కొన్ని లక్షల వృక్షాలున్నాయి. ఈ కేంద్రం నిర్మాణానికి బహుశా పన్నెండు లక్షల చెట్లు కొట్టేస్తారు. అందువల్ల, హైదరాబాద్ పరిసరాలలో అసలే క్షీణించి ఉన్న పచ్చదనం మరింత మాయమవుతుంది. కాలుష్యభాగ్య నగరానికి బిగించిన వెంటిలేటర్లలో ఒకటి కన్నుమూస్తుంది. ఆ కేంద్రం చుట్టూ రేపు వెలిసే కొత్త సందడి మరింత అడవికోతకు, మరింత అభివృద్ధికి దారితీసి, మూసీ గొంతు ఇంకా బిగుసుకుంటుంది. సొంత నీరు లేకుండానే సుందరీకరణ జరిగిపోతుంది.

నావికాదళానికి ఈ రాడార్ కేంద్రం అత్యవసరమైన సాంకేతిక వ్యవస్థే అయి ఉండాలి. తమకు పెద్ద నష్టం లేకపోతే, దేశరక్షణకు అవసరమైన ఒక నిర్మాణాన్ని ప్రజలు అనుమతించాలి, అనుమతిస్తారు కూడా. కానీ, నష్టాన్ని ఎవరు, ఎట్లా అంచనా వేయాలి? ఇక్కడి నష్టం చిన్నది కాదు, ఒక స్థలానికి, కాలానికి మాత్రమే పరిమితమైనది కాదు. గాలిని, నీటిని, జీవులను అందరినీ నిర్వాసితులను చేసే నష్టం. ప్రత్యామ్నాయం రక్షణశాఖకు అసాధ్యం కాదు. ఆ ప్రయత్నమే వారు చేసినట్టు లేదు.

ఇదేదో ఉన్నట్టుండి, గండిపేట గేట్లు తెరవాల్సివచ్చినంత అర్జెంటుగా ముంచుకువచ్చిన సమస్య కాదు. దీనికి నేపథ్యం పదేళ్ల పై మాటే. చుట్టుపక్కల పల్లెల్లో కొంత కలవరం, కొంత కలకలం కనిపించినా, లోకం పెద్దగా పట్టించుకోకపోవడంతో, నివురు గప్పిపోయింది. దామగుండం స్వామిగా పేరుపొందిన సత్యానందస్వామి మాత్రం రాబోయే ప్రమాదం గురించి నాటి నుంచి నేటి వరకు హెచ్చరించడం మానలేదు. స్వతంత్ర జర్నలిస్టు చందు తులసి చొరవతో, దామగుండం మళ్లీ వార్తలలోకి వచ్చింది. విడియో కథనంతో తెలంగాణ ఉలిక్కిపడింది. సేవ్ రామగుండం జేఏసీ తిరిగి రంగంలోకి దిగింది. మొన్న ఆదివారం దీక్షలతో పౌరసమాజం సంఘటితమైంది. ప్రతిపక్షం తానూ ఉన్నానని గుర్తు చేసింది. మోహరింపు మొదలైంది.

పర్యావరణం గురించి, వనరుల పరిరక్షణ గురించి పట్టింపుతో ఉన్నవారిని వెక్కిరించడం కూడా నేటి నవసంపన్నుల కాలక్షేపం. దేశరక్షణతో ముడిపడిన 'అభివృద్ధి' విషయం అంటే, ఇక ఉద్యమకారుల నైతికత మీద దాడిచేయడానికి అవకాశం దొరికిందని వారికి సంబరం. అందుకే ప్రకృతికి ఇవ్వవలసిన భద్రతను ఉపసంహరించడానికి, లాభార్జనపరులకు కట్టబెట్టడానికి దేశరక్షణను ఒక సాకుగా చేసుకోవడం కూడా ప్రభుత్వాలు చేస్తున్నాయి. చూద్దాం, దామగుండం పల్లెల్లో ఈ సారి పోరు బతకమ్మ ఆడతారట, చెట్లను కావలించుకుని మరో చిప్కో ఉద్యమం చేస్తారట!

ఈ రాడార్ కేంద్రానికి కావలసిన భూమిని కొన్ని నెలల కిందట తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేవీ వారికి బదలాయించారు. అట్లాగని, ఇదంతా ఆయన ప్రభుత్వం ప్రారంభించింది కాదు. కానీ, కేంద్రంలో కాంగ్రెస్ హయాంలోనే దీనికి పునాది పడింది. భారత నావికాదళ బృందం 2007లో సర్వే చేసుకుని వెళ్లి, 2010లో ప్రతిపాదన పంపడంతో ప్రక్రియ మొదలైంది. భూమి బదలాయింపునకు కావలసిన సన్నాహకాలు, సానుకూల ప్రచారాలు, గ్రామసభల నిర్వహణ అన్నీ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. కోర్టులో స్టే ఉండడంతో, భూమి బదలాయింపు మాత్రం జరగలేదు. ఆ అడ్డు తొలగడంతో ఈ ఏడాది జనవరి 24 నాడు లాంఛనం పూర్తయింది. నిర్మాణ కార్యక్రమాలు ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్నాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

వ్యవసాయ భూములూ, ఊర్లూ ఈ ప్రాజెక్టులో నష్టపోవడం లేదు. దామగుండం అడవి మధ్యలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన వేల ఏకరాల భూమి, నేవీ ప్రతిపాదనలు మొదలైన కాలంలోనే, ఎట్లా అటవీ శాఖ చేతిలోకి పోయిందో ఇంద్రజాలమే? మొత్తానికి రాడార్ కేంద్రానికి అనుకూలంగా భూమి దఖలు జరిగింది. వ్యక్తిగత కమతాలేవీ ఆ భూమిలో లేవు. ఏదో ఒక ప్రాజెక్టు వస్తోందంటే, దగ్గరలోని తమ భూముల రేట్లు పెరుగుతాయని, నాలుగు ఉద్యోగాలు వస్తాయని అమాయకంగా నమ్మే జనం ఎట్లాగూ ఉంటారు. రాడార్ కేంద్రానికి మద్దతు కూడగట్టడానికి కూడా ప్రాజెక్టు తరఫున అటువంటి వాగ్దానాలు గుప్పించారు. ప్రతిపాదిత రాడార్ కేంద్రస్థలానికి చుట్టుపక్కల 20 గ్రామాల్లో నివసించే 60వేల మంది అడవిని కోల్పోతున్నందుకు, పశువులకు మేత భూములు పోతున్నందుకు బాధపడ్డారు, నిరసనలు తెలిపారు. బహుశా వ్యక్తిగత నష్టం పెద్దగా లేనందువల్ల కూడా, ఉద్యమం చురుకుగా ముందుకు సాగలేదు. పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు ఎంతగా హెచ్చరిస్తున్నా, తగినంత స్పందన లేకపోయింది.

సొంత నష్టాలను కాదు, సమాజానికి మొత్తంగా జరిగే హానిని, నేడు కలిగే కీడును మాత్రమే కాదు, రేపటి తరానికి జరిగే చేటును చూడగలిగే వివేచన లేకపోవడం ప్రమాదకరం. వరదలు వచ్చి తమ ఇళ్లు మునిగిపోయినప్పుడు, ఒకనాటి చలువ నగరం ఇప్పుడు నిత్యవేసవి పట్టణంగా మారుతున్నప్పుడు, ఆ క్షణానికి మాత్రం ఒక విసుగో శాపనార్థమో పెట్టి సంతృప్తిపడే నగరజీవి, తనకు లాభం కలిగే అవకాశం వచ్చినప్పుడు తిరిగి పదిమందికి, ప్రకృతికి హానిచేయడానికి వెనుకాడకపోవడం బాధాకరం. తమ భూములకు విలువ పెరుగుతుందని జీవో 111 రద్దు చేయడాన్ని వేడుక చేసుకునే ఆత్మాహుతి నాగరికులు మనలో ఉన్నారు. నదీగర్భంలో, తీరంలో ఆక్రమణలు తొలగించడం వల్ల ఏదో లాభం కలుగుతుందని అనుకుంటున్నవాళ్లకు, నదీమూలాన్ని ఛిద్రం చేస్తే ఏం జరుగుతుందో తెలియదా? గంగ, గోదావరి, కృష్ణ, కావేరి ఈ నదుల మూలస్థానాలు చూస్తే, వాటికి ఎంత విలువో, ఎంతటి రక్షణో? ఎందుకు మూసి, ఈసా, కాగ్నా మాత్రం ఏం పాపంచేశాయి? జరుగుతున్న అపచారాన్ని భరించలేక, ఈ నదులు భూమిలోకి ఇంకిపోతే, నాలుగోనగరంతో సహా హైదరాబాద్ మరో రామగుండమే కదా?

పర్యావరణం గురించి, వనరుల పరిరక్షణ గురించి పట్టింపుతో ఉన్నవారిని వెక్కిరించడం కూడా నేటి నవ సంపన్నుల కాలక్షేపం. దేశరక్షణతో ముడిపడిన 'అభివృద్ధి' విషయం అంటే, ఇక ఉద్యమకారుల నైతికత మీద దాడి చేయడానికి అవకాశం దొరికిందని వారికి సంబరం. అందుకే ప్రకృతికి ఇవ్వవలసిన భద్రతను ఉపసంహరించడానికి, లాభార్జనపరులకు కట్టబెట్టడానికి దేశరక్షణను ఒక సాకుగా చేసుకోవడం కూడా ప్రభుత్వాలు చేస్తున్నాయి. అన్ని సందర్భాలలోనూ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించలేము కానీ, కీలకమయిన విషయాల్లో దేశభద్రత అంశాన్ని ముందరికాళ్లకు బంధంగా ప్రయోగించడం ఈ మధ్య తరచు చూస్తున్నాము. అటవీచట్టానికి ఈ మధ్య చేసిన కీలకమయిన సవరణల్లో, 15వేల కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల దగ్గర భూములను స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఒకటి. అవి మామూలు అడవులైనా, రక్షితారణ్యాలైనా సరే, రక్షణ అవసరాల కోసం తీసుకోవచ్చునట. ఈ మధ్య నికోబార్ ద్వీపాన్ని ఆదిమవాసుల నుంచి కబ్జాచేసే ప్రక్రియను చూశాం. బంగాళాఖాతంలో మనకూ ఒక హాంకాంగ్ కావాలట. అదొక అభివృద్ధి ఎర. అంతరించిపోతున్న ఆదిమవాసులకు ఒక 75 చదరపు కిలోమీటర్లు ఉదారంగా ఇస్తారట. ఇది ఒక పరిహారం. ఇదంతా ఏదో వ్యాపారం కోసమే కాదు, నికోబార్‌లో రక్షణశాఖ నౌకాస్థావరాన్ని నిర్మిస్తారట. నోరెత్తడానికి వీలు లేని బ్రహ్మాస్త్రం! మొత్తం మీద నికోబార్‌ను నాగరికం చేయడానికి సుమారు 8 లక్షల చెట్లను ప్రస్తుతానికి బలిఇస్తారట! ఇక, అబూజ్‌మడ్ అడవుల మధ్యలో లక్ష ఎకరాలకు పైచిలుకు స్థలంలో సైన్యానికి విన్యాస యుద్ధ శిక్షణ. 52 అటవీ గ్రామాలు ఖాళీ. యుద్ధటాంకులతో పోరాటానికి శిక్షణ కేంద్రం కాబట్టి, అడవిని చదును చేయకతప్పదు. ఎన్ని లక్షల చెట్లకు శిరచ్ఛేదమో తెలియదు! దీన్ని ఔననక తప్పదు, లేకపోతే, 'అర్బన్' విశేషణం ఉదారంగా లభిస్తుంది!

అభివృద్ధి అనేది కూడా మతతత్వంలాగా తీవ్రమైపోయి, దానికి అభ్యంతరం చెప్పడమే ద్రోహమయ్యే పరిస్థితి నెలకొన్నది. దామగుండం అడవుల్లో ఓషధి వృక్షాలు అంతరిస్తాయని, వందల ఏళ్ల వయస్సున్న చెట్లు కూలిపోతాయని తెలిసినప్పుడు, లోలోపలి నుంచి ఊపిరితిత్తుల మూలుగు వినిపించాలంటే, మానవీయ పర్యావరణం స్వచ్ఛంగా ఉండాలి!

అడవులను చట్టబద్ధంగా, బాహాటంగా స్వాధీనం చేసుకుంటున్న ఈ చర్యల్లో ఒక క్రమాన్ని చూడవచ్చు. అభివృద్ధి అనేది కూడా మతతత్వంలాగా తీవ్రమైపోయి, దానికి అభ్యంతరం చెప్పడమే ద్రోహమయ్యే పరిస్థితి నెలకొన్నది. దామగుండం అడవుల్లో ఓషధి వృక్షాలు అంతరిస్తాయని, వందల ఏళ్ల వయస్సున్న చెట్లు కూలిపోతాయని తెలిసినప్పుడు, లోలోపలి నుంచి ఊపిరితిత్తుల మూలుగు వినిపించాలంటే, మానవీయ పర్యావరణం స్వచ్ఛంగా ఉండాలి!

చూద్దాం, దామగుండం పల్లెల్లో ఈ సారి పోరు బతకమ్మ ఆడతారట, చెట్లను కావలించుకుని మరో చిప్కో ఉద్యమం చేస్తారట!

సినిమా తెర వెనుక కోరలు చాచిన మగస్వామ్యం!

తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించి అతని మద్దతుదారులుగా మార్చే ప్రయత్నం చేస్తోంది. "ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఎందుకు ఫిర్యాదు చేసింది? ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు," ఇటువంటి వాదనలతో నిండిపోయిన సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా "నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి" అంటూ ఆయనకి పరోక్షంగా మద్దతు కూడగడుతున్నారు.

పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్థించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం వింటోంది. విచిత్రంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడట్లేదు.

2018లో శ్రీరెడ్డి, ఇతర కళాకారులు తెలుగు సినీ పరిశ్రమలోని పురుషాధిపత్య సంస్కృతినీ, లైంగిక దోపిడీనీ తమ నిరసనల ద్వారా అందరి ముందుకీ తెచ్చారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పరిస్థితి ప్రకారం కొత్తవాళ్ళకి పని చేసే అవకాశం రావాలన్నా, లేక అసోసియేషన్ కార్డు పొందాలన్నా కోఆర్డినేటర్లపైనా, పైనున్న మగ మాస్టార్లపైనా ఆధారపడాలి. వారికి లొంగి ఉంటేనే అసలు పని చేసే అవకాశాలు వస్తాయి. పరిశ్రమ వారి మాటే వింటుంది. అనేక 24 క్రాఫ్ట్ సంఘాల్లో ఇదే పరిస్థితి. అంటే జానీ మాస్టర్‌కు, ఆయన అసిస్టెంట్‌కు మధ్య సంబంధం వ్యక్తిగతం కాదు. అది ఒక ప్రొఫెషనల్ సంఘంలో అధికారంలో ఉండే వ్యక్తికీ, కిందుండే వ్యక్తికీ ఉండే సంబంధం. దాన్ని సాధారణ పరిభాషలో గురు శిష్య సంబంధం అంటారు. గురువులు శిష్యులని రక్షించాలి, భద్రత కల్పించాలి. జానీ మాస్టర్ అలా ప్రవర్తించాడా? తనకంటే 20ఏళ్ళు చిన్నదైన అమ్మాయి, అదీ మైనారిటీ తీరని వయసులో ఉన్న అమ్మాయి పట్ల అతడి ప్రవర్తన బాధ్యతాయుతమైనదేనా? గురువులు శిష్యులని కామించి నియంత్రించొచ్చా? పరిశ్రమలో నిలబడడానికి వచ్చిన కొత్త అమ్మాయికీ, ఆమెకి అవకాశాలిచ్చి, నియంత్రించేగలిగే స్థాయిలో ఉన్న వ్యక్తికీ మధ్యా ఇష్టం, అంగీకారంతో ఉండే సంబంధం వీలవుతుందా?

ఈ అధికార సంబంధాల వల్లనే ఆ అమ్మాయి ఇన్నాళ్లూ వేచి ఉండాల్సి వచ్చింది. తన 16ఏట నుంచి పడిన శ్రమ, తట్టుకున్న భౌతిక, లైంగిక హింస ఎందుకు కొరగాకుండా పోయి, మళ్ళా జీవితం మొదటికొచ్చే స్థితిలో ఆమె ఫిర్యాదు చేసింది. సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఇటువంటి సాహసం చేసిందంటే, ఆమె జీవితాన్ని, అవకాశాలని జానీ మాస్టర్ ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెది అవకాశ వాదం కాదు, తన జీవితాన్ని నిలబెట్టుకోవటానికి చివరి ప్రయత్నం. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు. వాళ్ళు చెయ్యలేని ధైర్యం ఆమె చేసింది, అంతే.

ఆమె ఫిర్యాదు తర్వాత మనం మాట్లాడాల్సింది– తెలుగు సినిమా పరిశ్రమలో ఇలా మెగా మాస్టర్లు ఇంత అధికారం ఎలా చెలాయించగలుగుతున్నారు అన్న విషయం గురించి. సినిమా పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితులు, వివిధ క్రాఫ్ట్ అసోసియేషన్లలో ఉన్న గురు శిష్య సంబంధాలలో ఇరుక్కున్న స్త్రీల దోపిడీ, అసలు స్త్రీల సంఖ్య తెలుగు సినిమా పరిశ్రమలో ఇంత తక్కువగా ఉండటానికి కారణాలు, యూనియన్ల ద్వారా పనులు, అవకాశాలు, వేతనాలు లభించటం ఎంత మేరకు సరైంది, కార్డులిచ్చే అధికారం పురుషులకి మాత్రమే ఎందుకుంటోంది మొదలైన విషయాల గురించి. ఇవి పరిశ్రమకి వదిలేస్తే పరిష్కారం అయ్యే సమస్యలు కావు. 2018లో కోఆర్డినేటర్ల లైంగిక దోపిడీ, పెద్ద నిర్మాతల దగ్గర లైంగిక బానిసత్వం గురించి మాట్లాడిన స్త్రీలని పరిశ్రమ వెళ్లగొట్టింది. వాళ్ళు వొళ్ళు అమ్ముకునే వాళ్ళని, డబ్బు కోసం ఏమైనా చేస్తారని చెప్పింది. పని స్థలంలో జరిగిన చట్టం గుర్తించే వేధింపులని ఇద్దరి మధ్య జరిగిన వ్యక్తిగత విషయంగా కుదించింది.

సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఇటువంటి సాహసం చేసిందంటే, ఆమె జీవితాన్ని, అవకాశాలని జానీ మాస్టర్ ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు.



ఇక్కడ లైంగిక అత్యాచారాల గురించి మన సమాజంలో వ్యాపించిన ఊహల గురించి మాట్లాడుకోవాలి. అమ్మాయి లైంగిక దాడిలో చనిపోతే ఆమెని తప్పకుండా బాధితురాలిగా ఒప్పుకుంటారు. ముద్దాయికి ఉరి వెయ్యాలని అందరూ కొవ్వొత్తి ర్యాలీలు తీస్తారు. అయితే ఆ బాధితురాలు పవిత్రురాలు అయుండాలి. చిన్న పిల్లో, లైంగిక అనుభవం లేని యువతో అయుండాలి. ఇది 50 ఏళ్ల క్రితం అత్యాచారం చుట్టూ అలుముకున్న నిశ్శబ్దంతో పోలిస్తే ముందడుగే. కానీ ఇది సరిపోదు. దోపిడీకి గురయ్యి, ఫిర్యాదు చేసి, తన జీవితం బాగుచేసుకుని, తన పని తాను చేసుకుని జీవిద్దామనుకున్న స్త్రీలని నమ్మకూడదన్న సందేశం 2018లో తెలుగు సినిమా పరిశ్రమ ఇస్తే, ఇప్పుడు సోషల్ మీడియా ఇస్తోంది. ఇది సరైందేనా?

1984లో మథుర అనే 14 ఏళ్ల సంచార జాతి అమ్మాయిపై పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు మధ్య వయస్కులయిన కానిస్టేబుళ్లు జరిపిన అత్యాచారం కేసులో వాళ్ళని విడుదల చేస్తూ సుప్రీంకోర్టు అసహ్యమైన తీర్పు ఇచ్చింది. ఆమె వంటిపై గాయాలు లేవు, ఆ వయసుకే బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు కాబట్టి ఆమె పవిత్రమైన స్త్రీ కాదని వర్ణించింది. ఈ తీర్పుకి వ్యతిరేకంగా దేశంలో స్త్రీలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. బాధితురాలికి అప్పటికే ఉన్న లైంగిక సంబంధాలని పరిగణనలోకి తీసుకునే నిబంధనని చట్టం నుండి తీయించేశారు. 'కస్టోడియల్ రేప్' అనే కొత్త నిబంధనని పెట్టించారు. అధికారంలో ఉన్న ఏ మగాడైనా, ఆ బలంతో ఒక స్త్రీతో లైంగిక చర్య చేసినప్పుడు, దానికి ఆమె ఒప్పుకున్నా సరే, దాన్ని చట్టం అంగీకారంగా భావించదు. దాన్ని కేవలం అధికార దుర్వినియోగం, బలవంతం క్రిందే పరిగణిస్తుంది.

తెలుగు సినిమా పరిశ్రమలో జానీ మాస్టర్‌కి బాధితురాలితో ఉన్న సంబంధం అధికారంతో నిండిన ఒక రకమైన కస్టోడియల్ సంబంధం. మెంటర్/ మాస్టర్‌కి వారి అసిస్టెంట్లకు ఉండే అధికార సంబంధాల సోయి లేకుండా జరుగుతున్న చర్చ అంతా మనల్ని 40, 50 ఏళ్ల వెనక్కి లాగుతోంది. మొత్తం బాధితురాలి గుణాన్ని అనుమానించటం, ఇదంతా పరిశ్రమలో మామూలు అనటం జరుగుతున్న హింసని సమర్థించి బాధితుల్ని శంకించే పాత మగ దురహంకార అలవాట్లని గుర్తుకు తెస్తోంది. 2013లో వచ్చిన చట్ట మార్పులని కూడా పక్కనపెట్టి గుణాత్మకంగా మనల్ని వెనక్కి తీసుకెళ్తోంది.

ఏ రంగంలోనయినా లైంగిక వేధింపుల చట్టం అమలు చెయ్యాలి అనగానే ఇటువంటి చట్టాల వల్ల సృజనాత్మకత దెబ్బతింటుందని అనటం మామూలే. మోహన్‌లాల్ భయపడ్డట్టు ఏ రంగం కూడా ఈ చట్టం అమలు వల్ల విచ్ఛిన్నమైపోలేదు. ఇక్కడ సమస్య ఎవరిని పణంగా పెట్టి ఎవరి సృజనాత్మకత, స్వతంత్రం, స్వేచ్ఛని కాపాడుతున్నాం అన్నది. ప్రస్తుతం సినీ పరిశ్రమలో అందరు మగవాళ్ళకి, ఎవరి స్థాయిని బట్టి వారికి, ఆడవాళ్ళ శరీరాలపై విస్తృత విశేషాధికారాలున్నాయి. దానివల్ల స్త్రీల సృజనాత్మకత, స్వతంత్రం, స్వేచ్ఛకి చోటే లేకుండా ఉంది. జస్టిస్ హేమ కమిటీ చెప్పింది ఇదే. అన్ని పరిశ్రమల్లో అదే పరిస్థితి ఉంది.

అమ్మాయిలు అన్ని రంగాల్లో ముందుకెళ్లినప్పుడే సమానత్వం వస్తుంది అని వాళ్ళకి అన్నీ నేర్పిస్తూ, మరో పక్క సినిమా పరిశ్రమలో లైంగిక దోపిడీకి లొంగిపోవటం తప్పదు అని వాదించటం మన సమాజపు స్కిజోఫ్రీనియాని సూచిస్తుంది. సమాజపు విలువలు, చట్టంలో వస్తున్న మార్పులతో అనుగుణంగా తెలుగు సినీ పరిశ్రమలో సంస్కరణలు రావాల్సిన సమయం వచ్చింది. దానికి జానీ మాస్టర్‌పై వచ్చిన ఫిర్యాదు మంచి అవకాశం. ప్రతి రంగంలో స్త్రీలు పని చెయ్యటానికి వీలుగా వచ్చిన మార్పులనే తెలుగు సినీ పరిశ్రమలో కూడా తేవాలని తెలంగాణ ప్రభుత్వం శ్రీరెడ్డి, ఇతరులు చేసిన నిరసనల తర్వాత 2019లో వేసిన హై లెవెల్ కమిటీ సూచించింది. ఆ నివేదికని ఇప్పటికైనా ప్రభుత్వం ఆమోదించి అమలు చెయ్యాలి.

■ ఎ. సునీత

కృష్ణాజిల్లా రచయితల 16వ మహాసభలు

కృష్ణా జిల్లా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో కృష్ణా జిల్లా రచయితల 16వ మహాసభలు సెప్టెంబరు 29న జరుగనున్నాయి. జలవిపత్తులతో రాష్ట్రం కకావికలమైన నేపథ్యంలో "ప్రకృతి వైపరీత్యాలు–పర్యావరణ పరిరక్షణ–రచయితల పాత్ర" అనే అంశంపై ఈ మహాసభలు దృష్టి పెడుతున్నాయి. కీ.శే. మండలి వెంకటకృష్ణారావు 27వ వర్ధంతిని పురస్కరించుకుని జరుగుతున్న ఈ సభలకు హైకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకరనారాయణ ముఖ్య అతిథి. నగ్నముని, విహారి, మండలి బుద్ధప్రసాద్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వల్లూరి శివప్రసాద్, డా. రావి రంగారావు, టి. గౌరీ శంకర్, తేళ్ల అరుణ, టి. శోభనాద్రి, అక్కినేని భవానీప్రసాద్, అంగత వరప్రసాద్, సరికొండ నరసింహరాజు ప్రభృతులు పాల్గొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలపై 50కి పైగా కవులతో కవిసమ్మేళనం జరుగుతుంది. ఈ సభలలో 2024 సంవత్సరానికి గాను ఏడుగురు సాహితీ ప్రముఖులకు కృష్ణాజిల్లా రచయితల సంఘం పురస్కారాలను అందిస్తున్నది. మండలి వెంకటకృష్ణారావు పురస్కారాన్ని ఆచార్య అప్పాజోశ్యుల సత్యనారాయణకు, ఆలూరి బైరాగి కవితా పురస్కారాన్ని బండ్ల మాధవరావుకు, గుత్తికొండ సుబ్బారావు పురస్కారాన్ని పెనుగొండ లక్ష్మీనారాయణకు, పోలవరపు కోటేశ్వరరావు పురస్కారాన్ని రావులపాటి సీతారాం– మారుతీ పౌరోహితంలకు, ముక్కామల నాగభూషణం పాత్రికేయ పురస్కారాన్ని శ్రీమతి కెఎస్‌వి రమణమ్మకు, వేములపల్లి కేశవరావు–విశాల పురస్కారాన్ని శ్రీమతి స్వాతి శ్రీపాదకు అందజేస్తున్నారు.

– గుత్తికొండ సుబ్బారావు, జి.వి పూర్ణచందు
కృష్ణా జిల్లా రచయితల సంఘం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



అన్నగా, తండ్రిగా ఆదుకున్నారు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు. వరదలో మేం పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఒకరోజు ఇబ్బంది పడ్డాం. మరుసటి రోజు నుంచి మాకు అల్పాహారం, భోజనాలు, తాగునీరు సమకూర్చారు. రేషన్ సరుకులు ఇచ్చారు. మాది గ్రౌండ్‌ఫ్లోర్.. వరదనీటిలో మునగటంతో ప్రభుత్వం రూ.25 వేల సహాయం చేయటం మా అదృష్టం.

- సమీ ఉన్నీసా

వైసీపీకి కొత్త సారథులు

- ఎన్టీఆర్‌కు అవినాశ్, కృష్ణాకు పేర్ని నాని
- జగ్గయ్యపేట ఇన్‌చార్జిపై సందిగ్ధం
- సెంట్రల్ బాధ్యతలు విష్ణుకే..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల అధ్యక్షులను పార్టీ అధినేత జగన్ ఖరారు చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు దేవినేని అవినాశ్, కృష్ణాజిల్లాకు పేర్ని నానీని అధ్యక్షులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో జరిగిన రెండు జిల్లాల సమావేశానికి పలువురు నాయకులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలన్న దానిపై చర్చ జరిగింది. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి రాజగోపాల్, వాసిరెడ్డి పద్మ, వి.మనోహర్ ఈ రేసులో ఉన్నారు. ఏకాభిప్రాయం రాకపోవడంతో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుందామని వాయిదా వేశారు. సెంట్రల్ ఇన్‌చార్జిగా తిరిగి మల్లాది విష్ణుకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి వెలంపల్లి శ్రీనివాసరావు పోటీ చేశారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకంపై స్పష్టత ఇవ్వలేదు.

పంచాయతీ కార్యదర్శులకు స్థానచలనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పంచాయతీ కార్యదర్శులను పూర్తిస్థాయిలో బదిలీ చేశారు. అంతర జిల్లాతో పాటు జిల్లాయేతర బదిలీలు కూడా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 43 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ జరగ్గా, వీరిస్థానంలో కొత్త వారిని నియమించారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల్లో 23 మందిని బదిలీ చేయగా, గ్రేడ్-2లో 10 మందిని, గ్రేడ్-3లో నలుగురిని, గ్రేడ్-4లో ఆరుగురిని బదిలీ చేశారు.

ఆర్థిక సాయం ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న వరద బాధితులకు ఊరట కలిగింది. సీఎం చంద్రబాబు బుధవారం వరద బాధితులకు పరిహారం చెల్లింపును ప్రారంభించారు. దీంతో జిల్లాలోని చాలామంది ఖాతాల్లో నగదు జమైంది. ఈ నెల 30వ తేదీలోపు ఈ మొత్తం ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించిన సీఎం.. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని, పెండింగ్ అర్జీలను కూడా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వేగంగా.. సాయమందించాం..



వరద బాధితులకు పరిహారం చెల్లింపులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వరద బాధితులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయమందాలి
పెండింగ్‌లో ఉన్న 13 వేల అర్జీలు పరిష్కరించండి
వరద బాధితులకు పరిహారం చెల్లింపులో సీఎం చంద్రబాబు
జిల్లా యంత్రాంగం పనితీరుకు ప్రశంసలు
ప్రజాప్రతినిధుల నుంచి సమస్యలు తెలుసుకున్న సీఎం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారీ వర్షాలు, వరద బాధితులకు ప్రభుత్వం వేగంగా సాయమందించిందని, ఇంత వేగంగా చర్యలు తీసుకున్న ప్రభుత్వం గతంలో లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయాల మ్యాపింగ్ పరిధిలో లేనివారు, ఇతర సాంకేతిక సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్న 13 వేల అర్జీలను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వరద బాధితులకు పరిహారం చెల్లింపు కార్యక్రమం నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వరద బాధితులకు సంబంధించిన పరిహారం, బ్యాంకింగ్ సేవలు, వాహనాలు, ఎలక్ట్రికల్ గూడ్స్ రిపేర్లు, పారిశుధ్య, ఆరోగ్య సేవలపై సమీక్షించారు. బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో మరో 13 వేల వరకు అర్జీలు రావటంపై ఆయన కలెక్టర్ సృజనతో చర్చించారు. ఈ కేసులకు సంబంధించి కలెక్టర్ వివరించారు. మొత్తం 18 వేల అర్జీలు వచ్చాయని, వీటిలో 5 వేలు నకిలీవన్నారు. మిగిలిన 13 వేల కేసుల్లో ఒక సచివాలయ పరిధిలో మ్యాపింగై, మరో సచివాలయ పరిధిలో నివసిస్తున్నవారు, వ్యక్తిగతంగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు ఇచ్చినవారున్నారని చెప్పారు. ఇప్పటికే 7 వేల దరఖాస్తులు పరిశీలించామని, గురువారం సాయంత్రం నాటికి మిగిలిన వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. వీటన్నింటిపైనా స్పందించిన చంద్రబాబు.. ఏ ఒక్క వరద బాధితుడు కూడా నష్టపోకూడదని, వారికి ప్రభుత్వం ప్రకటించిన సాయం అందాల్సిందేనని ఆదేశించారు. ఖాతాల్లో డబ్బు పడిన అనంతరం సదరు బాధితుడికి ఫోన్ చేసి డబ్బు పడిన విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ఒకవేళ సహాయం రానివారుంటే.. ఎందుకు రాలేదో కూడా చెప్పాలని, జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు.

ప్రజాప్రతినిధుల ఫీడ్‌బ్యాక్ ఇలా..

సహాయం అందించే అంశాలకు సంబంధించి జిల్లా ప్రజాప్రతినిధులను సీఎం చంద్రబాబు ఫీడ్‌బ్యాక్ అడిగి తీసుకున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి కౌలుదారుల డేటా ఎక్కడాలేదన్నారు. దీనిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు స్పందిస్తూ 1,82,000 వరకు ఈ-క్రాప్ బుకింగ్ చేశామని, ఇందులో 40 శాతం మేర కౌలుదారుల డేటా ఎక్కించామని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి విషయాలు చివరి నిమిషంలో చెప్పడం కాదని, ముందే స్పందించాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ వరద బాధిత ప్రాంతాల్లోని ఇళ్లలో కొందరు దుకాణాలు నడుపుకొంటున్నారని, వారికి లేబర్ లైసెన్స్ సర్టిఫికెట్ లేదని, ఇలాంటివారు పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు స్పందిస్తూ వారినెలా గుర్తించగలమన్నారు. అలాంటివి పరిశీలించాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ 38వ డివిజన్ వాసులకు కూడా పరిహారం ఇవ్వాలని కోరారు. వరద రాకుండా పరిహారం ఎలా ఇస్తామని చంద్రబాబు ప్రశ్నించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూడా మాట్లాడారు. అయితే, ప్రజాప్రతినిధులు ఆలస్యంగా స్పందించటంపై చంద్రబాబు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

యంత్రాంగం పనితీరు భేష్
సీఎం చంద్రబాబు కితాబు

వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించడంలో, నష్టగణనలో కలెక్టర్ సృజన అధికార యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. మంచినీరు తాగే పరిస్థితి కూడా లేని సమయంలో అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. నగరాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి, నష్టం అంచనా వేయడానికి, రేషన్ అందించడానికి, బ్యాంకింగ్, బీమా సేవలు వంటివి సరైన విధంగా అందించడానికి కలెక్టర్ కృషి చేశారని సీఎం చెప్పారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఆర్థిక సాయం
కలెక్టర్ సృజన

వన్‌టౌన్ : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందుతుందని కలెక్టర్ సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో కుటుంబాలకు జరిగిన నష్టాన్ని 1,700 బృందాలతో అంచనా వేయటం జరిగిందని, ఐఏఎస్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరిగిందన్నారు. ప్రభుత్వం బుధవారం లబ్ధిదారుల ఖాతాలో సాయాన్ని జమ చేసిందని తెలిపారు. ఏ ఒక్క బాధిత కుటుంబం ఎన్యూమరేట్ కాకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ఆది, సోమవారాలు (రెండు రోజులు) పాటు క్షేత్రస్థాయిలో అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. మొత్తం 13 వేల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, బుధవారం 7 వేల దరఖాస్తులను పరిశీలించామని, మిగిలిన 6 వేలను గురువారం సాయంత్రం నాటికి పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. అర్హులైన వారికి తప్పనిసరిగా సాయం అందుతుందని, రానివారికి ఎందుకు రాలేదో సచివాలయాల్లో జాబితాల ద్వారా చెబుతామని కలెక్టర్ వివరించారు.

అమ్మ లడ్డూ నాణ్యమేనా..?

తిరుమలలో లడ్డూ వివాదం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ లడ్డూ నాణ్యతపైనా అనుమానాలు కలుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం దుర్గగుడిలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల్లో నాసిరకం జీడిపప్పు, కిస్మిస్‌ను గుర్తించడం ఈ సందేహాలకు బలం చేకూరుస్తోంది. ప్యాకింగ్‌పై ఆ పదార్థం ఎప్పుడు తయారు చేశారు, ఎప్పుడు ప్యాకింగ్ చేశారు.. అనే వివరాలు లేవని అధికారులు తేల్చారు. ఈ ఘటనలన్నింటి నేపథ్యంలో దుర్గగుడి లడ్డూ ప్రసాద నాణ్యత భక్తులను కలవరానికి గురిచేస్తోంది.

దుర్గమ్మ లడ్డూ ప్రసాదంపై భక్తులకు అనుమానాలు

- ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లోనూ అదే పరిస్థితి
- నాసిరకం సరుకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు
- 1,100 కిలోల కిస్‌మిస్, 700 కిలోల జీడిపప్పు తిరస్కరణ

ప్యాకెట్లపై కనిపించని లేబుల్స్




ఇంద్రకీలాద్రిపై లడ్డూ దిట్టంలో ప్రసాదాల తయారీ (ఇన్‌సెట్‌లో) తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దుర్గగుడిలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే పదార్థాలను కాంట్రాక్ట్ పద్ధతిన కొంటారు. పులిహోర, పొంగలి, గారెలు, కట్టెపొంగలి, దద్దోజనం, లడ్డూ ప్రసాదాలను తయారు చేస్తారు. పులిహోర, పొంగలి, గారెలు, కట్టెపొంగలి, దద్దోజనం వంటివి మహామండపంలోని పోటులో తయారు చేస్తారు. లడ్డూ ప్రసాదాన్ని మాత్రం మహామండపానికి ఎదురుగా ఉండే కేంద్రంలో తయారు చేస్తారు. లడ్డూల తయారీని మాత్రం కాంట్రాక్టరుకు అప్పగించారు. వీటిలో ఉపయోగించే జీడిపప్పు, కిస్మిస్ సరఫరాను కాంట్రాక్టుకు ఇచ్చారు. లోగడ రెండేళ్లకోసారి టెండర్లను ఆహ్వానించేవారు. ఇప్పుడు ఆరు నెలలకోసారి పిలుస్తున్నారు.

జీడిపప్పు, కిస్మిస్ నాణ్యతకు తిలోదకాలు

దుర్గమ్మకు సమర్పించే గారె ప్రసాదంలో జీడిపప్పు, కిస్మిస్‌ను ఉపయోగించరు. పులిహోరలో జీడిపప్పును ఉపయోగిస్తారు, కిస్మిస్‌ను ఉపయోగించరు. మిగిలిన అన్ని ప్రసాదాల్లో తప్పనిసరిగా కిస్మిస్, జీడిపప్పు ఉంటాయి. తయారీకి ఉపయోగించే పాత్రలను బట్టి వాటిని వాడతారు. 50 పాత్రల్లో ప్రసాదాన్ని తయారు చేస్తే, అందులో 70 కిలోల జీడిపప్పు, 50 కిలోల కిస్మిస్‌ను ఉపయోగిస్తారు. ఇది నిత్యం జరిగే ప్రక్రియ. తిరుమల లడ్డూ తయారీలో కల్తీనెయ్యి ఉపయోగించారన్న ఆరోపణలు రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఇంద్రకీలాద్రిపై కొద్దిరోజుల క్రితం సోదాలు చేశారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే పదార్థాలను పరిశీలించారు. తయారీ కేంద్రంలోనూ తనిఖీలు నిర్వహించారు. ఇక్కడున్న జీడిపప్పు, కిస్మిస్‌ను పరిశీలించి నాణ్యత లేదని గుర్తించారు. ఈ జీడిపప్పు, కిస్మిస్ వాసన వచ్చినట్టుగా అధికారులు గుర్తించారు. 1,100 కిలోల కిస్మిస్, 700 కిలోల జీడిపప్పును తిరస్కరించారు. ఈ పదార్థాలను ప్రసాదాల తయారీలో వినియోగించవద్దని ఆదేశించి, సంబంధిత సరఫరాదారులకు వెనక్కి పంపేయాలని స్పష్టం చేశారు.

ప్యాకింగ్‌లో అవకతవకలు

సాధారణంగా ఒక వస్తువును ప్యాకింగ్ చేసినప్పుడు దానిపై ఆ బ్రాండ్‌కు సంబంధించిన లేబుల్స్ ఉంటాయి. ప్యాకింగ్ ఎప్పుడు చేశారు, ఎప్పటి వరకు నిల్వ ఉంటుంది, ఆ పదార్థం స్టాండర్డ్ ఏమిటి.. అనే వివరాలు ఈ లేబుల్స్‌పై ఉంటాయి. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తిప్పి పంపేసిన జీడిపప్పు, కిస్మిస్‌పై అలాంటి లేబుల్స్ లేవని గుర్తించారు. దీన్నిబట్టి సరఫరాదారులు నాసిరకం జీడిపప్పు, కిస్మిస్‌ను దేవస్థానానికి సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు.

కాంట్రాక్టర్ల కనికట్టు

ప్రసాదాల తయారీకి వినియోగించే పదార్థాలు ముందుగా దేవస్థానం స్టోర్స్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి పోటు, లడ్డూ తయారీ కేంద్రానికి వెళ్తాయి. దుర్గగుడిలో రోజుకు 30 వేల నుంచి 40 వేల లడ్డూలు తయారు చేస్తారు. ఆది, శుక్రవారాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో 40 వేల నుంచి 50 వేల లడ్డూలు తయారు చేస్తారు. శరన్నవరాత్రుల్లో అయితే.. రోజుకు 2 లక్షల వరకూ తయారు చేస్తారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు ఆ తర్వాత ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ దర్శనానికి వస్తారు. తిరుమల మాదిరిగానే ఇక్కడి లడ్డూ, పులిహోర ప్రసాదాన్ని పవిత్రంగా స్వీకరిస్తారు. దుర్గగుడికి ప్రసాదాల తయారీలో వినియోగించే పదార్థాలను సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ఎగబడతారు. టెండర్లను దక్కించుకోవడానికి అనేక పైరవీలు చేస్తారు. తీరా టెండరును దక్కించుకున్నాక నాసిరకం పదార్థాలను సరఫరా చేస్తున్నారు. అధికారులకు చూపించేటప్పుడు గ్రేడ్-1, ఆ తర్వాత తక్కువ గ్రేడ్ సరుకును ఇస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల్లో తీసుకున్న నమూనాలను హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పరీక్షల నిమిత్తం పంపారు. ఈ నివేదిక 15 రోజుల్లో వస్తుంది.

నా భార్య ఆత్మహత్యాయత్నానికి ఎమ్మెల్యే కొలికపూడే కారణం

చిట్యాల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఆరోపణ




మాట్లాడుతున్న చిట్యాల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు, అంబులెన్స్ వద్ద సర్పంచ్ భార్య కవిత

తిరువూరు, సెప్టెంబరు 25 : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తనను అకారణంగా దుర్భాషలాడటమే కాకుండా, తనపైకి 20 మంది మనుషుల్ని దాడికి పంపారని, ఈ విషయం తెలుసుకున్న తన భార్య కవిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం చిట్యాల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం 'తిరువూరులో జరిగిన తాపీమేస్త్రుల సమావేశంలో ఎమ్మెల్యే నా పేరు ప్రస్తావిస్తూ.. నా కొడక గుడ్డలు ఊడదీసి కొడతా.. అని దూషించారు. అంతేకాకుండా బుధవారం నాపై దాడికి యత్నించారు.' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ విషయం తెలిసిన నా భార్య ఆత్మహత్యయత్నం చేసింది. ప్రస్తుతం ఆమెను మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి పంపాం.' అని పేర్కొన్నారు. మాది ఉన్నతమైన కుటుంబం.. ఐఏఎస్, ఐపీఎస్‌లకు కోచింగ్ ఇస్తాం.. అని చెప్పుకొనే ఎమ్మెల్యే కొలికపూడి మాట్లాడుతున్న భాషను ప్రజలంతా గమనిస్తున్నారని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న కవిత

చిట్యాల సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు భార్య కవిత తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామంలో సచివాలయ వీఆర్వోగా పనిచేస్తోంది. తన భర్తపై ఎమ్మెల్యే కొలికపూడి అనుచిత వ్యాఖ్యలు చేయడం, తన మనుషులతో దాడికి యత్నించడం వంటి విషయాలకు మనస్థాపం చెందిన ఆమె నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నం చేయడంతో తిరువూరులో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు పంపారు.



నయనానందకరం

దుర్గాఘాట్‌లో నవహారతుల ట్రయల్ రన్

వన్‌టౌన్, సెప్టెంబరు 25 : దుర్గాఘాట్‌లో పవిత్ర కృష్ణానదీమ తల్లికి నవహారతులు కార్యక్రమ నిర్వహణకు బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, అధికారులు, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు దుర్గాఘాట్‌లో కూర్చుని హారతులు తిలకించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

'విజయ'దశమి బోనస్ విడుదల

హనుమాన్ జంక్షన్ రూరల్, సెప్టెంబరు 25 : వరద ముంపునకు గురై, విజయవాడలోని ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఆగిపోయినా వీరవల్లి ఫ్యాక్టరీ ద్వారా పాల ఉత్పత్తులను సకాలంలో వినియోగదారులకు అందజేసేందుకు కృషి చేసిన సిబ్బంది, సొసైటీ సభ్యులకు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ధన్యవాదాలు తెలిపారు. వీరవల్లి పాలఫ్యాక్టరీలో బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఉద్యోగులు, పాల సొసైటీలకు ఆయన విజయదశమి బోనస్ విడుదల చేశారు. విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు రూ.5.3 కోట్లు, పాలసేకరణ సహకరించిన సొసైటీలకు రూ.1.3 కోట్లు విడుదల చేశారు. విజయదశమి నాటికి విజయవాడలోని ఫ్యాక్టరీలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రారంభించి, వినియోదారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, తదితర డైరెక్టర్లు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం

» దసరా ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ సమీక్ష

6లో



దసరా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న సత్యనారాయణ

సామాన్య భక్తులకు ప్రాధాన్యం

» దసరా ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ సమీక్ష

వన్‌టౌన్, సెప్టెంబరు 25 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చేనెల 3వతేదీ నుంచి 12వతేదీ వరకు జరగనున్న దసరా ఉత్సవాలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ అమ్మవారి దర్శనం కల్పించటంలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ దుర్గగుడి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశంలో దసరా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఘాట్ రోడ్డులోని రిటైనింగ్ వాల్ నిర్మాణం, క్యూల ఏర్పాట్లు, షామియానాల ఏర్పాట్లు, ఇంజనీరింగ్ పనుల ప్రగతి, దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, టిక్కెట్ స్కానింగ్ వీఐపీ, వీవీఐపీ దర్శనాలు, అమ్మవారి దర్శన సమయాలు, వృద్ధులు, దివ్యాంగులకు సదుపాయాలు, ఉభయదాతలకు వాహనాలు వంటి వాటిపై సమగ్ర వివరాలను సేకరించారు. విద్యుత్ దీపాల అలంకరణ పనులు, కేశఖండనశాలలో, స్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లు, అన్నదానం, ఉచిత ప్రసాద వితరణ, తదితరాల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవో రామారావు, ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, వైకుంఠరావు, లింగం రమాదేవి, డీఈలు, ఏఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్లు

సీఎం నిర్ణయమే శిరోధార్యం

» చంద్రబాబును కలిసేందుకు కృష్ణా మిల్క్ డైరెక్టర్ల నిర్ణయం

» వీరవల్లి ఫ్యాక్టరీలో సమావేశమైన పాలకవర్గ సభ్యులు

» చలసాని ఆంజనేయులు రాజీనామాపై చర్చ

హనుమాన్‌జంక్షన్ రూరల్, సెప్టెంబరు 25 : 'సీఎం చంద్రబాబును కలిసి గత ఐదేళ్లలో యూనియన్ పరంగా ఎదురైన ఇబ్బందులు.. వ్యతిరేక పరిస్థితుల్లోనూ యూనియన్ పరంగా చేసిన అభివృద్ధిని వివరిద్దాం. ఆ తర్వాత చైర్మన్ మార్పుపై సీఎం నిర్ణయం మేరకు నడుచుకుందాం' అని కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు నిర్ణయించారు. బుధవారం వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ పాల ఫ్యాక్టరీ)లో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు రాజీనామా వదంతులపై చర్చించారు. సమావేశానికి 14మంది పాలకవర్గసభ్యులకుగాను 11మంది హాజరయ్యారు. ఒకరు విదేశాల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన అమూల్ వంటి డెయిరీలను తట్టుకుని, ప్రభుత్వ ఒత్తిళ్లను అధిగమించి పాడిరైతు సంక్షేమమే లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేసిందని ఈ సందర్భంగా డైరెక్టర్లు గుర్తు చేశారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృష్ణా మిల్క్ యూనియన్ సాధించిన పురోగతిని వివరించాలని నిర్ణయించామని, చైర్మన్ మార్పుపై చంద్రబాబు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పాలకవర్గ సభ్యులు స్పష్టం చేశారు.

కొడాలికి చెప్పు దెబ్బలు తప్పవు : వెనిగండ్ల

గుడివాడ : ఎన్నికల్లో ప్రజల ఛీత్కారాలతో ఘోర ఓటమితో పిచ్చి పట్టి పక్క రాష్ట్రంలో తలదాచుకుంటున్న నాని మతిభ్రమించి పిచ్చివాగుడు వాగుతున్నాడని, పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేసిన వారికి వత్తాసు పలుకుతూ మాట్లాడటం దారుణమని, నోరు అదుపులో పెట్టుకోకుంటే రాష్ట్ర ప్రజల చేతుల్లో చెప్పు దెబ్బలు తప్పవని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హితవు పలికారు. బుధవారం ప్రజావేదికలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 3 నెలలుగా ఎక్కడో దాక్కుని, నేడు తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రత్యక్షమయ్యాడన్నారు. గతంలో ఆంజనేయస్వామి విగ్రహం చేయి విరిగితే బొమ్మ విరిగితే ఏమవుతుందని ఎద్దేవా చేశాడన్నారు. రథం దగ్ధమైతే మరొకటి తయారు చేస్తామని పిచ్చి ప్రేలాపనలు పేలాడన్నారు. నేడు తిరుమల లడ్డూ అపవిత్రమైందని దేశప్రజలు బాధలో ఉన్నారని, అంతర్జాతీయ మీడియా సైతం స్పందించిందని, నాని మాత్రం మూర్ఖత్వంతో నోటికి వచ్చినట్టు వాగుతున్నాడన్నారు. చేతి నిండా తాళ్లు కట్టుకుని, జుట్టు పెంచుకుంటే వెంకన్న భక్తులైపోరని గుర్తు చేశారు. నలభైసార్లు గుండు కొట్టించుకున్నానని చెబుతున్న నానికి మరోసారి తిరుపతి వెళ్లే అవకాశం రాకపోవచ్చునన్నారు. సమావేశంలో రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

» మండలి బుద్ధ ప్రసాద్



స్వామివారి సేవలో బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో దేవాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సి ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రముఖ దేవాలయాల ప్రతిష్ఠ మసకబారిందన్నారు. అంతర్వేది, రామకుప్పం, సింహాచలం దేవాలయాల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి బయటపడిందన్నారు. ఆలయాలను ఆధ్యాత్మిక సౌరభాలుగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. తిరుమల లడ్డు ప్రసాదంలో నెయ్యి కల్తీకి నిరసనగా బుధవారం వేకనూరు గ్రామంలోని సంతాన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జనసేన పార్టీ పిలుపు మేరకు బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులచే విశ్వక్సేన పూజ, సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోపిదేవి దేవస్థానం ప్రతిష్ఠ మసకబారేలా అనేక తప్పులు జరిగాయన్నారు. గత ఐదేళ్లలో దేవస్థానంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ముఖ్యమంత్రిని కలిసి ఏసీబీ విచారణ కోరతానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొలికపూడి బేషరుతుగా క్షమాపణ చెప్పాలి

» జర్నలిస్టు సంఘాల డిమాండ్

తిరువూరు : తన అక్రమాలపై వరుస కథనాలు వస్తున్నాయనే ఉక్రోషంతో జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా సభ్య సమాజం సిగ్గుపడేలా బూతులు తిట్టిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏపీఎంపీఏ, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కొలికపూడి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తిరువూరులో జర్నలిస్టులు భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేస్తామని యూనియన్ నేతలు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్ చేస్తూ తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంపీఏ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విజయ్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ వి.వెంకట్రావ్, సీపీఎం నాయకులు ఎస్.నాగేశ్వర రెడ్డి, ఎమ్.నాగేంద్ర ప్రసాద్, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

వరద తాకిడికి నేల వాలిన బొప్పాయి!

» వంద ఎకరాల్లో తోటలు నాశనం.. రూ 2 కోట్ల నష్టం

తోట్లవల్లూరు : మండలంలోని ఎనిమిది లంకల్లో కృష్ణానది వరద ముంపుకి గురైన బొప్పాయి తోటలు మొదళ్లు కుళ్లి నేల వాలిపోతున్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. లంకల్లో వంద ఎకరాల్లో బొప్పాయి తోటలు సాగయ్యాయి. ఒక్కో రైతు మూడెకరాల నుండి 50 సెంట్ల వరకు సాగు చేపట్టారు. ఎకరాకు రూ 1.50 లక్షల ఖర్చు చేశామని వల్లూరుపాలెం రైతు బడుగు తిరుమలరావు తెలిపారు. కౌలుతో కలుపుకుని ఎకరాకు రూ 1.90 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. ఇలా బొప్పాయి రైతులకు సుమారు రూ. 2 కోట్ల నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తోటల వద్దకు వ్యాపారులు వచ్చి బొప్పాయి కాయలను కొనుగోలు చేసేవారని, ఇపుడు పరిస్థితి తారుమారైందని రైతులు చెపుతున్నారు. పడిపోయిన తోటలను తొలగించి మరో పంట సాగు చేయక తప్పదని అంటున్నారు.



తోట్లవల్లూరు లంకలో పూర్తిగా నేలవాలిన బొప్పాయి తోట

ఆక్వా సాగు.. కలెక్టర్ పరిశీలన

» చినగొల్లపాలెంలో వనామీ హేచరీలపై ఆరా

కృత్తివెన్ను, సెప్టెంబరు 25: ఆక్వా సాగు పరిశీలించేందుకు బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మండలంలో పర్యటించారు. తొలుత చినగొల్లపాలెం గ్రామంలో వనామీ హెచరీలను పరిశీలించి, రొయ్య పిల్ల ఉత్పత్తి, పెంపకంపై నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గరిశపూడి గ్రామంలో వనామీ చెరువులను పరిశీలించి, రైతులతో సంభాషించారు. అనంతరం మిలేష్ రొయ్యల ప్రొసెసింగ్ కంపెనీని పరిశీలించారు. ఇంతేరు



పెదలంక డ్రెయిన్‌లో తొట్టెల్లో చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

గ్రామంలో ఉన్న రొయ్యల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెదలంక డ్రెయిన్‌కు రెగ్యులేటర్ గేట్లను ఏర్పాటు చేయాలని మాజీ డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు రైతులతో కలిసి కలెక్టర్‌కు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

ప్రమాదం అంచున ప్రయాణం!



మండలంలో ఆక్వాసాగును పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ బాలాజీ పెదలంక డ్రెయిన్ తొట్టెల్లో చేపల పెంపకాన్ని పరిశీలించేందుకు పడవలో ప్రయాణించారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో కలెక్టర్ ప్రయాణం ప్రమాదకరంగా సాగింది. అధికారులు కనీస ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. లోతైన డ్రెయిన్, సముద్ర మొగ దగ్గరలో అత్యంత వడిగా ప్రమాదకరంగా ఉండే డ్రెయిన్‌లో కలెక్టర్ పడవపై ప్రయాణం చేయాల్సి ఉండగా, అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవటం విమర్శలకు దారితీసింది. సాధారణ పడవపై 20 నిమిషాల పాటు కలెక్టర్ ప్రమాదపు అంచున ప్రయాణం సాగించారు. కలెక్టర్ తన వెంట తెచ్చుకున్న లైఫ్‌జాకెట్‌ను ధరించారు. మిగిలిన ఏ ఒక్కరు లైఫ్ జాకెట్ లేకుండానే పడవలో వెళ్లారు. 20 నిమిషాల పాటు సాగిన పడవ ప్రయాణం అనంతరం అధికారులు సురక్షితంగా ఒడ్డుకు చేరటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కేసుల పరిష్కారంలో పురోగతి!

» నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు తగుచర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో స్నేహపూర్వక పోలీసింగ్ విధానాన్ని అవలంబించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో అన్నిప్రాంతాలలో శాంతి కమిటీలను ఏర్పాటుచేసి, ఎలాంటి అల్లర్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీపావళిని పురస్కరించుకుని అనధికారికంగా దీపావళి టపాసులు తయారుచేసే వారిపై, నిల్వఉంచే వారిపై నిఘా ఉంచాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై నేరాలకు పాల్పడితే వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి త్వరితగతిన విచారణ పూర్తిచేసి నిందితులను కోర్టులో హాజరు పరచాలన్నారు. దొంగతనాలు, హత్యానేరాల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా గంజాయి విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు జరగకుండా నైట్‌బీట్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని, నేరాలకు పాల్పడేవారి కదలికలపై నిరంతరనిఘా ఉంచాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలలో బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రమాద హెచ్చరికలను తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవలకాలంలో సైబర్ నేరాలసంఖ్య అధికమైందని, వీటిని అదుపుచేసేందుకు, ఈ తరహాకేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేకటీమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సైబర్‌నేరాలకు సంబంధించిన విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సామాజికపరంగా, రాజకీయంగా సమస్యాత్మక గ్రామాలను అధికారులు తరచూ సందర్శించి, పరిస్థితులను అంచనావేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుండా విధులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లవారీగా నమోదైన కేసులు, దర్యాప్తు జరిగిన విధానం, చార్జీషీట్‌లు దాఖలు, కోర్టులో కేసులు ఏ దశలో ఉన్నాయి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

బదిలీలు మారిపోతున్నాయ్!

» ఆర్‌డబ్ల్యూఎస్‌లో పైసలు ఇచ్చిన వారికి ఆర్డర్లు

» ఈఎన్‌సీ కార్యాలయానికి రెండుజిల్లాల నుంచి క్యూ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగంలో ఇచ్చిన బదిలీలను మళ్లీ మార్చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో భారీ అవినీతికి పాల్పడిన అధికారులు కొందరు బదిలీలను మార్పించుకుంటున్నారు. గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో కొంతమంది అధికారుల చుట్టూ వీరు తిరుగుతున్నారు. బదిలీ ఆర్డర్స్ వచ్చినా అక్కడికి వెళ్లటానికి ఈ అధికారులు ససేమిరా అంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో కొందరు అవినీతి అధికారులు డబ్బులు తీసుకుని ఆర్డర్లు మార్చేస్తున్నారన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు ఏఈలు ఈఎన్‌సీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈఎన్‌సీ సంజీవరెడ్డి దీనిపై సీరియస్‌గా దృష్టి సారించి విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యూనియన్ బ్యాంకు సిబ్బంది సమ్మె విరమణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 : యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావడంతో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న సమ్మెను విరమించినట్టు సంఘ నేత డి.రాజేష్‌బాబు తెలిపారు. బుధవారం లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాజేష్‌బాబుతో పాటు బి. యోహాన్, వినిల్, వి.శ్రీనివాస్, దుర్గారావు, సలాం, వాణి తదితరులు పాల్గొన్నారు. 60 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు నిర్దిష్టమైన హామీని బ్యాంకు అధికారులు ఇచ్చారని చీఫ్ లేబర్ కమిషనర్ అభ్యర్థన మేరకు సమ్మెకు దిగడం లేదని సంఘ నాయకులు తెలిపారు.

చిరు వ్యాపారులను ఆదుకోండి

» గృహాల్లో చిన్న కిరాణా షాపులు, బడ్డీకొట్లనూ గుర్తించి పరిహారం ఇప్పించండి

» సీఎం చంద్రబాబుకు ఎంపీ కేశినేని చిన్ని సూచన..

వన్‌టౌన్, సెప్టెంబరు 25 : గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న చిన్న కిరాణా షాపులు, బడ్డీకొట్లకు ట్రేడ్, లేబర్, కమర్షియల్ లైసెన్స్‌లు లేని కారణంగా ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదని, వాటిని నమోదు చేసి పరిహారం ఇప్పించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు వరద బాధితులకు నష్టపరిహారాన్ని విడుదల చేశారు. ఎన్యూమరేషన్ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ఎంపీలు, ఎమ్మెల్యేలను కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ శివనాథ్ ఫస్ట్‌ఫ్లోర్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న షాపుల వారికి లైసెన్స్‌లు లేని కారణంగా ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదన్నారు. వీరిని ఆదుకోవటానికి భౌతిక పరిశీలన చేసి సహాయం అందించాలన్నారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ శివనాథ్ విజ్ఞప్తిని పరిశీలించాల్సిందిగా కలెక్టర్ సృజనకు సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

చిరు వ్యాపారస్తులకు బీమా కంపెనీ ద్వారా 30 శాతం అడ్వాన్స్

వరదల్లో నష్టపోయిన చిరువ్యాపారస్తులను ఆదుకునేందుకు ఎస్ఎంఈ కార్పొరేషన్ బీమా కంపెనీల ద్వారా 30శాతం నగదు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. వరద బాధితులను చంద్రబాబు అన్నివిధాలుగా ఆదుకునేందుకు బీమా కంపెనీలు, బ్యాంకుల అధికారులతో మాట్లాడుతున్నారన్నారు. ఈనెల 30లోగా బీమా క్లెయిమ్‌లు, బ్యాంకు రుణాల రీషెడ్యూల్ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. వరదల్లో 6వేల టీవీలు మరమ్మతుకు రాగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో 4,500 టీవీలను బాగుచేసినట్టు తెలిపారు. మరో 1500 టీవీలను వారం రోజుల్లో బాగుచేస్తామని ఎలక్ట్రానిక్ కంపెనీలు తెలిపాయన్నారు. ఆర్థిక సహాయం విడుదల చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

దసరా పనులు పూర్తిచేయండి

» మంత్రి కొల్లు రవీంద్ర



దసరా ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, దుర్గగుడి ఈవో

వన్‌టౌన్, సెప్టెంబరు 25: దసరా పనులు సకాలంలో పూర్తిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరిలు దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, అధికారులను ఆదేశించారు. బుధవారం దసరా ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సుజనా చౌదరి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ సహా అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీసు, అగ్నిమాపక, ఇతర శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

దుర్గమ్మ పంచహారతుల సేవలో కలెక్టర్ సృజన

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ పంచహారతుల సేవలో బుధవారం సాయంత్రం కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం అధికారులు ఆమెకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేయగా వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆమె కళావేదికపై జరుగుతున్న కూచిపూడి నృత్యప్రదర్శనను తిలకించి కళాకారులను అభినందించారు.

అలరించిన శైలశ్రీ బృందం.. ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

నగరానికి చెందిన గోనుగుంట శైలశ్రీ ఆధ్వర్యంలోని శ్రీనృత్యకళా నిలయం కళాకారుల బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాట్యాచారిణి శైలశ్రీ ఆధ్వర్యంలోని బృందం 13 కీర్తనలకు హావ, భావంగా చక్కటి ప్రదర్శన చేసి ఆహుతుల అభినందనలు అందుకున్నారు.



కూచిపూడి నృత్య కళాకారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



పోటాపోటీగా మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారిణులు

ఉత్కంఠగా మహిళల ఫుట్‌బాల్

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 25 : కానూరు 100 అడుగుల రోడ్డు సమీపంలో అనుమోలు ప్రభాకర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్ర సీనియర్ మహిళా ఫుట్‌బాల్ మ్యాచ్‌లు బుధవారం ఉత్కంఠగా సాగాయి. మ్యాచ్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ పరిశీలించారు. తొలుత జట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. సత్యసాయి జిల్లా, నంద్యాల జిల్లాపై 5-0తో, కర్నూలు.. నెల్లూరుపై 1-0 తేడాతో, తూర్పుగోదావరి.. నంద్యాలపై 2-0తో, నెల్లూరు.. ఎన్టీఆర్ జిల్లాపై 2-0తో, సత్యసాయి.. తూర్పుగోదావరిపై 1-0తో విజయభేరి మోగించాయి. కర్నూలు, ఎన్టీఆర్ జట్ల మధ్య చివరిమ్యాచ్ రద్దయింది. సెమీస్, ఫైనల్స్ గురువారం జరుగుతాయని, అనంతరం విజేతలకు ట్రోఫీల ప్రదానం ఉంటుందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, చక్రవర్తి తెలిపారు.

రేపట్నుంచి నుంచి లీగ్ మ్యాచ్‌లు

టోర్నీ ముగిశాక సత్తాచాటిన 96 మంది ప్లేయర్స్‌ను ఆరు క్లబ్‌లు విడిదీసి ఈనెల 27 నుంచి 29 వరకు వారి మధ్య లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాసరావు తెలిపారు. వారిలో నుంచి 22మందితో సీనియర్ జట్టును ఎంపిక చేసి వారికి ఏలూరులో 10 రోజుల శిక్షణ శిబిరం నిర్వహించి, అనంతరం నోయిడాలో అక్టోబర్ 10నుంచి జరిగే జాతీయ చాంపియన్‌షిప్‌కు పంపుతామని తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీగా శ్రీనివాసరావు

» ఏసీగా శ్రీనివాసచౌదరి

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా టి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఎస్ఈబీ ప్రధాన కార్యాలయంలో పనిచేసి, ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు విజయవాడలో డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా వై.శ్రీనివాస చౌదరిని నియమించారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఎస్ఈబీని రద్దు చేసి ఎక్సైజ్ శాఖలో విలీనం చేసిన తర్వాత రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలకు పూర్వం ఉన్నట్టుగానే ఒక డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించారు. ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్‌జిల్లా, కృష్ణాజిల్లాకు కలిపి ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అసిస్టెంట్ కమిషనర్ ఉంటారు. ఈ ఇద్దరు అధికారులు విజయవాడ కేంద్రంగానే విధులు నిర్వర్తిస్తారు. విజయవాడలో డిస్టలరీస్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న జి.మునిస్వామిని అనంతపురం జిల్లా ఏసీగా బదిలీ చేశారు. విజయవాడలో ఏపీఎస్‌బీసీఎల్ జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బి.స్వాతిని విజయవాడ డిస్టలరీస్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. విజయవాడలోని ఏపీఎస్‌బీసీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాసరావును నెల్లూరు జిల్లా డీసీగా బదిలీ చేశారు. విజయవాడలో ఎస్ఈబీ డీసీగా పనిచేసి, వెయిటింగ్‌లో ఉన్న ఎం.శంకరయ్యను ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో డీపీఈవోగా ఉన్న బి.శ్రీనాథుడిని విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. పాడేరులో ఎస్ఈబీ ఈఎస్‌గా పనిచేసి వెయిటింగ్‌లో ఉన్న సిరిగినీడి శ్రీనివాసరావు ఎన్టీఆర్ జిల్లా డీపీఈవోగా నియమించారు. కృష్ణా జిల్లా డీపీఈవోగా ఉన్న ఎ.అవులయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. కృష్ణా జిల్లా ఎస్ఈబీ ఈఎస్‌గా పనిచేసి వెయిటింగ్‌లో ఉన్న జి.గంగాధరరావును జిల్లా డీపీఈవోగా నియమించారు.

కృష్ణాజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా గంగాధరరావు

మచిలీపట్నం(ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా మచిలీపట్నం ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్‌గా జి.గంగాధరరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. గతంలో కృష్ణా ఎస్ఈబీ ఈఎస్‌గా పనిచేసిన ఆయన కొంతకాలంగా పోస్టింగ్‌కోసం ఎదురుచూస్తున్నారు. మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభాన్ బదిలీఅయ్యారు. ఆయనను సీఐడీ విభాగం డీఎస్పీగా బదిలీచేశారు.

న్యూస్ బాక్స్

సేవలు గుర్తించే పదవి

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 : ప్రజలకు చేసిన సేవలను గుర్తించి చంద్రబాబు తనకు ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారని కొనకళ్ల నారాయణ అన్నారు. బుధవారం కొనకళ్ల నారాయణను పలువురు




ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

నగర ప్రముఖులు శాలువాలతో సత్కరించారు. టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, బత్తిన దాసు, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మంగళగిరి టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

కొనకళ్లకు శుభాకాంక్షలు



ఆటోనగర్ : ఆర్టీసీ చైర్మన్, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణను తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు నాగేంద్ర కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నలు కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అప్స డెమొక్రటిక్ గుడివాడ డివిజన్

సీఎం సహాయనిధికి విరాళాలు..

గుడివాడ : వరద బాధితుల సహాయార్థం అప్స డెమొక్రటిక్ గుడివాడ డివిజన్ సభ్యులు చంద్రబాబుకు చెక్కు అందజేశారు. విద్యాలయ ఉన్నత పాఠశాల రూ.1.75లక్షలు, విద్యావికాస్ ఉన్నత పాఠశాల రూ.1,04,600, పామర్రు మండలం, జుజ్జవరం ఉషోదయ స్కూల్ రూ.2,87,786, పామర్రు ఏఎస్ఎం ఉన్నత పాఠశాల రూ.1,50,500, వికాస్ రెయిన్‌బో స్కూల్ గుడివాడ రూ.40వేలు, తక్షశిల పబ్లిక్ స్కూల్ రూ.20వేలు, రాఘవేంద్ర ఉన్నత పాఠశాల రూ.5వేలు, బడ్జెట్ స్కూల్స్ రూ.70వేలు అందజేశారు.



వరద బాధితుల సహాయార్థం చంద్రబాబుకు రూ.15,00,116ల చెక్కును సిటీ కేబుల్, సిటీ సిరి డిజిటల్ నెట్‌వర్క్ అసోసియేషన్ సభ్యుల తరపున సిటీ సిరిమీడియా ఎండీ దండమూడి కృష్ణమోహన్, సిటీకేబుల్ ఎండీ కొల్లి నారాయణప్రసాద్‌లు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

వృద్ధాశ్రమంలో దుస్తులు, నిత్యావసర సరుకుల అందజేత

పాయకాపురం : మైత్రి లోటస్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని కోమటిశేష సాయి వృద్ధాశ్రమంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధుల వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం, దుస్తులు, వంట సామాన్లు, నిత్యావసర సరుకులను అందజేశారు. వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జమలయ్య, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లయోలాలో ముగిసిన పవర్ బీఐ ఫర్ బిజినెస్‌పై సదస్సు

భారతీనగర్, సెప్టెంబరు 25: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐటీ విభాగాధిపతి వి. విద్యాసాగర్, సీఎస్ హెచ్‌వోడీ ఎల్ . కన్యాకుమారి పర్యవేక్షణలో హార్నెసింగ్ ది పవర్ ఆఫ్ డేటా, పవర్ బీఐ ఫర్ బిజినెస్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన ఎడ్యునెట్ ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ పి. గురుప్రసాద్ హాజరై మాట్లాడుతూ పవర్ బీఐ, సాఫ్ట్‌వేర్ సేవలు, యాప్‌లు పని చేసే విధానాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెత్త రీసైక్లింగ్‌పై అవగాహన

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 25 : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చెత్త రీసైక్లింగ్‌పై ఎంకే బేగ్ పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రీయూస్ రీసైకిల్) విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యర్థ పదార్థాల నిర్వాహణపై అవగాహన కల్పించారు. అలాగే రీసైక్లింగ్ వస్తువులను వివరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ

సత్యనారాయణపురం, సెప్టెంబరు 25: స్థానిక ఏకేటీపీఎం పాఠశాలలో ఇటీవల వరదల్లో పుస్తకాలు కోల్పోయిన విద్యార్థులకు ప్రభుత్వం పంపిన నోట్‌బుక్స్, బ్యాగ్స్, టెక్స్ట్‌బుక్స్‌ను, స్టూడెంట్ కిట్స్‌ను కార్పొరేటర్ శర్వాణీమూర్తి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థి దశను గడిపితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ ఉద్దంటి వేదవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ తీరును అసహ్యించుకుంటున్నారు

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, సెప్టెంబరు 25 : తిరుమల లడ్డూను కల్తీ చేయడం, వరద నీటిలోకి బోట్లను పంపి ప్రకాశం బ్యారేజీకి నష్టం చేయాలని చూడటం వంటి చర్యల వల్ల జగన్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 12, 13 డివిజన్లలో బుధవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె పాల్గొని ప్రజలతో మాట్లాడి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రోడ్లలో స్టిక్కర్లు అంటించారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. అభివృద్ధికి సహకరించని జగన్ మాటలను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్‌లోని ప్రతీ ఒక్క హామీని అమలు చేస్తామని, దీపావళికి ఒక పథకం, సంక్రాంతికి ఒక పథకం అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, గద్దె ప్రసాద్, శాయన బుజ్జి, ఎం.ఖలీల్, వి. శ్రీనివాస్, జె సుబ్బారావు, టి. శేషుబాబు, ఎం. నారాయణలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ

జాతీయ నులిపురుగుల నివారణ దినంను పురస్కరించుకుని 12వ డివిజన్ సంజయ్ గాంధీ కాలనీలో సంజీవయ్య ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దత్తాచారి, ఎండీ ఉస్మాన్, మోతీబాబు, హెచ్‌ఎం ఏకాంబరం, శాయన సత్యనారాయణలు పాల్గొన్నారు.



12వ డివిజన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న గద్దె రామ్మోహన్

కూటమి నాయకత్వంలో మంచి ప్రభుత్వం

ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్: ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో మంచి ప్రభుత్వం నడుస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బుధవారం 54వ డివిజన్ వించిపేటలో 5వ రోజు మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు కరపత్రాలను పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన నుంచి కూటమి రాకతో విముక్తి కలిగిందన్నారు. మద్దతు ఇచ్చిన ప్రజలకోసం మరింత బాధ్యతగా పనిచేస్తామన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. జనసేన నాయకురాలు తిరుపతి అనూష, కూటమి నేతలు నాగుల్ మీరా, బొమ్మసాని సుబ్బారావు, ఎంఎస్ బేగ్, కార్పొరేషన్ జోనల్ కమిషనర్ , స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, 100రోజుల పాలన సక్సెస్ అని టీడీపీ మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తి రాజు అన్నారు. 31వ డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ ఆధ్వర్యంలో 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంచి, ఇంటింటికి స్టిక్కర్‌లు అంటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలజీ, శ్రీనివాస్, ఉమాదేవి, సచివాయం వెల్ఫేర్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్లు సమరం, మారు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: డాక్టర్ సమరం

పటమట, సెప్టెంబరు 25 : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచితేనే మనిషి జీవన ప్రమాణాలు పెరుగుతాయని స్వచ్ఛభారత్ విజయవాడ నగరపాలక సంస్థ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి. సమరం అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు దేశ వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడ నాస్తిక కేంద్రంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, వీఎంసీల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ వైపు స్వచ్ఛమైన అడుగు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, పార్టిసిపేట్ సర్టిఫికెట్లను నగర కమిషనర్ ధ్యానచంద్ర చేతుల మీదుగా అక్టోబరు 1న పంపిణీ చేయిస్తామని సమరం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నియంత, రష్మీ, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలి

పాయకాపురం / మొగల్రాజపురం, సెప్టెంబరు 25 : ప్రతి ఒక్కరూ రాజ భాష హిందీని నేర్చుకోవాలని ప్రాంతీయ ఆయుర్వేద చర్మరోగ పరిశోధన సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. రాజ భాష హిందీ కార్యశాల 2024 కార్యక్రమం రాజీవ్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందీ భాషలో అవగాహన పెంచుటకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన అధికారి డాక్టర్ ఏజీవీ సాయిప్రసాద్, పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు

పీబీ సిద్ధార్థ విద్యార్థులకు బహుమతులు

దక్షిణ భారత హిందీ ప్రచార సభ విజయవాడ ఆధ్వర్యంలో మాచవరం కేంద్రంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు చందన్ సింగ్(సీఈసీ, ద్వితీయ సంవత్సరం)మొదటి బహుమతి, దేవేల్ కుమార్ ప్రజాపత్ (సీఈసీ, మొదటి సంవత్సరం)ద్వితీయ బహుమతులు సాధించారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భాషలో పట్టు సాధించడం వల్ల అన్య భాషల్లో కూడా ప్రావీణ్యత వస్తుందని అన్నారు.

ఫన్‌టైమ్స్ క్లబ్‌లో క్రీడా సదుపాయాలు కల్పిస్తా

●ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 25: ఫన్ టైమ్స్ క్లబ్‌లో క్రీడా సదుపాయాలు కల్పిస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం జరిగిన ఫన్‌టైమ్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి, జిమ్, ఇండోర్ స్టేడియం, తదితరాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా క్రమశిక్షణతో క్లబ్‌ను నిర్వహించటంపై సభ్యులను అభినందించారు. ఫన్‌టైమ్స్ క్లబ్‌లో మరిన్ని క్రీడా సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు తగిన కృషి చేస్తానని తెలిపారు. సభ్యులు కోరిన మేరకు షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. క్లబ్ వైస్ ప్రెసిడెంట్లు బొర్రా రాధాకృష్ణ (గాంధి), అల్లూరి సుమబిందు, సెక్రటరీ కిలారు వెంకట శివాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసరాజు విజయబాబు, ట్రెజరర్ సతీష్ బాబు, టీడీపీ నాయకుడు బొప్పన భవకుమార్, కార్పొరేటర్లు అపర్ణ, జాస్తి సాంబశివరావు పాల్గొన్నారు.



ఫన్ టైమ్స్ క్లబ్ సభ్యులతో కలిసి పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు

వన్‌టౌన్, సెప్టెంబరు 25: విద్యావంతులే ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని వెస్ట్‌జోన్ ఏసీపీ ఎన్. దుర్గారావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ, కొత్తపేట పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు జరిగింది. కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువుకున్నవాళ్లు, అవగాహన ఉన్నవాళ్లే ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని, లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఎవరికీ కూడా పాస్‌వర్డ్, తదితరాలను తెలియజేయవద్దన్నారు. తెలియని లింక్‌లకు క్లిక్ చేయవద్దని చెప్పారు. రుణాల యాప్‌ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ క్రైం సీఐ పలివేల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన కేసుల వివరాలను సోదాహరణంగా వివరించారు. కొత్తపేట సీఐ చిన్నకొండలరావు, సైబర్ క్రైం ఎస్ఐ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ ఎన్.దుర్గారావు

విద్యార్థులకు ఎన్‌సీసీతో ఉత్తమ భవిష్యత్తు

లెఫ్టినెంట్ కల్నల్ పాండే

వన్‌టౌన్, సెప్టెంబరు 25: విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా ఉత్తమ భవిష్యత్తు ఏర్పడుతుందని 17వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జి.సి.పాండే అన్నారు. కేబీఎన్ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యా సంవత్సర ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాత పరీక్ష, దేహధారుడ్య పరీక్షలు, రన్నింగ్ వంటి అంశాలతో ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దటానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యా సంస్థల పరిపాలనా అధికారి డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాలలో అనేక దశాబ్దాలుగా ఎన్‌సీసీ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్, మేజర్ మహేంద్రసింగ్, సుబేదార్ సురేష్ చౌదరి, హవల్దార్ నేత్ర, తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కె.పి.టి. విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ

చిట్టినగర్, సెప్టెంబరు 25: చిట్టినగర్ మట్టా లాజరస్ నగరపాలక సంస్థ పాఠశాలలో బుధవారం విద్యార్థులచే నులిపురుగుల నివారణ మందులు మింగించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు బసవేశ్వరరావు, డాక్టర్ అలేఖ్య, ఏఎన్‌ఎంఎస్‌లు సునీత, సుజాత, రమణ తదితరులు పాల్గొన్నారు.





బాధితులకు దుప్పట్లు, టవల్స్‌ను పంపిణీ చేస్తున్న ఫెడరల్ బ్యాంక్ ఎంప్లాయిస్



బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుజనా



దుస్తులు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ భరత్‌భూషణ్, నాగుల్‌మీరా, జవహర్ తదితరులు

బాధితులకు ఫెడరల్ బ్యాంక్ దుప్పట్ల పంపిణీ

భవానీపురం, సెప్టెంబరు 25: ఫెడరల్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రామరాజ్యనగర్, భవానీపురంలో ఉన్న పేదలకు 300 మందికి దుప్పట్లు, టవల్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫెడరల్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ విజయవాడ రీజినల్ సెక్రటరీ కె. రమేష్‌బాబు మాట్లాడుతూ ఎస్ రాంబాబు(సెక్రటరీ ఏఐబీఈఏ) పిలుపు మేరకు వరద బాధితులకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈనెల 16న బొమ్మసాని సుబ్బారావునగర్‌లో, భవానీపురంలో బుడమేరు ముంపు బాధితులకు 200 దుప్పట్లను, టవల్స్‌ను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఈయూ విజయవాడ రీజనల్ చైర్మన్ వేమూరి రామయ్య, ఏపీ, తెలంగాణ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వై.శ్రీనివాసరావు, రాధాకృష్ణ, బాబు, రవి, సురేష్‌కుమార్, యానిష్‌కుమార్, హర్షలు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నిత్యావసరాలు..

భవానీపురం: 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లోని వరద బాధితులకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ సేవాశ్రమ సారథ్యంలో సమకూర్చిన నిత్యావసరాల కిట్లను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి బుధవారం పంపిణీ చేశారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమతి స్వామి జపానంద మహరాజ్ మాట్లాడారు. 2వేల మందికి నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, తిరుపతి అనూష, పైలా సోమినాయుడు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

చిట్టినగర్: కేఎల్ రావు నగర్, పాలఫ్యాక్టరీ తదతర ప్రాంతాలలో వరద బాధితులకు భరత్ భూషణ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అప్పికట్ల భరత్ భూషణ్ ఆధ్వర్యంలో బుధవారం సర్కిల్-1 కార్యాలయం సమీపంలో బాధితులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ క్రిస్టియన్ మండలి అధ్యక్షులు జవహర్, టీడీపీ సీనియర్ నాయకుడు నాగుల్‌మీరాలు పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు గుర్రం కొండ, వి.చంటి, రామారావు, పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి

చిట్టినగర్, సెప్టెంబరు 25: మత్తు వదిలితేనే భవిష్యత్ అని, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు సూచించారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బుధవారం చిట్టినగర్ టేనర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో(టీఎంహెచ్ స్కూల్) మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతోపాటు సామాజికంగా ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామన్నారు. ముందుగానే అవగాహన కలిగి ఉండటం వలన జీవితాన్ని చక్కదిద్దుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఎస్.దేవమణి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రబాబు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గోళ్లమూడి శేఖర్‌బాబు



అమ్మవారి తొమ్మిది అవతారాల వేషధారణలో చిన్నారులు

సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో దసరా సంబరాలు


మొగల్రాజపురం, సెప్టెంబరు 25: మొగల్రాజపురం వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ఆధ్వర్యంలో బుధవారం దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. కేజీ విభాగం విద్యార్థులు అమ్మవారి తొమ్మిది అవతారాలతో పాటు మహిషాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా జరుపుకుంటారని వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్ జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



నా దృష్టిలో... వేడుక అంటే ఇదే

నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.



నేరస్థుల పాలిట యముడు

'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి గాయకుడు బాలు పేరు


• సీఎం స్టాలిన్ ఉత్తర్వులు



గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజీత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజీత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్లుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు.

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏవిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేషు చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్త్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కశిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాతి, మహేశ్ రాతీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థీఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

దిక్సూచి
DIKSUCHI

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. • వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.7000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్ర్కీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్ర్కీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్ర్కీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్ర్కీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.17,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.9,800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యూనాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్‌ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్‌ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్‌ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్‌ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్‌ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం, లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

కిచెన్‌లో వస్తువుల అమరిక ఇలా...

కిచెన్‌లో స్టోరేజ్ సమస్య చాలామందికి ఎదురయ్యేదే. ఏది ఎక్కడ పెట్టాలో తెలియక ఎక్కడో ఓ చోట పెట్టేస్తారు. మళ్లీ దాని కోసం కిచెన్ మొత్తం వెతుకుతారు. అయితే కాస్త ఓపికగా కిచెన్‌ను సర్దుకుంటే ఇలాంటి ఇబ్బందులు దరిచేరకుండా ఉంటాయి. కిచెన్‌లో వస్తువుల అమరికలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

- కిచెన్‌లో స్టోరేజ్ సమస్య తీరాలంటే ముందుగా పనికిరాని వస్తువులను తీసేయాలి. ఇందుకోసం క్యాబినెట్స్‌లో నుంచి వస్తువులన్నీ తీసి బయటపెట్టాలి. వాటిని మూడు రకాలుగా విభజించాలి. ఒకటి ట్రాష్ బిన్‌లో వేసేవి. రెండో రకం డొనేట్ చేసేవి. మూడో రకం అవసరమైనవి. ఈ మూడో కేటగిరీకి చెందిన వస్తువులను మాత్రమే క్యాబినెట్‌లో సర్దుకోవాలి. ఇలా చేయడం వల్ల కిచెన్‌లో సగం పనికిరాని వస్తువులు బయటకు వెళ్లి స్థలం కలిసొస్తుంది.




- క్యాబినెట్స్, షెల్ఫ్‌లు క్లీన్ చేశాక కిచెన్ వస్తువులను కేటగిరీలుగా విభజించుకోవాలి. అంటే కుక్‌వేర్, డిన్నర్‌వేర్, తినే ఆహారపదార్థాలు.. ఇలా కేటగిరీలుగా విభజించుకోవాలి. వంట పాత్రలు, ప్యాన్‌లు, కటింగ్‌బోర్డ్, ప్లేట్లు, గ్లాసులు... ఇవన్నీ కుక్‌వేర్‌లోకి వస్తాయి. వీటిని ఒక క్యాబినెట్‌లో సర్దుకోవాలి. డ్రింక్‌లు, బేకింగ్‌కు ఉపయోగించే పదార్థాలు, స్నాక్స్ వంటివన్నీ మరో కేటగిరీగా విభజించి సర్దుకోవాలి. మసాలా దినుసులు, పప్పులు, రకరకాల పిండిపొడులను మరోచోట ఈజీగా దొరికేలా అమర్చుకోవాలి.
- రోజులో ఎక్కువ సార్లు ఉపయోగించే వస్తువులను సులభంగా తీసుకునేలా అమర్చుకోవాలి. ఉదాహరణకి రోజులో నాలుగైదు సార్లు కాఫీ తాగే అలవాటు ఉంటే కాఫీ కప్పులు, కాఫీ పొడిని సులభంగా తీసుకునేలా పెట్టుకోవాలి.



- ఏదైనా ఫంక్షన్స్ జరిగినప్పుడు మాత్రమే ఉపయోగించే వస్తువులను పై క్యాబినెట్‌లలో అమర్చుకోవాలి. ఆహారాన్ని నిలువ ఉంచే పాత్రలను కౌంటర్ పైభాగంలో పెట్టుకోవాలి.
- కింది క్యాబినెట్‌లలో దోశ, ఫ్రై ప్యాన్‌లు, బేకింగ్ షీట్లు, కటింగ్ బోర్డులు, మిక్సింగ్ బౌల్స్ వంటివి అమర్చుకుంటే అనువుగా ఉంటుంది.
- పాత్రలు శుభ్రం చేసేందుకు ఉపయోగించే సబ్బులు, లిక్విడ్‌లను సింక్ కింద అమర్చుకుంటే స్థలం కలిసి వస్తుంది. స్పాంజ్‌లు, డిష్ వాషర్ ప్యాడ్‌లను కూడా ఇక్కడే పెట్టుకోవాలి.
- క్యాబినెట్ డోర్లపై లేబుల్స్ అంటించుకోవడం ద్వారా ఏ క్యాబినెట్‌లో ఏమున్నాయో సులువుగా గుర్తించడానికి వీలవుతుంది. పప్పులు, మసాలా దినుసులు భద్రపరచుకున్న సీసాలపై కూడా లేబుల్స్ అంటించుకోవడం ద్వారా సమయం వృథా కాకుండా ఈజీగా తీసుకోవచ్చు.

సంకల్పం



రంగు బాలలక్ష్మీగౌడ్... కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, ఛీత్కారాలు... సినిమా కథకు ఏమాత్రం తీసిపోదు ఆమె జీవితం. అన్నిటినీ భరించి... ఉద్యమ బాటలో నడిచి... యువతరానికి స్ఫూర్తిమంత్రమయ్యారు. 'తెలంగాణ బీసీ కమిషన్'లో మొట్టమొదటి మహిళా సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తన పోరాట నేపథ్యాన్ని బాలలక్ష్మి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

మగరాయుడని వెక్కిరించారు

"తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన క్షణం నా హృదయం ఆనందంతో ఉప్పొంగింది. ఏ తెలంగాణ కోసమైతే ప్రాణాలకు తెగించి పోరాడానో, ఆ తెలంగాణ రాష్ట్ర చిహ్నం చెంతన ఉన్నత హోదాలో కొలువుదీరడం ఎంతో ఉద్వేగానికి గురి చేసింది. ఆ మధుర క్షణంలో నా గతం కళ్లముందు కదలాడింది. ఉమ్మడి వరంగల్ జిల్లా 'మర్రి ముచ్చాల' అనే మారుమూల పల్లెటూరులో ఓ నిరుపేద కల్లుగీత కార్మికుడి కూతురినైన నేను... ఇవాళ ఇక్కడి వరకు రాగలిగానంటే అదంతా తెలంగాణ పోరాట ఫలితమే.

మా అమ్మానాన్న ఐలయ్యగౌడ్, సువర్ణ. ఐదుగురు కూతుళ్లలో పెద్దమ్మాయిని. అప్పుడు నాకు ఆరేళ్లు ఉంటాయి. ఒకరోజు తెల్లవారుజామున పోలీసులు మా ఇంటికొచ్చి, తాటి చెట్లు ఎక్కడం, కరెంటు పని తప్ప మరో లోకం తెలియని మా నాన్నను 'నక్సలైట్ల ఇన్ఫార్మర్' అంటూ చిత్రహింసలు పెట్టారు. తనకేమీ తెలియదని నాన్న మొత్తుకున్నా వినకుండా అరెస్టు చేశారు. ఐలయ్య పేరుగల మరొకరి కోసం గాలిస్తూ, అదే పేరుగల మా నాన్నను పొరపాటున తీసుకెళ్లామని తెలుసుకొని, తర్వాత విడుదల చేశారు. ఖాకీ డ్రెస్‌కు అంత పవర్ ఉంటుందని చూసి, నిర్ఘాంతపోయాను. పెద్దయ్యాక నేనూ పోలీసు అవ్వాలని బలంగా నిశ్చయించుకున్నా. అయితే మనం ఒకటి తలిస్తే, విధి మరొకటి తలుస్తుంది అన్నట్టు తొమ్మిదో తరగతిలో ఉండగానే నాకు పెళ్లి చేశారు. అది నా జీవితంలో పెద్ద కుదుపు.

అక్కడే తొలి అడుగు...

పెళ్లి అయ్యి నెలలు గడుస్తున్నా... అత్తింటివాళ్లు నన్ను తీసుకెళ్లలేదు. 'బాధపడుతూ కూర్చోవద్దు. మళ్లీ చదువు కొనసాగించ'మని నాయనమ్మ చెప్పింది. మా ఊరి హైస్కూల్లో చేరదామని వెళితే... 'విద్యా సంవత్సరం మధ్యలో చేరి, మళ్లీ ఫెయిల్ అయితే స్కూలుకు చెడ్డ పేరు' అని హెడ్‌మాస్టర్ కుదరదన్నారు. 'ఈ అమ్మాయి మంచి మార్కులు తెచ్చుకుంటుంది చూడండి' అని సుధాకర్ మాస్టారు నచ్చజెప్పడంతో నన్ను తరగతి గదిలోకి వెళ్లనిచ్చారు. ఆయన అన్నట్టుగానే పదో తరగతిలో ఫస్ట్‌క్లాసులో ఉత్తీర్ణత సాధించాను. చేర్యాలలో ఇంటర్ పూర్తయ్యాక, సిద్ధిపేటలో డిగ్రీలో చేరాను. అక్కడ నాకు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సామాజిక అంశాలు పరిచయమయ్యాయి. మా తెలుగు అధ్యాపకుడు నందిని సిధారెడ్డి సారు కవిత్వం చదవడం ద్వారా తెలంగాణ అస్తిత్వ సోయి మాలో కలిగింది. గద్దరన్న పాటలు, ప్రొఫెసర్ జయశంకర్ సారు రాతలు, కాళోజీ కవితలు నాకు చైతన్య ప్రబోధాలయ్యాయి. వాటన్నింటి ప్రభావంతో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష నాలో బలంగా నాటుకుంది.

నా లక్ష్యం ముఖ్యం కాదనుకున్నా...

నా జీవితాన్ని మలుపు తిప్పింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎకనామిక్స్ పోస్టు గ్రాడ్యుయేషన్‌కు ఆర్ట్స్ కళాశాలలో అడుగుపెట్టాను. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. అయితే ప్రిలిమ్స్‌లో విజయం సాధించినా, పరుగు పోటీలో కొద్ది తేడాతో అవకాశం చేజారింది. పీజీ పూర్తయ్యాక, ఉస్మానియా లా కాలేజీలో ఎల్ఎల్‌బీలో చేరాను. అది 2009... నవంబర్ 30. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మలుపు తీసుకొంటున్న సందర్భం... క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మొదటి సంవత్సరం లా పరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్స్ ద్వారా డీఎస్పీ కావచ్చన్న ఉద్దేశంతో ఓయూ హాస్టల్‌లోనే ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఆ సమయంలో నా పీజీ క్లాస్‌మేట్ శ్రీను ఫోన్ చేసి, 'ఆర్ట్స్ కాలేజీ దగ్గర విద్యార్థుల తలకాయలు పగులుతుంటే, మీరు హాస్టల్‌లో కూర్చొని చదువుకుంటున్నారా' అన్నాడు. అసలు ఏమైందా అని టీవీ పెడితే కానీ మాకు తెలియలేదు అంత పెద్దఎత్తున నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయని. ఇక ఆలోచించలేదు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులను వెంటబెట్టుకుని ర్యాలీకి వెళ్లాను. ఆ రోజు నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. పోలీసు అవ్వాలన్న నా లక్ష్యంకన్నా తెలంగాణ సాధనే అత్యంత ముఖ్యం అనిపించింది.

> **పెళ్లి పెద్దగా బాపూజీ...**
>
> నన్ను తెలంగాణ మలిదశ పోరాటంవైపు నడిపించిన నా క్లాస్‌మేట్ కందకట్ల శ్రీనివాస్‌తో 2011లో నా వివాహమైంది. ఆయనది జనగాం దగ్గర నర్మేట గ్రామం. చేనేత కుటుంబ నేపథ్యం. నా మీద వాత్సల్యం కొద్దీ మా పెళ్లి పెద్దగా వ్యవహరించిన కొండా లక్ష్మణ్ బాపూజీ "నేత- గీత బంధం ఈనాటిది కాదు" అని మమ్మల్ని దీవించారు. మాకు ఒక అమ్మాయి. చే గువేరా మీద అభిమానంతో పాపకు 'చేశ్రీ' అని పేరు పెట్టాం

> **అలా కించపరచడం తగదు...**
>
> 
>
> తెలంగాణ మలిదశ పోరు సమయంలో మద్దతు ప్రకటించడానికి ఓ రోజు మా దీక్షా శిబిరానికి వచ్చిన ఒక నాయకుడు ప్రసంగిస్తూ, 'మనమేమీ చేతులకు గాజులు తొడుక్కోలేదు' అని ప్రస్తావించాడు. ఆయన మాటలకు నేను అడ్డుపడి, "అన్నా! ఆడవాళ్ళను కించపరిచేలా మాట్లాడద్దు" అని హెచ్చరించాను. ఆ నాయకుడు సభాముఖంగానే తన తప్పు ఒప్పుకొని క్షమాపణలు తెలిపాడు. ఈ రోజుకూ చాలామంది రాజకీయ నాయకులు 'చీర, గాజులు' అంటూ స్త్రీలను కించపరిచేలా మాట్లాడుతున్నారు. అలాంటి వాటిని ఒక మహిళగా ఉపేక్షించను.

మొదటి అమ్మాయిని...

మలి దశ తెలంగాణ పోరాటంలో భాగంగా ఓయూలో సాగిన రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మొట్టమొదటి అమ్మాయిగా నన్ను గూడ అంజయ్య లాంటి ప్రముఖ కవి గుర్తించి, పూల మాలతో సత్కరించారు. నా జీవితంలో మరిచిపోలేని మధురానుభూతి అది. ఓయూ విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ అధికార ప్రతినిధిగా... విద్యార్థి మహాగర్జన, మహాపాదయాత్ర, ఛలో అసెంబ్లీ, మిలియన్ మార్చ్, పొలికేక ఇలా... తెలంగాణ కోసం సాగిన ప్రతి కార్యక్రమంలో ముందున్నాను. హైకోర్టులో తెలంగాణ న్యాయవాదుల దీక్షకు మద్దతుగా 30మంది విద్యార్థులను వెంట తీసుకెళ్లిన నన్ను ఒక లేడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దారుణంగా కొట్టింది. నా కుడి చెయ్యి వెనక్కి విరిచిమరీ పిడిగుద్దులు గుద్దింది. ఇప్పటికీ ఆ చెయ్యి వెనక్కి వంచలేను. మరొక సందర్భంలో పోలీసులు ఉరికించి కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాను. రబ్బరు బుల్లెట్లు, పెల్లెట్లు... ఒక్కటి కాదు, ఎన్నో దెబ్బలు తిన్నాను. అయినా, భయపడలేదు. ఒకరోజు మా నాన్న ఫోన్ చేసి 'అమ్మా... నీకేమైనా అయితే భరించలేం. ఉద్యమాలు మనకు వద్దు' అన్నాడు. ఆ వెంటనే అమ్మ కల్పించుకొని, 'అది పోతే, మనకు ఇంకా నలుగురున్నారు. అమ్మాయిని ఆపకు' అన్న మాటలు... ఇప్పటికీ నా చెవుల్లో మార్మోగుతున్నాయి. ఒకటా రెండా... 500కు పైగా సభల్లో తెలంగాణ గళాన్ని వినిపించాను. నా మీద అటెంప్ట్ టు మర్డర్‌తో పాటు 30 కేసులు బనాయించారు. ఆ సమయంలో నా నలుగురు చెల్లెళ్లు ఆర్థిక సాయం అందించారు. మరెంతో మంది అండగా నిలిచారు. తెలంగాణ మలిదశ పోరాట చరిత్రలో ఆర్ట్స్ కాలేజీది ప్రముఖ అధ్యాయమైతే, అందులో నేనూ ఒక పేజీ అయినందుకు గర్వంగా ఉంది.

కారు... కరెన్సీ లేకున్నా...

అదే ఓయూ నుంచి ఎల్ఎల్ఎమ్ పట్టా పొందాను. ప్రస్తుతం అక్కడే 'రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం' అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్నాను. 2016లో నన్ను రేవంత్ అన్న కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కోఆర్డినేటర్‌గా, తుంగతుర్తి నియోజకవర్గం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా... ఇలా నాకు అప్పగించిన ప్రతి బాధ్యతనూ శక్తివంచన లేకుండా నిర్వర్తించాను. నా నిజాయితీకి దక్కిన గుర్తింపు, గౌరవమే బీసీ కమిషన్ సభ్యురాలి పదవి. అన్ని పార్టీల్లో నన్ను అభిమానించేవాళ్లు ఉన్నట్టే, అవమానించేవాళ్లూ ఉంటారు. "సొంతిల్లు, కారు లేని ఆమె ఎమ్మెల్యే ఎలా అవుతుంది. ఆటోల్లో బస్సుల్లో తిరిగే తనకు ఈ రాజకీయాలు అవసరమా' అని నా ముందే హేళన చేసినవారున్నారు. 'మగరాయుడు లెక్క కుర్తా పైజమా వేసుకుంటుంద'ని నా వస్త్రధారణను వెక్కిరించిన వారున్నారు. అవేవీ పట్టించుకోలేదు. నా అంతిమలక్ష్యం చట్టసభల్లో అడుగుపెట్టడమే. కారు, కరెన్సీ, ఖద్దరు లేకున్నా బహుజన ఆడబిడ్డలు రాజకీయాల్లో రాణించగలరన్న నమ్మకాన్ని కలిగించడానికి నా వంతు ప్రయత్నిస్తాను."

• సాంత్వన్

ఫొటోలు: రాజ్‌కుమార్

బ్యూటీ

చర్మం కోమలంగా!

30 ఏళ్ల నుంచి చర్మం బిగుతును కోల్పోవడం మొదలుపెడుతుంది. కొత్త చర్మ సమస్యలు కూడా ఆ వయసు నుంచే మొదలవుతాయి. వీటిని దూరం చేసుకోవాలంటే కొన్ని చర్మ చికిత్సలు, జాగ్రత్తలు, చిట్కాలు పాటించాలి.

- **క్లీనింగ్:** మాయిశ్చరైజర్ వల్ల చర్మం తేమగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే అంతకంటే ముందు చర్మం మీద పేరుకునే మృతకణాలను తొలగించుకోవాలి. ఇందుకోసం రోజు విడిచి రోజు మెత్తని బియ్యం పిండి, నిమ్మరసం, తేనె, పెరుగు మిశ్రమంతో ముఖ చర్మాన్ని కొద్దిసేపు మర్దన చేసి కడిగేసుకోవాలి. ఆ తర్వాత మెత్తని తువ్వాలుతో తుడుచుకుని, మాయిశ్చరైజర్ పూసుకోవాలి.
- **తేమగా:** చర్మానికి తేమ అవసరం. ఇది వ్యక్తికీ, వ్యక్తికీ, కాలానికీ మారుతూ ఉంటుంది. పొడిచర్మం కలిగిన వాళ్లు నీటి ఆధారిత మాయిశ్చరైజర్, జిడ్డుచర్మం కలిగినవాళ్లు ఆయిల్ బేస్‌డ్ మాయిశ్చరైజర్ వాడుకోవాలి. వీలైతే మీగడ, తేనె, నిమ్మరసం మిశ్రమం ముఖానికి పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. ఇలా ప్రతి మూడు రోజులకు ఒకసారి చేస్తూ ఉండాలి.
- **ఎక్స్‌ఫోలియేట్:** చర్మం మెరుపులీనాలంటే మృత కణాలు తొలగించాలి. ఇందుకు తగిన సమయం రాత్రివేళ. అయితే ముఖం మీద మొటిమలు ఉన్నా, చర్మం కంది ఉన్నా ఎక్స్‌ఫోలియేట్ చేయకూడదు. దీనికి బదులుగా సెనగపిండి, పాలు, గులాబీ నీళ్ల కలిపిన మిశ్రమం ముఖం మీద పూసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకోవాలి.



- **సన్‌స్క్రీన్:** సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు చర్మానికి హాని చేస్తాయి. వీటి నుంచి కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ వాడడం తప్పనిసరి. అయితే ఎండ తీవ్రత ఉన్నా, లేకపోయినా, సూర్యకిరణాలు సోకడం వల్ల చర్మం రంగుమారడం ఆగదు. కాబట్టి సన్‌స్క్రీన్ లోషన్ వాడడం తప్పనిసరి.
- **నిద్రకు ముందు:** నిద్రకు ముందు వేసుకున్న మేకప్ పూర్తిగా తొలగించాలి. లేదంటే ఉదయానికి కళ్లు ఎర్రగా మారతాయి, ముఖం మీద మొటిమలూ తలెత్తుతాయి. చర్మానికి గాలి సోకి, పునరుజ్జీవం పొందేలా రాత్రి నిద్రకు ముందు క్లీన్సర్ లేదా మేకప్ రిమూవర్‌తో మేకప్ పూర్తిగా తొలగించుకోవాలి. స్వచ్ఛమైన కొబ్బరినూనెతో మేకప్ తొలగించడం అన్ని విధాలా ఉత్తమం.
- **వ్యాయామం:** చర్మం యవ్వనంగా ఉండాలంటే క్రమంతప్పక వ్యాయామం చేయాలి. రక్తప్రసరణ మెరుగైతే చర్మం మెరుపులీనుతూ ఉంటుంది. వ్యాయామంతో వెలువడే స్వేదంతో చర్మరంధ్రాలు శుభ్రపడతాయి. వ్యాయామంతో మనసును హుషారుగా ఉండే హార్మోన్లు కూడా సరిపడా విడుదల అవుతాయి. కాబట్టి రోజులో కనీసం 30 నుంచి 40 నిమిషాలపాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి.
- **కాలుష్యం:** వాతావరణ కాలుష్యం చర్మ సమస్యలకు మూలం. కాబట్టి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతిసారీ ఎండకు, దుమ్ము, ధూళి నుంచి చర్మానికి రక్షణ కల్పించుకోవాలి. ఇందుకోసం ముఖానికి మాస్కులు ధరించవచ్చు. స్కార్ఫ్‌తో కప్పి ఉంచుకోవచ్చు. వీలైనంత వరకూ గొడుగు వాడాలి. వాహనాల మీద ప్రయాణం చేసేవారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. స్కార్ఫ్‌తోపాటు, చలువ కళ్లద్దాలు తప్పనిసరిగా ధరించాలి.

కౌన్సెలింగ్

వరుస గర్భస్రావాలను ఆపేదెలా?

Q A

డాక్టర్! నా వయసు 29. పెళ్లై ఏడేళ్లయింది. ఈ ఏడేళ్లలో పలు సార్లు అబార్షన్లు అయ్యాయి. మొదటిసారి గర్భం దాల్చినప్పుడు, మూడు నెలలకే పిండంలో ఎదుగుదల లేదనే కారణంతో గర్భస్రావం చేయించుకోవలసి వచ్చింది. రెండోసారి కూడా ఇలాగే జరిగింది. ముందు కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలున్నాయని వైద్యులు అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకుని, పండంటి బిడ్డను కనే మార్గం లేదా?

\- ఓ సోదరి, హైదరాబాద్.

రెండు, అంతకంటే ఎక్కువ సార్లు గర్భస్రావాలైతే, ఆ పరిస్థితిని రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్ అంటారు. ఇలాంటి వాళ్లు తప్పనిసరిగా కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. మరీ ముఖ్యంగా జన్యుపరమైన కారణాలున్నాయేమో పరీక్షించు కోవలసి ఉంటుంది. అందుకోసం భార్యాభర్తలిద్దరి జెనెటిక్ అనాలసిస్ చేయించుకోవాలి. కుటుంబంలో వరుస గర్భస్రావాలు జరుగుతున్న సందర్భాలు ఉన్నప్పుడు కూడా జన్యుపరమైన సమస్యగానే పరిగణించాలి. అలాగే ప్రెగ్నెన్సీకి వ్యతిరేకంగా శరీరంలో యాంటీబాడీస్ పెరగడం వల్ల గర్భస్రావం జరుగుతుందేమో కూడా తెలుసుకోవాలి. అలాగే థైరాయిడ్, మధుమేహాలను కూడా పరీక్షించుకోవాలి. వీటితో పాటు రక్తం గడ్డకట్టే తత్వం ఎక్కువగా ఉన్నప్పుడు, బిడ్డకు రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడి, గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని కూడా పరీక్షించుకోవాలి. ఈ పరీక్షలన్నీ చేయించుకుని, అసలు సమస్యను కనిపెట్టి, తగిన చికిత్సను ఎంచుకోగలిగితే, ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించే వీలుంటుంది. కాబట్టి మీరు మొదట ఈ పరీక్షలన్నీ చేయించుకుని, మూల కారణాన్ని కనిపెట్టి, గర్భం దాల్చే ప్రయత్నం చేయడం ఉత్తమం.





డాక్టర్ మంజుల అనగాని

హెచ్ఒడి ఆఫ్ గైనకాలజీ, కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్.



భావి పౌరుల్ని తీర్చిదిద్దే తరగతి గదిలో పాఠాల నుంచి... దేశ భవిష్యత్తుని మలచే చట్టసభల వరకూ సాగిన హరిణి అమరసూర్య ప్రయాణం... ఇప్పుడు శ్రీలంక ప్రధానిగా కొత్త మలుపు తీసుకుంది. హక్కుల కార్యకర్తగా, స్త్రీవాదిగా, సంస్కరణవాదిగా పేరుపొందిన హరిణి... ఢిల్లీ హిందూ కాలేజీ పూర్వ విద్యార్థిని. కల్లోలాలతో సతమతమవుతున్న శ్రీలంకకు మూడో మహిళా ప్రధానిగా... తనదైన ముద్ర వెయ్యడానికి ఆమె సిద్ధమవుతున్నారు.

కల్లోల లంకలో కాంతిరేఖ

శ్రీలంక దక్షిణ ప్రాంతంలోని ఒక చిన్న గ్రామంలో, దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు హరిణి అమరసూర్య. ఆమె తండ్రి తేయాకు తోటలో ఉద్యోగి. ఆమెకు ఇద్దరు తోబుట్టువులు. వారిద్దరి తరువాత... చాలాకాలానికి హరిణి పుట్టడంతో కుటుంబంలో అందరూ ఆమెను ఎంతో ప్రేమగా చూసుకొనేవారు. సరదాగా సాగిపోతున్న ఆమె బాల్యంలో హఠాత్తుగా ఒక కుదుపు... 1970ల్లో శ్రీలంక సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. టీ ఎస్టేట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీనితో ఆమె తండ్రి ఉపాధి పోయింది. ఆ కుటుంబం కొలంబోకు వలస వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ ఒక ప్రైవేట్ గర్ల్స్ స్కూల్‌లో ఆమె చేరారు. దాన్ని క్రిస్టియన్ నన్స్ నిర్వహించేవారు. తన జీవితం మీద వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉందనీ, తనలో ఫెమినిస్ట్ భావాలకు అక్కడే బీజం పడిందనీ ఆమె చెబుతారు. "శ్రీలంక ఘర్షణలకు, ముఖ్యంగా 1983లో చోటుచేసుకున్న జాతిపరమైన దాడులకు సంబంధించిన జ్ఞాపకాలు నాలో ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మా పొరుగున ఎన్నో తమిళ కుటుంబాలవారు ఉండేవారు. అప్పుడు నాకు పదమూడేళ్ళు. వారిలో కొందరు హఠాత్తుగా మాయమైపోయేవారు. నా తవిళ మిత్రుల్లో చాలామంది తరగతులకు రాకపోవడం, టీచర్లలో ఎంతోమంది ఉద్యోగం మానెయ్యడం లాంటి సంఘటనలు నాలో గందరగోళాన్నీ, భయాన్నీ కలిగించేవి. మేము స్కూల్‌కు వెళ్ళడానికి ముందు మా నాన్న వీధిలోకి వచ్చి... రోడ్ల మీద పరిస్థితుల్ని గమనించేవారు. అంతా సజావుగా ఉందనుకుంటేనే మమ్మల్ని బడికి పంపించేవారు. అయితే మేము మెజారిటీ వర్గానికి చెందినవాళ్ళం కావడం, దక్షిణ ప్రాంతంలో నివసించడం అనేవి ఆ పరిస్థితుల ప్రభావం మా మీద లేకపోవడానికి కారణమని ఆ తరువాత గ్రహించాను. ఏది ఏమైనా మన చుట్టూ ఇటువంటివి జరుగుతున్నప్పుడు... ప్రపంచం పట్ల, సంస్కృతి పట్ల మన దృక్పథాన్ని అవి ప్రభావితం చేస్తాయి" అంటారు హరిణి. ఆ స్కూల్లో చదువుతున్నప్పుడే... స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద ఆమె ఏడాది పాటు అమెరికా వెళ్ళారు. "అది 1988-89 మధ్యకాలం. శ్రీలంకలో అది అత్యంత హింసాత్మకమైన కాలం. దేశం ఉత్తర ప్రాంతంలో తీవ్రమైన యుద్ధం, దక్షిణ ప్రాంతంలో తిరుగుబాట్లు తలెత్తాయి. నేను అమెరికా నుంచి తిరిగి వచ్చేసరికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలు మూతపడ్డాయి. దాంతో... ఇండియాకు వచ్చి, ఢిల్లీ యూనివర్సిటీలోని హిందూ కాలేజీలో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరాను. ఆ నాలుగేళ్ళు చాలా ఆహ్లాదంగా గడిచాయి" అని చెబుతారామె.

అది నా కళ్ళు తెరిపించింది...

ఆ తరువాత ఆస్ట్రేలియాలో అప్లయిడ్ ఆంత్రోపాలజీలో మాస్టర్స్ చేశారు హరిణి. అనంతరం పిహెచ్‌డి కోసం స్కాట్లాండ్ వెళ్ళారు. ఆ సమయంలోనే పౌరహక్కులు, ఫెమినిజం గురించి అధ్యయనం చేశారు. రచనలు మొదలుపెట్టారు. స్వదేశానికి వచ్చిన తరువాత... శ్రీలంక ఓపెన్ యూనివర్సిటీలో సోషియాలజీ లెక్చరర్‌గా చేరారు. మరి ఎంతో ఇష్టమైన బోధనా వృత్తి నుంచి ఎన్నికల రాజకీయాల్లోకి అడుగు పెట్టాలనే నిర్ణయం ఆమె ఎందుకు తీసుకున్నారు? "నా జీవితం మీద గొప్ప ప్రభావం చూపిన వాటిలో ఒకటి... స్థానిక ఎన్జీవో ఆధ్వర్యంలోని ఒక కమ్యూనిటీ మెంటల్ హెల్త్ సెంటర్‌లో పని చెయ్యడం. నిజానికి నేను చేసిన మొదటి ఉద్యోగం అదే. అక్కడ వేధింపులకు, వివక్షకు, నిర్బంధానికి గురైన మహిళల దుస్థితి నన్ను బాగా కదిలించింది. ఆ ఉద్యోగంలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాను. అది ప్రపంచాన్ని నేను చూసే తీరును మార్చింది. మనం గమనించని ప్రదేశాల్లో ఏం జరుగుతోందనే సత్యాన్ని నా కళ్ళముందు నిలబెట్టింది. నా కళ్ళు తెరిపించింది. ఆసుపత్రుల వ్యవస్థ, కుటుంబాలు, ప్రభుత్వం దీనికి బాధ్యత వహించాలని మేం పోరాటం చేశాం. అలాగే యూనివర్సిటీలో ఉద్యోగానికి ఎంపికయినప్పుడు... ఇంకా జాబ్ ఆఫర్ లెటర్ తీసుకోకుండానే... ఉపాధ్యాయ సంఘంలో చేరాను. ఆ తరువాత... రాజ్ పక్స ప్రభుత్వం ప్రతిపక్షాల మీద ఉక్కుపాదం మోపినప్పుడు... అంతటా భయానకమైన వాతావరణం ఏర్పడింది. మేం మూడు నెలలపాటు సమ్మె చేశాం. శ్రీలంకలో హింస తారస్థాయిలో ఉన్న 1980-90ల మధ్య విద్యార్థి నాయకులుగా ఉన్నవారు ఈ సమ్మె కాలంలో సామాజిక, రాజకీయ కార్యకర్తలుగా మారారు. వాళ్ళు ఒక నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. నేను దానిలో భాగమయ్యాను. క్రమంగా... 'జనతా విముక్తి పెరమున' (జెవిపి) పార్టీతో సాన్నిహిత్యం ఏర్పడింది. విద్యారంగంలో మార్పుల పట్ల జెవిపికి ఉన్న అభిప్రాయాలు నాకు నచ్చాయి. పార్టీ విధాన రూపకల్పనలో కూడా పాల్గొన్నాను. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల హక్కుల గురించి నా గళాన్ని గట్టిగా వినిపించాను" అని వివరించారు హరిణి.

> "మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? స్త్రీ సహజమైన మాతృత్వాన్ని ఎందుకు వద్దనుకున్నారు? కుటుంబ వ్యవస్థ మీద మీ అభిప్రాయం ఏవిఎటి?"... ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఎదురయ్యాయి. అంతేకాదు నా రూపం మీద, జుట్టు మీద, దుస్తుల మీద కూడా ఎన్నో కామెంట్స్ వచ్చాయి.

నా రూపంమీద, జుట్టు మీద కామెంట్స్ చేశారు...

2019 శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో 'నేషనల్ పీపుల్స్ పవర్' కూటమిలో భాగమైన తమ పార్టీ అభ్యర్థి అనుర కుమార దిసనాయకే తరఫున ప్రచారం చేసిన ఆమె... 2020లో పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. మరోవైపు 'ప్రోగ్రెసివ్ ఉమెన్ కలెక్టివ్' ప్రతినిధిగా... నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి కృషి చేస్తున్నారు. "మహిళల పట్ల అణచివేత ఎన్నో రూపాల్లో సాగుతోంది. అదే సమయంలో... రాజకీయాలు అవినీతిమయం అయ్యాయనీ, కలుషితమయ్యాయనీ, కాబట్టి గౌరవనీయులైన మహిళలకు ఇవి పనికిరావనీ శ్రీలంకలోని చాలామంది మహిళల్లో ఒక అభిప్రాయం ఉన్నట్టు నేను గమనించాను. అంతేకాదు... ప్రజాజీవితంలో ఉన్న మహిళల్లో ఏవైనా లోపాలు కనిపిస్తాయేమోనని రంధ్రాన్వేషణ చేసేవారు కూడా ఎక్కువయ్యారు. "మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? స్త్రీ సహజమైన మాతృత్వాన్ని ఎందుకు వద్దనుకున్నారు? కుటుంబ వ్యవస్థ మీద మీ అభిప్రాయం ఏమిటి?"... ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఎదురయ్యాయి. అంతేకాదు నా రూపం మీద, జుట్టు మీద, దుస్తుల మీద కూడా ఎన్నో కామెంట్స్ వచ్చాయి. పార్లమెంట్ సభ్యురాలుగా చీర కాకుండా సల్వార్ ధరిస్తున్నందుకు కూడా నన్ను కొందరు విమర్శించారు" అని గుర్తు చేసుకున్నారు హరిణి. తాజాగా శ్రీలంక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె... విద్యారంగ సంస్కరణలు, బాలలకు, మహిళలకు రక్షణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, వివిధ వర్గాల హక్కుల పరిరక్షణ తన ధ్యేయాలని చెబుతున్నారు. "సిరిమావో బండారునాయకే, చంద్రికా కుమార తుంగ తరువాత... శ్రీలంక మూడో మహిళా ప్రధానిని కావడం గౌరవంగా భావిస్తున్నాను. కానీ అదే సమయంలో... మా పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం 5.33 శాతం మాత్రమే. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా ప్రాతినిధ్యాల్లో ఇదొకటి. ఈ పరిస్థితి మారడానికి, రాజకీయాల పట్ల మహిళలు ఆకర్షితులు కావడంతో పాటు... పార్టీలు వారికి మరిన్ని అవకాశాలు ఇచ్చే విధంగా మార్పు తేవడానికి కృషి చేస్తాను" అంటున్నారు హరిణి.



వరల్డ్ 6- రెడ్ స్నూకర్ చాంపియన్ కమల్



ఉలాన్‌బాటర్ (మంగోలియా): కమల్ చావ్లా ఐబీఎస్‌ఎఫ్ వరల్డ్ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షి‌ప్‌ను గెలుచుకున్నాడు. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల ఫైనల్లో 45 ఏళ్ల కమల్ 6-2తో పాకిస్థాన్ ఆటగాడు అస్జాద్ ఇక్బాల్‌ను ఓడించాడు.

శ్రీకాంత్, సిక్కిరెడ్డి జోడీ బోణీ

మకావు: కిడాంబి శ్రీకాంత్, సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జంట మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నీలో బోణీ కొట్టారు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-14, 21-15తో డానిల్ (ఇజ్రాయిల్)పై నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి-సుమిత్ జోడీ 24-22, 10-21, 21-13తో లూ బింగ్ కున్-హో లో యి (మలేసియా) ద్వయంపై నెగ్గింది.

రికీకి ఆంధ్ర పగ్గాలు

విశాఖపట్నం (స్పోర్ట్స్): రంజీ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్ర జట్టును బుధవారం ప్రకటించారు. ప్రధాన జట్టుకు 16 మంది సభ్యులతోపాటు స్టాండ్ బైగా మరో ఆరుగురిని ఆంధ్ర క్రికెట్ సంఘం ఎంపిక చేసింది. అక్టోబరు 11నుంచి జరిగే రంజీ టోర్నీలో ఆంధ్ర జట్టు తొలి మ్యాచ్‌లో విదర్భతో తలపడనుంది.

జట్టు సభ్యులు: రికీ బుయ్ (కెప్టెన్), ఎస్‌కే రషీద్ (వైస్ కెప్టెన్), కె.ఎస్.భరత్ (వికెట్ కీపర్), జీహెచ్ విహారి, నితీష్ కుమార్‌రెడ్డి, మహీప్‌కుమార్, వంశీకృష్ణ (వికెట్ కీపర్), అభిషేక్‌రెడ్డి, కేవీ శశికాంత్, అశ్విన్ హెబ్బర్, సీహెచ్ స్టీఫెన్, సత్యనారాయణరాజు, లలిత్ మోహన్, మనీష్, విజయ్, హేమంతరెడ్డి; స్టాండ్ బైలో శంభు అఖిల్, రఫీ, బ్రహ్మతేజ, సందీప్, ఆంజనేయులు, కె.కరణ్ షిండే ఉన్నారు.

టాప్-10లోకి పంత్

దుబాయ్: వికెట్‌కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ బుధవారం విడుదలైన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌తో మళ్లీ టాప్-10లోకి వచ్చాడు. పంత్ ఆరో ర్యాంక్‌కు ఎగబాకగా, జైస్వాల్ ఐదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. కాగా, రోహిత్ ఐదు స్థానాలు కోల్పోయి పదోర్యాంకులో, ఐదు స్థానాలు చేజార్చుకున్న కోహ్లీ 12వ ర్యాంక్‌లో నిలిచారు.. జో రూట్ టాప్‌లో ఉన్నాడు. బౌలర్లలో అశ్విన్ టాప్ ర్యాంక్, బుమ్రా రెండో స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

వినేశ్‌కు నాడా నోటీసులు

న్యూఢిల్లీ: రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) నోటీసులు జారీ చేసింది. ఈనెల 9న జరగాల్సిన డోప్ పరీక్షకు అందుబాటులో లేని వినేశ్ తన ఆచూకీ వివరాలను అందజేయడంలో విఫలమైనందున 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని 'నాడా' పేర్కొంది. అయితే, ఒలింపిక్స్ సమయంలో వినేశ్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చాంపియన్లతో మోదీ భేటీ



ప్రధాని సమక్షంలో గేమ్ ఆడిన అర్జున్, ప్రజ్ఞానంద

చెస్ ఒలింపియాడ్ విజేతలకు ప్రశంసలు

న్యూఢిల్లీ: చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు నెగ్గి చరిత్ర సృష్టించిన భారత పురుషులు, మహిళల జట్ల సభ్యులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. హంగేరీలో జరిగిన ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిచి స్వదేశం చేరుకున్న చెస్ క్రీడాకారులు.. బుధవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలుసుకున్నారు. జట్టు సభ్యులందరితో చాలాసేపు ముచ్చటించిన మోదీ.. ఒక్కొక్కరిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో స్వర్ణ పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేసినందుకు చాలా సంతోషంగా ఉందని మోదీ అన్నారు. అనంతరం ప్రధాని సమక్షంలో యువ ఆటగాళ్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద కాసేపు చెస్ ఆడారు. ఈ సందర్భంగా గేమ్‌లో ఆటగాళ్లు వేసిన ఎత్తులను చూసి మోదీ అచ్చెరువొందారు. ఆ తర్వాత క్రీడాకారులంతా కలిసి మోదీకి చెస్ బోర్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పురుషులు, మహిళల జట్ల సభ్యులు అర్జున్, ప్రజ్ఞానంద, గుకేష్, విదిత్ గుజరాతీ, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్, వంతికా అగర్వాల్, తానియా సచ్‌దేవ్ పాల్గొనగా..విజేత జట్టులోని సభ్యుడైన సీనియర్ ఆటగాడు పెంటేల హరికృష్ణ గైర్హాజరయ్యాడు.



విజేతలకు రూ. 3.2 కోట్ల నజరానా

చెస్ ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిచిన పురుషులు, మహిళల జట్లకు అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) నజరానా ప్రకటించింది. బుధవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులందరినీ ఏఐసీఎఫ్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జట్లకు మొత్తం రూ. 3.2 కోట్ల రివార్డును ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ ప్రకటించారు. విజేత జట్టులోని ప్రతి ప్లేయర్‌కు రూ. 25 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. పురుషులు, మహిళల జట్ల కెప్టెన్లు అభిజిత్ కుంతే, శ్రీనాథ్ నారాయణన్‌లకు రూ. 15 లక్షల చొప్పున.. చెస్ ఒలింపియాడ్‌లో భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన గ్రాండ్‌మాస్టర్ దివ్యేందు బారువాకు రూ. 10 లక్షలు ప్రకటించారు. సహాయక కోచ్‌లు రూ. 7.5 లక్షల చొప్పున అందుకోనున్నారు.

86 ఫోర్లు, 7 సిక్స్‌లు.. 498 పరుగులు

గుజరాత్ కుర్రాడి మారథాన్ ఇన్నింగ్స్



గాంధీనగర్: దివాన్ బల్లూభాయ్ కప్ అండర్-19 మల్టీ డే ఇంటర్ స్కూల్ టోర్నమెంట్‌లో గుజరాత్‌కు చెందిన 18 ఏళ్ల కుర్రాడు సంచలన ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఈ టోర్నీలో సెయింట్ జేవియర్స్ స్కూల్ జట్టు తరఫున ఆడిన ద్రోణ దేశాయ్ క్వాడ్రపుల్ సెంచరీ (498)తో విజృంభించడంతో ప్రత్యర్థి జేఎల్ ఇంగ్లీష్ స్కూల్ జట్టుపై జేవియర్స్ ఏకంగా ఇన్నింగ్స్, 712 పరుగుల తేడాతో గెలిచింది. జేవియర్స్ జట్టు 26 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన ద్రోణ.. తొలుత హెట్ దేశాయ్‌తో కలిసి 350, తర్వాత కెప్టెన్ విరాట్ తలపతితో కలిసి 188 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మ్యాచ్‌లో మొత్తం 320 బంతులు ఎదుర్కొన్న దేశాయ్.. 86 ఫోర్లు, 7 సిక్స్‌లతో కలిసి 498 పరుగులు బాదాడు. దేశాయ్ మారథాన్ ఇన్నింగ్స్‌తో జేవియర్స్ జట్టు 844 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో జేఎల్ టీమ్ 122 పరుగులకే కుప్పకూలింది. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగిన ద్రోణ.. స్కూల్ క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాళ్ల జాబితాలో నిలిచాడు. గతంలో ప్రణవ్ ధనవాడె (1009 నాటౌట్), పృథ్వీ షా (546), హవెవాలా (515), చమన్‌లాల్ (506 నాటౌట్), అర్మాన్ జాఫర్ (498) అత్యధిక స్కోర్లు సాధించారు.

ఆసీస్ జోరుకు ఇంగ్లండ్ బ్రేక్

● మూడో వన్డేలో గెలుపు

చెస్టర్ లీ స్ట్రీట్: ఆస్ట్రేలియా వరుస 14 వన్డేల విజయాలకు ఇంగ్లండ్ బ్రేకులు వేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (110 నాటౌట్) శతకంతో చెలరేగడంతో.. ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 46 (డ/లూ) పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో నిలిచింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 304/7 స్కోరు చేసింది. అలెక్స్ క్యారీ (77 నాటౌట్), స్మిత్ (60) హాఫ్ సెంచరీలు చేశారు. ఆర్చర్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో ఇంగ్లండ్ 37.4 ఓవర్లలో 254/4 స్కోరు చేసింది. విల్ జాక్స్ (84) రాణించాడు. అయితే, 38వ ఓవర్‌లో మొదలైన వర్షం కారణంగా మిగిలిన మ్యాచ్ సాగలేదు. దీంతో డక్‌వర్త్/లూయిస్ పద్ధతి ప్రకారం మెరుగైన రన్‌రేట్ ఉన్న ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు.

నాకు రెండు చేతులే ఉన్నాయ్!



కాన్పూర్ హోటల్‌లో కోహ్లీకి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. హోటల్ సిబ్బంది ఒకరు కరచాలనం కోసం ప్రయత్నించగా.. విరాట్ సున్నితంగా తిరస్కరించాడు. క్రికెటర్‌ను ఆహ్వానించిన అనంతరం అతడి చేతికి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చిన హోటల్ సిబ్బంది ఒకరు షేక్ హ్యాండ్ కోసం తన చేతిని ముందుకు చాచాడు. అయితే, మరో చేతిలో లగేజ్ ఉండడంతో విరాట్ 'నాకు రెండు చేతులే ఉన్నాయి' అంటూ ముందుకుసాగాడు.



ముంబైలో బుధవారం జరిగిన టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వేలంలో టెన్నిస్ స్టార్లు లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా, నటులు సొనాలీ బింద్రే, రకుల్‌ప్రీత్



గ్రీన్‌పార్క్ మారలేదు!



స్టేడియంలో అన్నీ సమస్యలే

భారత్-బంగ్లా రెండో టెస్ట్ వేదిక

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌కు వేదికైన గ్రీన్‌పార్క్ స్టేడియం సమస్యలమయంగా మారింది. మూడేళ్ల తర్వాత ఐదురోజుల మ్యాచ్‌కు ఆతిథ్యం దక్కించుకొన్నా.. సౌకర్యాలు మాత్రం తీసికట్టుగానే ఉన్నాయి. తాజాగా, ఈ మైదానంలోని శిథిలావస్థలో ఉన్న ఓ స్టాండ్ ప్రమాదకరంగా ఉందని స్థానిక ప్రజా పనుల శాఖ (పీడబ్ల్యూడీ) ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువ మంది ఎక్కితే బాల్కనీ 'సి' స్టాండ్ కూలిపోయే అవకాశాలున్నాయని నిపుణులు తేల్చారు. శుక్రవారమే మ్యాచ్ ఆరంభం కానుండడంతో మరమ్మతులు చేసేందుకు ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘం (యూపీసీఏ) వద్ద తగినంత సమయం కూడా లేదు. 'స్టాండ్ పిల్లర్లు చాలా బలహీనంగా ఉన్నాయి. 50 మంది గట్టిగా ఎగిరితే కూలిపోతుందేమోననిపిస్తోంద'ని స్టాండ్‌ను పరిశీలించిన ఓ ఇంజనీర్ అభిప్రాయపడ్డాడు. దీంతో ఎలాంటి రిస్క్ లేకుండా ఉండేందుకు ఈ స్టాండ్‌ను మూసివేయాలని అధికారులు సలహా ఇచ్చారు. ఇక్కడ ఫ్లడ్ లైట్ల సమస్య కూడా వెలుగు చూసింది. వీవీపీ పెవిలియన్ దగ్గర ఫ్లడ్ లైట్‌లో 8 బల్బులు పని చేయడం లేదని తెలిసింది. కాన్పూర్‌లో కాలుష్యం కారణంగా వెలుతురు సమస్య ఎదురయ్యే చాన్సుంది. మూడేళ్ల క్రితం న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ని వెలుతురు లేమి కారణంగా డ్రాగా ముగించాల్సిన పరిస్థితి. ఏళ్లు గడిచినా ఈ సమస్యను మాత్రం పరిష్కరించలేదట. పైగా నగరం మధ్యలో స్టేడియం ఉండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావచ్చని పోలీసులు చెబుతున్నారు. 1952లో గ్రీన్‌పార్క్ స్టేడియం ఆరంభమైంది. ఎన్నో అంతర్జాతీయ మ్యాచ్‌లకు వేదికగా నిలిచింది. అయితే, కొత్తగా ఏకానా స్టేడియం నిర్మించడంతో మైదానం ప్రాధాన్యత తగ్గింది.

ఇవిగో రికార్డులు


కాన్పూర్‌లోని గ్రీన్‌పార్క్ స్టేడియంలో భారత జట్టు ఇప్పటిదాకా 23 టెస్టులాడింది. 1952 జనవరిలో ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో తలపడిన టీమిండియా, చివరిసారిగా 2021 నవంబరులో న్యూజిలాండ్‌తో ఆడింది. ఇక ఇక్కడ జరిగిన 23 టెస్టుల్లో 7 విజయాలు సాధించిన భారత్..మూడింటిలో ఓటమిపాలైంది. 13 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ప్రస్తుత ప్రత్యర్థి బంగ్లాదేశ్‌తో ఈ వేదికపై భారత్ ఎప్పుడూ ఆడలేదు.

జితేష్‌కే చాన్స్?

అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఇషాన్ కిషన్ రీఎంట్రీ మరింత ఆలస్యం కానుందనే సంకేతాలు అందుతున్నాయి. బంగ్లాతో మూడు టీ20ల సిరీస్‌లో రెండో వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌కు బదులు జితేష్ శర్మకు అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. వచ్చే నెల 6న గ్వాలియర్‌లో తొలి టీ20 జరగనున్న నేపథ్యంలో ఈ వారాంతంలో జట్టును ఎంపిక చేయవచ్చని భావిస్తున్నారు. టెస్టుల్లో పంత్ అవసరం ఎక్కువగా ఉండడంతో.. ప్రధాన కీపర్‌గా సంజూ శాంసన్‌ను టీ20లకు ఎంపిక చేస్తే.. బ్యాకప్‌గా జితేష్‌కు చోటు లభించవచ్చు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పొట్టి సిరీస్‌లో గిల్, పంత్, బుమ్రాలకు విశ్రాంతి ఇస్తారనే అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లిన జట్టులో ఎక్కువ మంది టీ20 జట్టులో చోటు నిలబెట్టుకొనే చాన్సుంది.

నిఫ్టీ 26,000 పైకి..

85,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్.. కొనుగోళ్లతో ఆల్‌టైం రికార్డు గరిష్ఠాలకు సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు బుధవారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్, నిఫ్టీ రోజంతా పరిమిత శ్రేణిలో లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి అర గంటలో బ్యాంకింగ్, పవర్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో రివ్వున ఎగిశాయి. సెన్సెక్స్ తొలిసారిగా 85,000 ఎగువ స్థాయిలో ముగియగా.. నిఫ్టీ సైతం 26,000 మార్క్‌ను అధిగమించేసింది. సెన్సెక్స్ ఒక దశలో 333.38 పాయింట్ల వృద్ధితో 85,247.42 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి చివరికి 255.83 పాయింట్ల లాభంతో 85,169.87 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం 63.75 పాయింట్ల లాభంతో 26,004.15 వద్ద ముగిసింది. సూచీకిది సరికొత్త గరిష్ఠ ముగింపు. 26,032.80 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును కూడా నమోదు చేసింది. క్రితం సెషన్‌లోనే సూచీలు ఈ చారిత్రక మైలురాళ్లను చేరినప్పటికీ, మదుపరుల లాభాల స్వీకరణ కారణంగా మళ్లీ వెనక్కి వచ్చాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

వేదాంత 4వ డివిడెండ్

మైనింగ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ తన వాటాదారులకు మరోసారి డివిడెండ్ అందించనుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటికే మూడుసార్లు మధ్యంతర డివిడెండ్‌ను పంచింది. నాలుగోసారి డివిడెండ్‌పై వచ్చే నెల 8న బోర్డు సమావేశమై, ఆమోదం తెలపనుందని కంపెనీ వెల్లడించింది. వేదాంత గత మూడు విడతల్లో తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.35 డివిడెండ్ చొప్పున మొత్తం రూ.13,474 కోట్లు చెల్లించింది.

ఎన్‌ఎస్ఈ కో-లొకేషన్ సేవల విస్తరణ

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తన ట్రేడింగ్ సభ్యులకు ముంబై ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న కో-లొకేషన్ డేటా సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను వచ్చే మూడేళ్లలో దాదాపు మూడింతల స్థాయికి పెంచాలనుకుంటోంది. ప్రస్తుతం ఈ కేంద్రంలో ట్రేడింగ్ సభ్యుల కోసం 1,400 ర్యాక్‌లను ఏర్పాటు చేసిన ఎక్స్ఛేంజీ.. మూడేళ్లలో ఈ సంఖ్యను 4,000కు పెంచనుందని సమాచారం.

పసిడి రికార్డు పరుగు



రూ.77,850కి 10 గ్రాముల ధర.. ఒక్కరోజే రూ.900 అప్

- వెండి రూ.3,000 జంప్..
- రూ.93,000కు చేరిన కేజీ

న్యూఢిల్లీ: పసిడి ధర సరికొత్త జీవిత కాల రికార్డు స్థాయికి పెరిగింది. 10 గ్రాముల ధర రూ.78,000కు చేరువైంది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర బుధవారం మరో రూ.900 పెరిగి రూ.77,850కి చేరుకుంది. బంగారానికి ఇప్పటి వరకిదే గరిష్ఠ స్థాయి. వెండి సైతం భారీగా ఎగబాకింది. కిలో రూ.3,000 పెరుగుదలతో రూ.93,000 ధర పలికింది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయికి పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు ఒక దశలో 2,694.89 డాలర్లకు ఎగబాకింది. సిల్వర్ 32.15 డాలర్లకు పుంజుకుంది.

అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ గత వారం ప్రామాణిక వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించినప్పటి నుంచి బంగారం ధరలు వేగంగా పెరుగుతున్నాయి. వచ్చే సమీక్షలో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చని మార్కెట్లో ఊహాగానాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఇందుకు తోడు పశ్చిమాసియాలో యుద్ధవాతావరణం నెలకొనడం, తాజాగా చైనా సైతం వడ్డీ రేట్లను తగ్గించడం, ఆర్థిక వ్యవస్థకు దన్నుగా మరిన్ని ఉద్దీపనలు ప్రకటించడం పసిడి గిరాకీని మరింత పెంచవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇదే ట్రెండ్ కొనసాగితే, సమీప భవిష్యత్‌లో ఔన్స్ గోల్డ్ 3,200 డాలర్ల స్థాయికి ఎగబాకినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా అభిప్రాయపడ్డారు.

త్వరలో 3,200 డాలర్లకు ఔన్స్ బంగారం?

బిజినెస్

ఐఎస్‌బీ ఎంబీఏ కోర్సుకు అంతర్జాతీయ ర్యాంక్

న్యూఢిల్లీ: ప్రపంచంలోని టాప్ 100 ఎంబీఏ కోర్సుల్లో మూడు ఐఐఎంల నిర్వహణలోని కోర్సులు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నిర్వహణలోని ఎంబీఏ కోర్సు ఉన్నాయి. లండన్‌కు చెందిన ఉన్నత విద్య విశ్లేషణ సంస్థ క్వాక్‌క్వారెల్లి సైమండ్స్ (క్యూఎస్) ఈ ర్యాంకింగ్‌లు ప్రకటించింది. ఇక ఆ జాబితాలోని మూడు ఐఐఎంలలో బెంగళూరు, అహ్మదాబాద్, కలకత్తా ఐఐఎం ఉన్నాయి. ఉపాధికి అర్హమైన టాప్ 50 సంస్థల్లో మూడు బిజినెస్ స్కూళ్లున్నాయి. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్ వరుసగా ఐదో ఏడాదిలోనూ ప్రపంచ టాప్ 1 ర్యాంకింగ్‌లో నిలిచింది. 58 దేశాలకు చెందిన 340 ఉత్తమ ఎంబీఏ కోర్సులు ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో పరిశీలనకు వచ్చాయి. ఆయా విభాగాల్లో ఉత్తమ కోర్సులను విద్యార్థులు ఎంపిక చేసుకోవడానికి ఈ ర్యాంకింగ్స్ సహాయపడతాయి.

లింక్డ్‌ఇన్ టాప్ స్టార్టప్‌గా జెప్టో

న్యూఢిల్లీ: వృత్తి నిపుణులు పని చేయడానికి ఇష్టపడే లింక్డ్‌ఇన్ టాప్ స్టార్టప్‌ల జాబితాలో క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో అగ్రస్థానంలో నిలిచింది. ఈ జాబితాలో జెప్టో ప్రథమ స్థానంలో నిలవడం వరుసగా ఇది రెండో ఏడాది. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది లింక్డ్‌ఇన్ సభ్యుల అభిప్రాయాలు సేకరించి ఈ జాబితాను రూపొందించారు. ఉద్యోగంలో వృద్ధి, పనిలో లీనం కావడం, ఉద్యోగంపై ఆసక్తి, అత్యున్నత ప్రతిభావంతుల ఆకర్షణ అనే నాలుగు కొలమానాల్లో స్టార్టప్‌ల తీరును మదింపు చేస్తారు. స్ప్రింటో, లుసిడిటీ ఈ జాబితాలో జెప్టో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది జాబితాలోని 20 స్టార్టప్‌లలో 14 కొత్తగా ప్రవేశించినవే కావడం విశేషం.

బీఎంసీసీలో మరో 8.82% వాటా కొనుగోలు

కోరమాండల్ ఇంటర్నేషనల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెనెగల్‌కు చెందిన రాక్ ఫాస్ఫేట్ మైనింగ్ సంస్థ బావోబాబ్ మైనింగ్ అండ్ కెమికల్స్ కార్పొరేషన్ (బీఎంసీసీ)లో అదనంగా 8.82 శాతం వాటాను చేజిక్కించుకున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. ఈ కొనుగోలుతో బీఎంసీసీలో కోరమాండల్ వాటా 53.8 శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. కాగా బీఎంసీసీ విస్తరణ ప్రాజెక్టులతోపాటు మూలధన అవసరాల నిమిత్తం రూ.54 కోట్ల (65 లక్షల డాలర్లు) రుణాన్ని అందించటంతో పాటు సంస్థలో రూ.32 కోట్ల (38.4 లక్షల డాలర్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు కోరమాండల్ వెల్లడించింది. ఫాస్ఫాటిక్ ఎరువుల ఉత్పత్తిలో ఉపయోగించే ఫాస్ఫరిక్ యాసిడ్ తయారీకి కీలకమైన ముడి పదార్థం రాక్ ఫాస్ఫేట్ అని పేర్కొంది. కోరమాండల్‌కు చెందిన విశాఖపట్నం యూనిట్‌లో ప్రస్తుతం సెనెగల్ నుంచి తీసుకువచ్చిన రాక్ ఫాస్ఫేట్‌ను బ్లెండింగ్ చేస్తున్నట్లు తెలిపింది. అలాగే కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఫాస్ఫరిక్ యాసిడ్ ప్లాంట్‌కు అవసరమైన రాక్ ఫాస్ఫేట్‌ను బీఎంసీసీ నుంచి తీసుకోనున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 2011లో ఏర్పాటైన బీఎంసీసీలో కోరమాండల్ 45 శాతం వాటాను 2022 సెప్టెంబరులో చేజిక్కించుకుంది.

Coromandel FUTURE POSITIVE

హ్యుండయ్, స్విగ్గీ ఐపీఓలకు సెబీ ఆమోదం

HYUNDAI SWIGGY

- రూ.25,000 కోట్లు సమీకరించనున్న హ్యుండయ్
- స్విగ్గీ టార్గెట్ రూ.10,000 కోట్లు పైనే..

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ.. రెండు మెగా ఐపీఓ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అందులో ఒకటి రూ.25,000 కోట్ల హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ కాగా.. మరొకటి రూ.10,000 కోట్ల స్విగ్గీ పబ్లిక్ ఆఫరింగ్. దేశీయ చరిత్రలో హ్యుండయ్‌దే అతి పెద్ద ఐపీఓ కానుంది. ఇప్పటివరకైతే ఎల్ఐసీదే (రూ.21,000 కోట్లు) అతి పెద్ద ఇష్యూ. ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్లో ఐపీఓల సందడి నెలకొంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 60 కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలోని ప్రధాన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో తమ షేర్లను నమోదు చేశాయి. సెబీకి సమర్పించిన ప్రాథమిక ముసాయిదా పత్రాల (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. ఐపీఓలో భాగంగా హ్యుండయ్ మోటార్ ఇండియా తన మాతృ సంస్థ వాటాకు చెందిన 14,21,94,700 ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. తాజా ఈక్విటీని మాత్రం జారీ చేయడం లేదు. రెండు దశాబ్దాలకు పైగా కాలంలో తొలి కార్ల తయారీ కంపెనీ ఇష్యూ ఇదే కానుంది. చివరగా, 2003లో మారుతి సుజుకీ ఐపీఓకు వచ్చింది. కాగా, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఈ ఏప్రిల్ 30న సెబీకి ఐపీఓ దరఖాస్తు సమర్పించింది. అయితే, కంపెనీ కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ సదుపాయాన్ని ఉపయోగించుకుంది. దాంతో ఐపీఓ అధికారిక వివరాలు అందుబాటులో లేవు. కానీ, ఐపీఓ ద్వారా కంపెనీ రూ.5,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.5,000 కోట్లకు పైగా షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనున్నట్లు తెలిసింది. ఈ లెక్కన కంపెనీ మొత్తం రూ.10,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.

ఎలక్ట్రిక్ ఎల్‌సీవీ విభాగంలోకి యూలర్

రెండు మోడల్స్ విడుదల



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన తయారీదారు యూలర్ మోటార్స్.. తేలికపాటి వాణిజ్య వాహన (ఎల్‌సీవీ) విభాగంలోకి ప్రవేశించింది. వివిధ వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా నాలుగు టైర్లతో కూడిన రెండు ఎలక్ట్రిక్ ఎల్‌సీవీలను మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం కంపెనీ ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలను విక్రయిస్తోందని, తాజాగా ఇంటర్, ఇంట్రా సిటీ అవసరాల కోసం స్టార్మ్ పేరుతో ఈ వాహనాలను తీసుకువచ్చినట్లు యూలర్ మోటార్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ సౌరవ్ కుమార్ తెలిపారు. ఇంట్రా సిటీ కోసం స్టార్మ్ ఈవీ టీ1250 పేరుతో తీసుకువచ్చిన ఎల్‌సీవీ ధర రూ.8.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). 1,250 కేజీల పేలోడ్ సామర్థ్యంతో కూడిన ఈ వాహనం ఒకసారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. అలాగే ఇంటర్ సిటీ కోసం తీసుకువచ్చిన స్టార్మ్ ఈవీ లాంగ్ రేంజ్ 200 ధర రూ.12.99 (ఎక్స్‌షోరూమ్) అని ఆయన పేర్కొన్నారు. ఈ వాహనం 1,250 కేజీల పేలోడ్ సామర్థ్యంతో పాటు సింగిల్ చార్జింగ్‌తో 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ వాహనాలను తొలుత హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, ముంబై నగరాల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

స్పామ్ కాల్స్‌పై ఏఐ అస్త్రం: ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్, మెసేజ్‌లను గుర్తించి, వాటిపై తగు చర్య తీసుకునేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టెక్నాలజీని ఉపయోగించనున్నట్టు భారతి ఎయిర్‌టెల్ సీఈఓ గోపాల్ విఠల్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి నుంచి తమ ప్లాట్‌ఫామ్‌పై ఈ టెక్నాలజీని ప్రవేశపెడుతున్నట్టు ఆయన చెప్పారు. కేవలం 2 మిల్లీ సెకండ్లలోనే కాల్‌ను అనలైజ్ చేసి యూజర్లను తక్షణం హెచ్చరించే ఏఐ ఆధారిత సొల్యూషన్‌ను తాము ప్రవేశపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఎయిర్‌టెల్ స్మార్ట్‌ఫోన్ యూజర్లందరికీ దీన్ని ఉచితంగా అందిస్తున్నామని విఠల్ తెలిపారు. ఈ టెక్నాలజీ కాల్‌ను బ్లాక్ చేయదని, బ్లాక్ చేయడంపై నిర్ణయం తీసుకోవలసింది కస్టమరేనని విఠల్ స్పష్టం చేశారు.

ఈ ఏడాది 7% వృద్ధి

న్యూఢిల్లీ: మెరుగైన వ్యవసాయ ఉత్పాదకత, పెరిగిన ప్రభుత్వ పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేస్తాయని, ఈ కారణంగా ఈ ఏడాది వృద్ధి రేటు 7 శాతం యథాతథంగా ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) ప్రకటించింది. సేవల రంగం మద్దతుతో ఈ ఏడాది ఎగుమతులు కూడా గత ఏడాది కన్నా అధికంగానే ఉంటాయని అంచనా వేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,020 ▲	70,060 ▲	1,01,000 ▲
ముంబై	75,248 ▲	68,927 ▲	90,730 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	543	విశాఖపట్నం	555

డజను గుడ్లు రూ. 78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	124
కర్నూలు	125	నెల్లూరు	124
విశాఖపట్నం	107	అనంతపురం	124
గోదావరి	121		



లడ్డూ కల్తీ కుట్రను ఛేదించండి

(మొదటి పేజీ తరువాయి)

ఏ కోణంలో చేయ్యాలన్న దానిపై సమీక్షించారు. దర్యాప్తు చేయాల్సిన తీరు.. ఇప్పటి వరకూ వచ్చిన ఆరోపణలు.. ల్యాబ్ నుంచి వచ్చిన నివేదిక.. నిపుణులు ఇస్తోన్న సూచనలు.. పోటు తయారీలో పనిచేసే శ్రీవైష్ణవులు గతంలో నెయ్యి నాణ్యతపై వ్యక్తం చేసిన అభ్యంతరాలు.. తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. డీజీపీ సమక్షంలో సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు తమ తమ అభిప్రాయాలు, సందేహాలు వ్యక్తం చేశారు. ప్రపంచంలోని హిందువులందరినీ ఆవేదనకు గురి చేసిన ఈ అంశంలో అన్ని కోణాల్లోనూ సైంటిఫిక్‌గా ముందుకు వెళ్లాలని డీజీపీ నిర్దేశించారు. "లడ్డూ కల్తీలో దురుద్దేశం ఉందా.? లేదా ఇది కమీషన్ల కక్కుర్తి మాత్రమేనా.? ఇచ్చి ఉంటే ఎవరెవరికి ఎంతిచ్చారు...పుచ్చుకున్న వ్యక్తులెవరు..? ఈ అపచారంలో టీటీడీలో ఎవరి పాత్ర ఏమిటి.? అప్పట్లో అభ్యంతరం చెప్పిన శ్రీవైష్ణవుల్ని బెదిరించింది ఎవరు.? రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడం వెనుక అసలు కారణం ఏవిటి? టీటీడీకి నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం ఏఆర్ డెయిరీకి ఉందా? అక్కడ తయారీ విధానం ఎలా ఉంది? కర్ణాటకకు చెందిన నందినీ నెయ్యిని తిరస్కరించడానికి ప్రధాన కారణం ఏమిటి? తదితర అంశాలపై పకడ్బందీగా దర్యాప్తు చేయండి" అని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని, ఎక్కడా చిన్న పొరపాటుకూ తావివ్వకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. ఎక్కువ కాలం టీటీడీలో చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన గోపీనాథ్ జెట్టికి తిరుపతి ఎస్పీగానూ పనిచేసిన అనుభవం ఉండటంతో కీలక అంశాలపై దృష్టి సారించాలని డీజీపీ సూచించినట్లు తెలిసింది. పేరు మోసిన ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి విదేశాలకు పారిపోయిన వ్యవహారంలో అప్పట్లో సీఐడీ ఏడీజీ హోదాలో తిరుమల రావు, తిరుపతి ఎస్పీగా గోపీనాథ్ జెట్టి కలిసి పనిచేశారు. ఆ దేశంలోని న్యాయపరమైన చిక్కులు అధిగమించి, అన్ని ప్రయాసలకు వారు ఓర్చి గంగిరెడ్డిని మన దేశానికి తీసుకొచ్చి జైలుకు పంపారు. అప్పటి అనుభవాలను గుర్తు చేసుకున్న పోలీసు బాస్.... 'గోపీ నీపై బాధ్యత ఎక్కువగా ఉంది.. ఇది దేవుడితో, కోట్లాది మంది భక్తులతో ముడిపడిన భావోద్వేగ అంశం.. పోలీసు శాఖకు ప్రతిష్ఠ' అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

కొన్ని ట్యాంకర్లు అంగీకరించినట్లు

జగనే చెప్పారు

అలాంటప్పుడు కల్తీ నెయ్యి వాడినట్లే కదా!

- తిరుమల లడ్డూ వ్యవహారంలో..
- జగన్‌పై మంత్రి పయ్యావుల కేశవ్ ఫైర్



అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారాన్ని మాజీ సీఎం జగన్ ఒక పొలిటికల్ ఈవెంట్‌గా మార్చడం బాధాకరమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'జూన్, జూలై నెలల్లో కొన్ని నెయ్యి ట్యాంకర్లు తిరస్కరించారు.. కొన్ని అంగీకరించారని జగనే చెప్పారు. అంగీకరించారంటే కల్తీ నెయ్యి వాడినట్లే కదా! మీరు ప్రాసెస్‌లో పెట్టింది అదే కంపెనీ కదా' అని నిలదీశారు. అన్ని దేవాలయాల్లో 28వ తేదీన పూజలు చేయాలని జగన్ పిలుపివ్వడాన్ని ఎద్దేవాచేశారు. 'చిత్తశుద్ధి లేని శివపూజలేల? నెయ్యి ఎలుకలు తిన్న పిల్లి కాశీ యాత్రకు పోయినట్లుగా జగన్ వ్యవహారం ఉంది' అని ఆక్షేపించారు. ఈ పూజల కార్యక్రమాన్ని పొలిటికల్ ఈవెంట్‌గా మార్చారని దుయ్యబట్టారు. 'జగన్ దేవుడిని నమ్మకపోవచ్చు.. జగన్‌కు దేవుడి మీద నమ్మకం లేకపోవచ్చు.. కానీ ఆ దేవుడిని నమ్మే కోట్లాది మందిమి ఉన్నాం. ఆయన చేసిన పాపాలు చాలు. భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు' అని హితవు పలికారు. 'జగన్ అబద్ధం, జగన్ చేసే పూజలు అబద్ధం. కల్తీ నెయ్యి అనేది నిజం.. జగన్ 28వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాలన్నిటిలోను వైసీపీ నేతలు పూజలు చేయాలని పిలుపిచ్చినట్లు.. అదే రోజు ఆయనా తిరుమల వెళ్తున్నట్లు తెలిసింది. ఆయన అక్కడకు వెళ్లినప్పుడు లడ్డూ ప్రసాదాన్ని చేతిలోకి తీసుకుని వాసన చూడాలి. రోడ్డు మీద వెళ్లే ఏ భక్తుడినైనా.. గత సంవత్సరంలో మీరు లడ్డూ తిన్నారా.. ఇప్పుడు తిన్నారా అని తేడా అడగండి. ఇంతకు మించిన టెస్ట్ ఏముంటుంది' అని అన్నారు. 'వైసీపీ హయాంలోని ఓ బోర్డు మెంబరు నెయ్యి వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేసినట్లుగా చెబుతున్నారు. ఇంత తక్కువ ధరకు స్వచ్ఛమైన నెయ్యి ఎలా వస్తుందని ఉత్తర భారతానికి చెందిన ఆ సభ్యుడు అడిగితే.. నాటీ ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్ బుల్డోజ్ చేశారు. ఫలానా సభ్యుడు అడిగితే నోరు మూయించానని ధర్మారెడ్డి చెప్పలేదు కదా.. అందుకే బయటకు రావడం లేదు' అని కేశవ్ దుయ్యబట్టారు.

జగన్ డిక్లరేషన్ ఇచ్చి తిరుమల వెళ్లాలి: పురందేశ్వరి

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి డిక్లరేషన్ సమర్పించిన తరువాతే తిరుమల వెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఎక్స్‌లో డిమాండ్ చేశారు. 'ఈనెల 28న తిరుమల వెళ్లాలని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో దశాబ్దాలుగా 'విశ్వాసాన్ని' ప్రకటించే ఆచారం కొనసాగుతోంది. ఏపీ ఎండోమెంట్స్ -1, రూల్ నంబరు 16, జీఓఎంఎస్ నంబరు 311 ప్రకారం, హిందూ మతానికి చెందని వారు దర్శనం ముందు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద డిక్లరేషన్ ఇవ్వాలి. ఇది టీటీడీ సాధారణ నిబంధనలు, రూల్ 136 ప్రకారం కూడా తప్పనిసరి. అన్య మతస్థుడయిన జగన్ తిరుమల ఎక్కడం ప్రారంభించే ముందు, అలిపిరి గరుడ విగ్రహం వద్దనే డిక్లరేషన్ ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది' అని పేర్కొన్నారు.

పోటీ పూజలు!

ఎల్లుండి రాష్ట్ర ఆలయాలన్నిటిలో పూజలకు జగన్ పిలుపు

- అదే రోజు తిరుమలలో
- శ్రీవారిని దర్శించుకోనున్న మాజీ సీఎం



అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను, వేంకటేశ్వరస్వామి వారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించి చేసిన పాపాన్ని ప్రక్షాళన చేద్దామని వైసీపీ శ్రేణులకు మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపిచ్చారు. 28వ తేదీ శనివారం రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేసి పాప ప్రక్షాళన చేద్దామని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయన కూడా ఆ రోజు ఉదయం తిరుమలేశుడిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం 27వ తేదీ రాత్రే తిరుమల చేరుకోనున్నారు. చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్ధాలాడి.. ప్రసాదానికి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కల్తీ జరగకున్నా జరిగినట్లుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా అసత్య ప్రచారం చేశారని జగన్ ఆరోపించారు. మరోవైపు.. ఆయన బుధవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

శింగరకొండలో 'వైవీ' పూజలు

- 'లడ్డూ' పరిహారం కోసమే?

అద్దంకి, సెప్టెంబరు 25: టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కేంద్రంగా తిరుమలలో వివాదాలు, విచారణలు జరుగుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా అద్దంకి మండలం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. వైవీ సుబ్బారెడ్డి, కుటుంబసభ్యుల పేర్లతో ఆలయంలో మన్యుసూక్త హోమానికి రూ.3 వేలు, మన్యుసూక్త పారాయణానికి రూ.1100 చెల్లించారు. అయితే హోమం ఉదయమే జరగగా టికెట్ రుసుము చెల్లించిన సమయం మధ్యాహ్నం 12గంటలకు ఉండడం విమర్శలకు తావిస్తోంది. ఇబ్బందులు, కష్టాల్లో ఉన్న కుటుంబాలు, మంచి జరగాలనుకునే వారు తగు రుసుము చెల్లించి మన్యుసూక్త పారాయణం, హోమం నిర్వహిస్తుంటారు. కొంత మంది నేరుగా పాల్గొనకుండా రుసుము చెల్లిస్తే ఆయా కుటుంబసభ్యుల గోత్ర నామాలు, పేర్లతో అర్చకులు పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే వైవీ కుటుంబ సభ్యులు పూజలు చేయించడం గమనార్హం. పూజలకు రుసుము చెల్లించడంతో వైవీ కుటుంబ సభ్యుల పేర్లతో మన్యుసూక్త పారాయణం, హోమం చేసినట్లు దేవాలయ సిబ్బంది తెలిపారు.

ఏఆర్ ఫుడ్స్‌పై క్రిమినల్ కేసు

- టీటీడీ ఫిర్యాదుతో తిరుపతిలో నమోదు
- నేరపూరిత కుట్ర, మోసం, కల్తీ సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు..
- కోట్లాది భక్తులను మోసగించిన 'ఏఆర్'
- ఈ వ్యవహారంలో లబ్ధి పొందినవారెవరో తేల్చండి
- ఫిర్యాదులో కోరిన టీటీడీ జీఎం మురళీకృష్ణ

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వు కలిపిన నెయ్యిని లడ్డూ ప్రసాదం తయారీకోసం తిరుమలకు సరఫరా చేసిన వ్యవహారంలో తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై క్రిమినల్ కేసు నమోదైంది. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ పి.మురళీకృష్ణ బుధవారం ఈ సంస్థపై తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా ఏఆర్ డెయిరీ సంస్థపై నేరపూరిత కుట్ర, మోసం, కల్తీ సహా పలు ఇతర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యి నాసిరకంగా ఉందని, అందులో జంతువుల కొవ్వు ఆనవాళ్లు కూడా ఉన్నట్టు గుజరాత్‌కు చెందిన ఎన్‌డీడీబీ అనుబంధ లాబొరేటరీ పరీక్షల్లో వెల్లడైన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ మేరకు ఈ సంస్థపై టీటీడీ చర్యలకు ఉపక్రమించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తుల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో ఆవు నెయ్యి సేకరణ విధానం, నాణ్యత అంశాలను లోతుగా సమీక్షించామని తన ఫిర్యాదులో టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ పి.మురళీకృష్ణ తెలిపారు. అనేక అంశాలు లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గడానికి కారణాలుగా గుర్తించినట్లు చెప్పారు. ముఖ్యంగా నెయ్యి సరఫరాదారులు నాసిరకం నెయ్యి సరఫరా చేస్తున్నారని, అందువల్లే సువాసన, రుచి లేకుండాపోయిందని, సరఫరా అవుతున్న నెయ్యి కల్తీ నెయ్యి కావచ్చునని టీటీడీ భావించిందని తెలిపారు. ఈ క్రమంలో నెయ్యి నాణ్యత పెంచాలని సరఫరాదారులకు నోటీసులిచ్చామన్నారు. నెయ్యి నిల్వలను టీటీడీ వెలుపలి ల్యాబ్‌లలో టెస్టు చేయించి కల్తీ అని తేలితే బ్లాక్ లిస్టులో పెట్టి, జరిమానాలను కూడా విధిస్తామని ఆ నోటీసుల్లో హెచ్చరించామని చెప్పారు. టీటీడీ హెచ్చరికలతో మిగిలిన అన్ని సంస్థలూ నెయ్యి నాణ్యతను మెరుగుపరుచుకోగా, ఏఆర్ డెయిరీ మాత్రం తన పద్ధతిని మార్చుకోలేదన్నారు.

ఆయన ఫిర్యాదులోని ప్రధాన అంశాలు ఇవీ..

"ఈ ఏడాది మార్చి 12న 10 లక్షల కిలోల నెయ్యి సేకరణకు ఇ-టెండరు ఆహ్వానించాం. తిరుమలకు 1500 కిలోమీటర్ల పరిధిలోని ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సహా పలు సంస్థలను ఇందుకోసం ఆహ్వానించాం. ఈ ఏడాది మే నెల 8వ తేదీన టెండరు ఖరారు చేసి, అదే నెల 15న ఏఆర్ ఫుడ్స్‌కు సప్లై ఆర్డర్ ఇచ్చాం. ఈ సంస్థ ఈ ఏడాది జూన్ 12, 20, 25 తేదీల్లోనూ, జూలై 4వ తేదీన...ఇలా మొత్తం నాలుగు రోజుల్లో రోజుకు ఒక ట్యాంకర్ చొప్పున నాలుగు ట్యాంకర్ల నెయ్యి సరఫరా చేసింది. మునుపటిలాగే తిరుమలలోని ల్యాబ్‌లో టెస్టింగ్ తర్వాత వాటిని ప్రసాదాల తయారీకి తీసుకున్నాం. అయితే, తిరుమలలోని ల్యాబ్‌లో కల్తీని నిర్ధారించే టెస్టు లేదు"

తొలి టెస్టులోనే బయటపడిన కల్తీ

"నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో భాగంగా నెయ్యిలో కల్తీని నిర్ధారించడానికి టీటీడీకి వెలుపలి ల్యాబ్‌ల సేవలు వినియోగించుకోవాలని అనుకున్నాం. గుజరాత్‌లోని ఎన్‌డీడీబీకి చెందిన సీఏఎల్ఎఫ్ ల్యాబ్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నాం. నెయ్యి కల్తీ జరిగిందా లేదా అని నిర్ధారించుకోవడానికి ఇలాంటి విధానం అనుసరించడం టీటీడీ చరిత్రలోనే ఇది మొదటిసారి. ఇందులోభాగంగా ఈ ఏడాది జూలై 6న ఏఆర్ ఫుడ్స్ నుంచి వచ్చిన రెండు ట్యాంకర్లు, 12 తేదీన వచ్చిన రెండు ట్యాంకర్ల నుంచి ఆయా తేదీల్లో శాంపిల్స్ సేకరించి వాటిని నాణ్యతా పరీక్షల కోసంల్యాబ్‌కు పంపించాం. టెస్టు రిపోర్టులు జూలై 16, 23 తేదీల్లో టీటీడీకి అందాయి. వాటి ఆధారంగా ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థ సరఫరా చేసిన నెయ్యి తీవ్రస్థాయిలో కల్తీకి గురైనట్టు గుర్తించాం. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా అన్ని శాంపిల్స్‌లోని నెయ్యి వెజిటబుల్ ఆయిల్స్, జంతువుల కొవ్వులతో కల్తీ అయినట్లు నిర్ధారణ అయింది"

భక్తుల ఆరోగ్యం, మనోభావాలకు దెబ్బ

"ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థకు ఈ ఏడాది జూలై 22, 23, 27 తేదీల్లో షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు ఆగస్టు 28న రిజాయిండర్ నోటీసు కూడా జారీ చేశాం. దీనిపై ఆ సంస్థ జూలై 28, సెప్టెంబరు 4 తేదీల్లో టీటీడీ నోటీసులకు సమాధానాలిచ్చింది. తన తప్పును ఆ సంస్థ ఒప్పుకోలేదు. శ్రీవారి లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి నాణ్యత నేరుగా కోట్లాదిమంది భక్తుల ఆరోగ్యాన్ని, మతపరమైన మనోభావాలను ప్రభావితం చేస్తుంది. కానీ, టీటీడీతో చేసుకున్న అగ్రిమెంట్ నిబంధనలను ఉల్లంఘించి...కల్తీ నెయ్యిని ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసింది. ఆహార కల్తీ నిరోధక చట్టం కింద కూడా నేరానికి పాల్పడింది. ఇది నేరపూరిత కుట్ర మినహా మరొకటి కాదు. దీనివల్ల లబ్ధి పొందిన వారెవరన్నది దర్యాప్తులో గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి" అని తన ఫిర్యాదులో జీఎం మురళీకృష్ణ కోరారు. ఈ కేసును పోలీసులు.. సిట్‌కు బదిలీ చేయనున్నట్టు తెలిసింది.

లడ్డూపై బిహార్‌లో కేసు

పూర్వ టీటీడీ పెద్దలపై కోర్టుకు ఫిర్యాదు

ముజఫర్‌పూర్, సెప్టెంబరు 25 : తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్రం దాటి దేశమంతటా తీవ్ర కలవరం రేపుతోంది. ఈ నేపథ్యంలో బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా కోర్టులో కేసు నమోదైంది. హిందూ భక్తుల మనోభావాలను ఘోరంగా దెబ్బతీసిన టీటీడీ పూర్వ పాలకమండలిపై చర్య తీసుకోవాలంటూ సుధీర్ కుమార్ ఓజా అనే న్యాయవాది ఆ జిల్లా న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు.

రథం కాల్చివేత.. వైసీపీ నేత అరెస్ట్

- 'అనంత'లో ఆలయంలో నిప్పు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: అనంతపురం జిల్లా కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో రామాలయం రథానికి నిప్పంటించిన ఘటనలో వైసీపీ నాయకుడు బొడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జగదీష్ అరెస్ట్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. హనకనహాళ్ గ్రామంలో శ్రీరాములోరి రథాన్ని 2022లో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి అన్నదమ్ములు రూ.20 లక్షలు వెచ్చించి తయారు చేయించారు. రథం తయారీకి వారు గ్రామంలో ఎవరి వద్ద సహాయ సహకారాలు, చందాలు తీసుకోలేదు. ఈ నెల 23న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రథాన్ని భద్రపరిచిన మండపం తాళాలు పగులగొట్టి అందులో ప్రవేశించారు. అనంతరం రథానికి నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో రథం ముందు భాగం కాలిపోయింది. రథం తయారీలో తమ సహకారం తీసుకోలేదనే అక్కసుతోనే గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఈ ఘటనకు పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు.

పొన్నవోలుకు బుద్ధి ఉందా?: సత్యకుమార్

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది వెంకన్న భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన వైసీపీ ప్రభుత్వం చేసింది అపచారం కాదు నేరం అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, టీటీడీ ఛైర్మన్, ఈవో తప్ప టీటీడీ మిగతా సభ్యులందరూ డమ్మీలేనని చెప్పారు. ఈ ముగ్గురు నిర్ణయాలు తీసుకుని బోర్డు మీటింగ్‌లో ఆమోదింపచేసుకున్నారని తెలిపారు. లడ్డూ నాణ్యతపై వైసీపీ నేతలు రాజీ పడ్డారని, దారుణమైన తప్పును బీజేపీపైకి నెట్టడం సరికాదన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ టమోటాకు, పొటాటోకు తేడా తెలియకుండా జగన్ వాగితే.. మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సిగ్గు లేకుండా వాగుతున్నాడని మండిపడ్డారు. ఆయనకు అసలు బుద్ధి ఉందా అని ప్రశ్నించారు.



బీజేపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి సత్యకుమార్

దీని మతలబేమి గోవిందా?

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు ట్యాంకర్లలో ఒకటి నెల్లూరు చెందిన వైష్ణవి డెయిరీ పేరిట ఉన్న ట్యాంకర్ (ఏపీ26టీసీ4779) కావడం కథను కీలక మలుపు తిప్పే అంశంగా మారింది.

అంత దూరం ఒక్క రోజులోనా?

ఏఆర్ డెయిరీ పంపిన 8 ట్యాంకుల నెయ్యిలో టీఎన్02బీఏ9459 నంబరు గల ట్యాంకర్‌తో మొత్తం 3 ట్రిప్పుల నెయ్యి తిరుమలకు వచ్చింది. తమిళనాడు రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఈ ట్యాంకర్ ద్వారా 48 గంటల వ్యవధిలో రెండు ట్రిప్పులు వేయడం ఇక్కడ మరో కీలకాంశంగా మారింది. జూలై 4న ఆ ట్యాంకర్ ద్వారా వచ్చిన నెయ్యి పరీక్షలు పాస్ అయి తిరుమలలో వాడకానికి అన్‌లోడ్ అయింది. అదే టీఎన్02బీఏ9459 నంబరు గల ట్యాంకర్ మళ్లా జూలై 6వ తేదీన మరోసారి నెయ్యితో తిరుమలకు వచ్చేసింది? 4వ తేదీన వచ్చిన బండి ఆ సరుకు అన్‌లోడ్ చేసి ఎప్పుడు దుండిగల్ వెళ్లింది? 6వ తేదీకల్లా ఫుల్ లోడ్‌తో మళ్లా ఎలా రాగలిగింది? 4వ తేదీన వచ్చిన బండిలోని నెయ్యికి పరీక్షలు, అన్‌లోడింగ్ అంతా ఒక్క రోజులోనే అయిపోయిందనుకున్నా.. ఆ మర్నాడు 500 కి.మీ. దూరంలోని దుండిగల్‌కు వెళ్లి 6వ తేదీకల్లా తిరుమలకు వచ్చేయడం అసాధ్యం కదా! ఎందుకంటే ఖాళీ బండి వెళ్లడానికే దాదాపు 10 గంటలు పడుతుంది. అక్కడికెళ్లాక క్లీనింగ్, లోడింగ్‌కు మళ్లా చాలా సమయం కావాలి. ఇక నెయ్యి లోడు తెచ్చే వాహనం మిగతా వాటిలాగా వేగంగా రావడానికి కుదరదు. కనీసం 12 నుంచి 16 గంటల సమయం పడుతుంది. కానీ 4న వచ్చిన బండి ఎప్పుడు దుండిగల్‌కు వెనక్కి వెళ్లిందో.. మళ్లా 6వ తేదీకల్లా తిరిగి వెనక్కి ఎలా వచ్చేసిందో ఆ దేవుడికే తెలియాలి. మధ్యలో ఏం జరిగిందో పక్కనపెడితే.. ఆ బండి వెళ్లడం, మళ్లీ లోడుతో రావడం మాత్రం వాస్తవం.

మధ్యలో ఏం జరిగింది?

4న వచ్చిన ట్యాంకర్ అన్‌లోడింగ్ తర్వాత కచ్చితంగా దుండిగల్‌కు వెళ్లి ఉండే అవకాశమైతే కనిపించడం లేదు. ఎందుకంటే 6కల్లా మళ్లా లోడ్‌తో వచ్చేసింది. అంటే ఆ లోడు దగ్గర్లోనే ఎక్కడి నుంచో వచ్చిందని తేలిపోతోంది. పైగా 6వ తేదీన ఏఆర్ డెయిరీ పేరిట మొత్తం రెండు ట్యాంకర్లు వచ్చాయి. అందులో ఒకటి ఈ తమిళనాడు రిజిస్ట్రేషన్ బండి కాగా, రెండోది వైష్ణవి డెయిరీ పేరిట ఉన్న 4779 నంబరు ట్యాంకర్. ఆశ్చర్యకరంగా ఈ రెండు ట్యాంకర్లలోని నెయ్యిలోనూ కల్తీ జరిగినట్లు తేలింది. అంటే ఈ 2 ట్యాంకర్లూ తిరుమలకు కేవలం 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న వైష్ణవి డెయిరీ నుంచే వచ్చాయనుకోవాలా? కల్తీ నెయ్యి తెచ్చిన రెండింటిలో ఒక ట్యాంకర్ వైష్ణవి డెయిరీ పేరిట రిజిస్టరైనది కాగా, రెండో ట్యాం కర్ దుండిగల్ వెళ్లి వచ్చేందుకు తగినంత సమయం లేకపోవడం ఈ సందేహానికి కచ్చితంగా తావిస్తోంది.

కాంట్రాక్ట్ ఎవరిది? సరఫరా చేసిందెవరు?

నెయ్యి సరఫరా బాధ్యతను ఏఆర్ డెయిరీ సబ్ కాంట్రాక్ట్ కింద వైష్ణవి డెయిరీకి అప్పగించిందా? అన్నది మరో కీలక సందేహం. ఈ సంస్థకు నెయ్యి సరఫరా బాధ్యత అప్పగిస్తే ఏఆర్ డెయిరీకి రవాణా ఖర్చు కలిసొస్తుంది. ఎప్పుడంటే అప్పుడు ఇక్కడి నుంచి ట్యాంకర్లను తక్కువ సమయంలో పంపించవచ్చు. టీటీడీకి అవసరం ఉన్న మేరకు నెయ్యిని సరఫరా చేసే సామర్థ్యం ఏఆర్ డెయిరీకి పూర్తిస్థాయిలో లేకపోవడం ఈ సందేహాలను బలపరుస్తోంది. మరోవైపు టీటీడీకి తగిన నెయ్యిని అందించే సామర్థ్యం వైష్ణవి డెయిరీకి కూడా లేదు. ఈ నేపథ్యంలో ఈ రెండు డెయిరీలూ పరస్పర అంతర్గత ఒప్పందంతో వ్యాపారం నిర్వహించి ఉంటాయా అన్నది మరో సందేహం.

బటర్ ఆయిల్ వెనుక కథేంటి?

శ్రీవారి లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో పందితో సహా పలు జంతువుల కొవ్వు కల్తీ అయినట్లు పరీక్షల్లో తేలింది. తక్కువ రేటుకు దొరికే కొవ్వు నుంచి తీసిన ఆయిల్‌ను కలిపి ఉంటారన్నది నిపుణుల మాట. దీని కోసం బటర్ ఆయిల్‌ను కొని కలిపి ఉంటారని భావిస్తున్నారు. బటర్ ఆయిల్‌ను ప్రాసెస్ చేసి దాని ద్వారా నెయ్యిని తయారు చేసి టీటీడీకి సరఫరా చేసి ఉంటారని అధికారవర్గాలు అనుమానిస్తున్నాయి. డెన్మార్క్, పశ్చిమాసియా దేశాల్లో బటర్ ఆయిల్ చాలా కారుచౌకగా లభిస్తుంది. అక్కడి నుంచి బటర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకొని ఇక్కడ ప్రాసెస్ చేసి నెయ్యిగా మార్చి ఉంటారని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. సహజంగా మార్కెట్‌లో లభించే పలు రకాల నెయ్యిలను పరీక్షించగా అందులో బటర్ ఆయిల్ ఉన్నట్లు తేలింది. పెద్దసంఖ్యలో నెయ్యి సరఫరా చేయాలనుకున్నప్పుడు డిమాండ్‌ను తట్టుకునేందుకు ఇలా బటర్ ఆయిల్‌తో కల్తీ చేసి ఉంటారన్నది ఆ వర్గాల సందేహం. అయితే ఇక్కడే సరికొత్త సందేహాలు తెరపైకి వస్తున్నాయి. బటర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకునేందుకు అవసరమైన ఇంపోర్ట్ లైసెన్స్ ఆల్ఫా డెయిరీకి ఒక్కదానికే ఉందని, శ్రీవారికి నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ పొందిన ఇతర డెయిరీలకు లేదని డెయిరీ వర్గాలు చెబుతుండటం కీలకాంశంగా మారింది. అంటే ఆల్ఫా ఆ బటర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకొని ఏఆర్ డెయిరీకి అమ్మిందనుకోవాలా? లేదా ఆల్ఫాతో మిగతా డెయిరీలు ఒక సిండికేట్‌గా ఏర్పడి కథ నడిపించాయనుకోవాలా?

ఈ ప్రశ్నలకు బదులేది?

- రెండు మూడు డెయిరీలు ముందే సిండికేట్ అయ్యి నెయ్యి కాంట్రాక్టు పొందాయా?
- ఆనాటి ప్రభుత్వ పెద్దలు, టీటీడీ పెద్దలకు ఈ విషయం ముందే తెలుసా?
- అతి తక్కువ ధరకు సరఫరా చేస్తామన్నా అంగీకరించడం వెనుక అసలేం జరిగింది?
- రివర్స్ టెండరింగ్ పేరిట అప్పటి దాకా ఉన్న నందిని తప్పించి, కొత్తవాటిని తేవడంలో ముడుపులు చేతులు మారాయా?
- లడ్డూల నాణ్యత తగ్గిపోయిందని ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకపోవడం వెనుక మతలబేమిటి?

Supplier name	Tanker no.	Date of receip	Date of sampl	Passed / Rejected	Lab report ref no.
M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BA9459	4.7.2024	4.7.2024	Passed	G/350/2024 dt:6.7.2024
M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	AP26TC4779	6.7.2024	6.7.2024	Rejected	Rejected by External Lab
M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BA9459	6.7.2024	6.7.2024	Rejected	Rejected by External Lab
M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BB2151	12.7.2024	12.7.2024	Rejected	Rejected by External Lab
M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BB2070	12.7.2024	12.7.2024	Rejected	Rejected by External Lab

ఏఆర్ డెయిరీ నుంచి వచ్చిన నెయ్యి లారీల వివరాలు

- తిరుమల కొండపైకి ఓ నెయ్యి ట్యాంకర్ వస్తే అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్లడానికి కనీసం ఒకటి నుంచి 3 రోజుల సమయం పడుతుంది.
- ఏఆర్ డెయిరీకి చెందిన టీఎన్02బీఏ9459 నంబర్ గల నెయ్యి ట్యాంకర్ జూలై 4వ తేదీన తిరుమలకు వచ్చింది. నెయ్యి అన్‌లోడ్ చేశాక.. తిరుమల నుంచి 500 కి.మీ. దూరంలో తమిళనాడులోని దుండిగల్‌లో ఉన్న ఏఆర్ సంస్థ డెయిరీకి ఆ ట్యాంకర్ వెళ్లి.. అక్కడ నెయ్యి లోడ్ చేసుకుని మళ్లీ తిరుమల రావడానికి ఎన్ని రోజులు పడుతుంది? పైగా లోడ్ ట్యాంకర్ స్పీడ్‌గా రావడానికి కుదరదు. నెమ్మదిగా రావాలి. పనులన్నీ చకచకా జరిగినా తక్కువలో తక్కువ 3 రోజులు పడుతుందనుకుందాం! అయితే సరిగ్గా ఒక్క రోజు తేడాతో జూలై 6వ తేదీన తిరుమల కొండపై అదే టీఎన్02బీఏ9459 ట్యాంకర్ నెయ్యితో ప్రత్యక్షమైంది. ఇదెలా సాధ్యమైందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న! ఈ ట్యాంకర్‌తో పాటు వైష్ణవి డెయిరీ పేరిట రిజిస్టరైన మరో ట్యాంకర్ ద్వారా కూడా ఏఆర్ పేరిట అదే రోజు నెయ్యి వచ్చింది. ఈ రెండు ట్యాంకర్ల నెయ్యిలో కల్తీ జరిగినట్లు తేలడం వెనుక మతలబేమిటి?

మక్కెలు విరగ్గొడతాం

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసిన సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'బోట్లను నదిలోకి వదిలి ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసే ప్రయత్నం వెనుక వైసీపీ ఉంది. అందులో అనుమానమే అక్కర్లేదు. వీళ్లకు కొన్ని అలవాట్లు ఉన్నాయి. వీళ్లు చేసివేరే వాళ్లపై రుద్దుతారు. కృష్ణానదిలో విపరీతమైన వేగంతో వరద ప్రవహిస్తున్నప్పుడు 40 టన్నుల బరువున్న బోట్లను వదిలారు... అవి విపరీతమైన వేగంతో వచ్చి బ్యారేజీ స్తంభాలను ఢీకొట్టి ప్రాజెక్టు కూలిపోవాలని వారి ఆలోచన. కానీ అవి గేట్లపై ఉండే కౌంటర్ వెయిట్‌కు తగలడంతో అవి విరిగిపోయాయి. ఆ బోట్లను తీయడానికి నాలుగైదు రోజులు ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. ఈ పని చేసినందుకు క్షమాపణ చెప్పరా? వాటిపై మీ బొమ్మలు, మీ పార్టీ రంగులు వేసుకున్నారు. ఆంబోతుల్లా దేశంపైకి వదిలి చూస్తూ కూర్చుంటారా? ఆ ప్రాజెక్టు కూలిపోతే ఎన్ని గ్రామాలు కొట్టుకుపోతాయి? ఎంత ప్రాణనష్టం వాటిల్లుతుంది. మీరు చేసిన పనులతో బుడమేరు కింద 6లక్షల మంది నరకయాతన అనుభవించారు. ఇప్పుడు మళ్లీ అనంతపురంలో రథం తగలబెట్టారు. ఒళ్లు దగ్గర పెట్టుకోమని హెచ్చరిస్తున్నాం. బీ కేర్‌ఫుల్. ప్రతిచోటా సీసీ కెమెరాలు పెట్టిస్తున్నాం. ఇలాంటి నేరాలు చేస్తే మక్కెలు విరగ్గొడతాం. ఇంటినుంచి బయటకు వచ్చిన మరుక్షణం చొక్కా పట్టుకొని తీసుకెళ్తాం. ఎంత గొప్పవాడైనా వదిలిపెట్టేది లేదు. ఎవరైనా దారి తప్పి నేరాలు చేయాలనుకుంటే అదే వారికి చివరి రోజు అవుతుంది. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడేది లేదు' అని చంద్రబాబు హెచ్చరించారు.

వరదల నష్టం రూ.7,600 కోట్లు: సీఎం

ఇటీవల రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు కలిపి రూ.7,600 కోట్ల నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వరదల్లో నష్టపోయిన 4లక్షల మంది బాధితులకు బుధవారం రూ.602 కోట్ల పరిహారాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'భారీవర్షాలు, వరదల ప్రభావం రాష్ట్రమంతా ఉంది. మొత్తం 16 జిల్లాల్లోని 902గ్రామాలు, కొన్ని నగరాలు, పట్టణాలు ప్రభావితమయ్యాయి. ఈ ప్రభావం 12 లక్షల మందిపై పడింది. 74 మంది మరణించారు. విజయవాడ చుట్టుపక్కల 45మంది మరణించారు. బాధితులను ఆదుకోవడానికి ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.400కోట్ల విరాళాలు వచ్చాయి. వీల్‌చైర్లలో వచ్చి మరీ విరాళాలు ఇచ్చి వెళ్లారు. పాఠశాలల్లో విద్యార్థులు కూడా ఇచ్చారు. ఇది ఊహించనంత స్పందన. దాతలు అందరికీ నా పాదాభివందనం. విజయవాడలో వరద తీవ్రత చాలా అధికంగా ఉంది. బాధితులను ఆదుకోవడానికి పది రోజుల్లో 1.15కోట్ల ఆహార పొట్లాలు, 1.30కోట్ల నీళ్ల సీసాలు పంపిణీ చేశాం. 5వేల టన్నుల కూరగాయలు సబ్సిడీ ధరలకు విక్రయించాం. 150 డ్రోన్లను వాడాం. 75 వేల ఇళ్లలో బురదతో పాటు 330 కి.మీ. రోడ్లను ఫైర్‌ఇంజన్లతో శుభ్రం చేయించాం. 2లక్షల మందికి వైద్య సహాయం అందించాం. వరదల్లో వచ్చి పడిన మట్టి, చెత్తను ఎత్తి తరలిస్తే 20వేల టన్నులు అయింది. బాగా శుభ్రం చేయడం వల్ల వ్యాధులు ప్రబలడం తగ్గింది' అని చంద్రబాబు వివరించారు. వరదల్లో నష్టపోయిన వారికి చరిత్రలో ఏనాడూ లేనంత నష్టపరిహారం ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. 'నీటమునిగిన గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లకు రూ.11వేలు ఇవ్వాలని కేంద్రం సూచించింది. మేం రూ.25వేలు ఇచ్చాం. చిన్న కిరాణా షాపులు, పరిశ్రమలకు రూ.25వేల నుంచి రూ. 50వేల వరకూ ఇచ్చాం. బ్యాంకులు ఇప్పటికి రూ.500కోట్ల మేర రుణాలు రీషెడ్యూల్ చేయడంతో పాటు కొన్ని కొత్త రుణాలు ఇచ్చాయి. బీమా కంపెనీలు ఈ నెల 30నాటికి వంద శాతం క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఆదేశించాం. ఆ తేదీతో వరద బాధితుల సహాయానికి సంబంధించి అన్ని పనులు పూర్తికావాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. ఆ రోజు సాయంత్రం బాగా పనిచేసినవారికి అభినందన కార్యక్రమం నిర్వహిస్తాం' అని ఆయన చెప్పారు.

'తాడేపల్లి' దందా సంగతేంటి?

(మొదటి పేజీ తరువాయి)

కళ్ల ముందు కనిపిస్తున్న టెండర్లు, ఒప్పంద పత్రాల ఆధారంగానే విచారణ చేస్తున్నాయి. ఆ ఒక్క దారిలో విచారణ కొనసాగితే ఏసీబీ చెబుతున్న 2586 కోట్ల అక్రమాలకే పరిమితం అవుతుంది. అదే తెరచాటు తాడేపల్లి దోపిడీపై ఏసీబీ విచారిస్తే అవినీతి అనకొండలు బయటకొస్తాయని గనుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరి ప్రభుత్వం, ఏసీబీ ఆ దిశగా విచారణను ముందుకు తీసుకెళ్తాయా? తెరవెనుక ఉన్న తాడేపల్లి క్విడ్ ప్రో కో మాస్టర్ మైండ్ గుట్టును బయటకు లాగుతాయా? ఇసుకలో అసలు దొంగలు మింగిన సొమ్మును కక్కించాలనే డిమాండ్లు సర్వత్రా వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా అక్రమాలు

రాష్ట్రంలో 2019 సెప్టెంబరు వరకు ఉచిత ఇసుక విధానం అమలైంది. ఆ తర్వాత ఉచితాన్ని ఎత్తేశారు. 2020లో గనుల శాఖకు వెంకటరెడ్డి డైరెక్టర్‌గా వచ్చారు. 2021 మే నుంచి 2023 మే వరకు రెండేళ్ల కాలపరిమితితో ఇసుక తవ్వకం, అమ్మకం కాంట్రాక్టును నాటి జగన్ సర్కారు జేపీ వెంచర్స్ లిమిటెడ్ కంపెనీకి కట్టబెట్టింది. జేపీ వెంచర్స్‌ను తమ నేతే తీసుకొచ్చారని, ఇసుక అంతా తమదే అని భావించిన వైసీపీ నేతలు రీచ్‌లు, నదులు, వాగులు, వంకలపై పడి ఇసుకను తోడేసుకున్నారు. దీంతో జేపీ వెంచర్స్ చేతులెత్తేసింది. ఆ సంస్థను ముందు పెట్టి వైసీపీ ముఖ్యనేత తాడేపల్లి నుంచి ఇసుక దందా నడిపించారని స్వయంగా నాటి గనుల శాఖ అధికారులు, ఆ పార్టీ నేతలే అనేక సందర్భాల్లో చెబుతూ వచ్చారు. సబ్‌కాంట్రాక్టు నుంచి టర్న్‌కీ సంస్థ వైదొలిగాక వైసీపీ నేతలు పట్టపగ్గాలు లేకుండా రెచ్చిపోయారు. ఉమ్మడి జిల్లాల వారీగా వైసీపీ నేతలు తాడేపల్లి నుంచి ఇసుక కాంట్రాక్టులు పొందారు. ప్రతీ నెల ఒక్కో జిల్లా నుంచి 20-25 కోట్ల చొప్పున తాడేపల్లికి కప్పం కట్టేలా ఒప్పందం చేసుకున్నాకే ఇసుక వ్యాపారం కట్టబెట్టారు. ఇలా వ్యాపారం చేజిక్కించుకున్నవారిలో అప్పటి ఆరుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు కూడా ఉన్నారు. ఇలా 2024 మే దాకా అనధికారిక ఇసుక దోపిడీ అప్రతిహతంగా కొనసాగింది. ఈ మధ్యలో తాడేపల్లి నుంచి చెల్లింపుల ఒత్తిళ్లు భరించలేక ఓ ఇసుక కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఉదంతంతోనే తాడేపల్లి దందా తీవ్రత బయటి ప్రపంచానికి తెలిసింది. ముగ్గురు ఎమ్మెల్యేలు ఆ ఒత్తిడి భరించలేక ఇసుక వ్యాపారాన్ని వదిలేసుకొని తాడేపల్లి సూచించిన వారికి అప్పగించారు. ప్రతీ నెల తాడేపల్లికి 260 కోట్ల మేర చేరేవని చెబుతున్నారు. ఈ లెక్కన తాడేపల్లికి చెల్లించిన కప్పమే 9 వేల కోట్లపైనే. సగటున నెలకు 20 కోట్ల లెక్క తీస్తేనే ఇంత మొత్తం వస్తోంది. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు వంటి జిల్లాల నుంచి 25 కోట్లు వస్తే, మరి కొన్ని జిల్లాల నుంచి 20 కోట్ల మేర చెల్లింపులు చేశారు. తాడేపల్లికే నెలకు ఇంత కప్పం వస్తే.. ఇసుక వ్యాపారం చేసిన వైసీపీ నేతలకు నెలకు ఎంత మిగిలిందో ఊహించుకోవచ్చు. మూడేళ్ల వ్యవధిలో మొత్తం 15 వేలకోట్లపైనే ఇసుక దోపిడీ జరిగిందని అధికార వర్గాలే విస్తుపోతున్నాయి.

రాష్ట్రమంతా గ్రీన్ ఎనర్జీ!

(మొదటి పేజీ తరువాయి)

పొందుపరచాలని చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న 'సూర్యఘర్' పథకాన్ని అందిపుచ్చుకోవాలని, రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి.. చార్జింగ్ యూనిట్లలో చౌకగా కరెంటు అందించడంపైనా దృష్టి సారించాలని సూచించారు. బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో క్లీన్ ఎనర్జీ పాలసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. గురువారం కూడా ఈ సమీక్షను కొనసాగించి.. పాలసీకి తుది రూపం ఇద్దామని ఆయన చెప్పారు. బయో ఇంధనోత్పత్తికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. బయో ఇంధన మొక్కల పెంపకానికి ఎల్లలు లేకుండా విస్తారంగా ప్రైవేటు సంస్థలు పెంచేలా ప్రోత్సాహకాలను ఇవ్వాలన్నారు. ఇందుకోసం .. భూముల లీజుల విషయంలో ధరలను ప్రభుత్వం ఖరారు చేయకుండా.. ప్రైవేటు సంస్థలు, భూయజమానులు పరస్పరం ఒప్పందం చేసుకునే స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. పెట్టుబడిదారులను ఆహ్వానించేలా క్లీన్ ఎనర్జీ పాలసీని రూపొందించాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను సీఎం ఆదేశించారు. వారికి రెండు నెలల్లోనే అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెగావాట్‌కు ఒక కోటి రూపాయల చొప్పున డెవలపర్‌కు ఐదేళ్ల పాటు చెల్లించేలా క్లీన్ ఎనర్జీ పాలసీని రూపొందిస్తున్నారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ల నుంచి బిడ్డింగ్ విధానం ద్వారా విద్యుత్‌కొంటారు. హైడ్రోజన్ వెహికల్ తయారీ.. రీఫిల్లింగ్ స్టేషన్లకూ ప్రోత్సాహకాలు అందిస్తారు.

ప్రతిపాదిత పాలసీలోని ముఖ్యాంశాలు..

- క్లీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 రూపకల్పన. దీని అమలుకు నోడల్ ఏజెన్సీగా న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ) వ్యవహరిస్తుంది. ఇది క్లీన్ ఎనర్జీలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు భూకేటాయింపులు, విద్యుత్ వాణిజ్యం, సమన్వయం, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, వేగవంతమైన క్లియరెన్సులు, కెపాసిటీ నిర్ధారణ వంటి వాటిపై పెట్టుబడిదారులతో సమన్వయం చేస్తుంది.
- భవిష్యత్‌లో ఇంధన రంగాన్ని ఏలనున్న సోలార్ ఎనర్జీ బ్యాంకింగ్, హైడ్రోజన్ విద్యుదుత్పత్తికి అధిక ప్రాధాన్యం. క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసే సంస్థలకు ఏడాదిలోనే అన్ని అనుమతులూ ఇవ్వాలి. ప్లాంట్లను స్థాపించాలన్న నిబంధనలు పెట్టనున్నారు.
- దేశంలోనే ఇంధన రంగంలో మెరుగైన నాలెడ్జ్ , ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు. మేధావులు, ఇంధన రంగంలో, రెన్యువబుల్ ఎనర్జీలో అనుభవం కలిగిన వారితో సదస్సుల నిర్వహణ ద్వారా ఎన్‌ఆర్‌ఈడీసీఏపీకి అదనపు రాబడి.
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు రాష్ట్ర ఇంధన కార్యదర్శి అధ్యక్షతన కమిటీని నియమిస్తారు. ఇందులో డిస్కంలు, ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ, సీఐఐ, ఏపీసీసీఐ ప్రాజెక్టు డెవలపర్లు సభ్యులుగా ఉంటారు. పాలసీ అమలు కోసం ప్రత్యేకంగా ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్(పీఎంయూ)ను ఏర్పాటు చేస్తారు. పీఎంయూలో ఐదుగురు నిపుణులు ఉంటారు.
- ప్లాంటు ఏర్పాటుకు ఎకరాకు రూ.31 వేల చొప్పున లీజుకు ప్రతి రెండేళ్లకు ఒకసారి ఐదు శాతం లీజు ధరను పెంచుతారు. సోలార్, సోలార్-విండ్ హైబ్రిడ్, విండ్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లకు కూడా ఇదే విధంగా ప్రైవేటు భూములను దీర్ఘకాలిక లీజులకు అప్పగించేలా చర్యలు.
- ప్లాంట్లను 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' విధానంలో కేటాయిస్తారు.
- 2 వేల ఎకరాల విస్తీర్ణంలో సోలార్ పార్కులను స్థాపించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు సోలార్ పార్కుతో పాటు ఎస్పీడీసీఎల్ కూడా ప్రత్యేకంగా సోలార్ పార్కు ఏర్పాటు చేయనుంది.
- మినీ హైడల్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేస్తే యంత్రసామగ్రిపై 20 శాతం సబ్సిడీ ఇస్తారు.



16 మంది ఐపీఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణను బదిలీ చేసింది. సెబ్ రద్దు కావడంతో సెబ్ ఐజీగా ఉన్న ఎం.రవిప్రకాశ్‌కు పీఅండ్‌ఎల్ ఐజీగా పోస్టింగ్ లభించింది. విశాఖపట్నం జేసీపీ కె.ఫక్కీరప్పను ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేసింది. అక్కడున్న అట్టాడ బాబూజీని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వెయిటింగ్‌లో ఉన్న ఆర్‌ఎన్ అమ్మిరెడ్డికి డీజీపీ కార్యాలయంలో అడ్మిన్ డీఐజీగా, మరో డీఐజీ విజయారావుకు రోడ్ సేఫ్టీలో పోస్టింగ్ దక్కింది. శాంతిభద్రతల ఏఐజీగా సిద్ధార్థ్ కౌశల్, విశాఖ శాంతిభద్రతల డీసీపీగా మేరీ ప్రశాంతి నియమితులయ్యారు. అనకాపల్లి ఎస్పీ దీపిక ఎం.పాటిల్ కోరిక మేరకు ఆమెను కాకినాడ ఏపీఎస్పీకి బదిలీ చేశారు. ఆమె స్థానంలో విశాఖ డీసీపీ తుహిన్ సిన్హాను అనకాపల్లి ఎస్పీగా నియమించారు. నిరీక్షణలో ఉన్న జీఆర్ రాధికకు ఒంగోలు పీటీసీ, ఆరిఫ్ హఫీజ్‌కు ఇంటెలిజెన్స్, తిరుమలేశ్వర్‌రెడ్డికి విజయవాడ డీసీపీ (క్రైమ్స్), రాజమండ్రి ఆర్‌వీ-ఈవో కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డికి పీటీవోలో పోస్టింగ్స్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ఎస్పీగా ఉన్న నాన్‌కేడర్ ఐపీఎస్ కేవీ శ్రీనివాసరావును బదిలీచేసి హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

48 గంటల్లో పాస్‌పోర్టులు సరెండర్ చేయండి

▸▸ చంద్రబాబు ఇంటిపై దాడికేసులో వైసీపీ నేతలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దర్యాప్తు అధికారులకు 48 గంటల్లో పాస్‌పోర్టులు సరెండర్ చేయాలని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరు కావాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో నిందితులైన వైసీపీ నేతలను సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. విచారణకు పూర్తిగా సహకరించాలని స్పష్టం చేసింది. చంద్రబాబు ఇంటిపై దాడి చేశారనే అభియోగంతో వైసీపీ నేతలపై ఏపీ పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే.. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ నేతలు చెరుకు మాధవరావు, బొర్రా రాంబుజ్జి, షేక్ ముబారక్ బాషా, మహమ్మద్ ఫనీ, నల్లమోతు రవితేజ, మునిగోటి నారాయణ, ఆరేపల్లి రామారావు, జోగి రాము, అవుటపల్లి ధీరజ్ సింహా, మేడపాటి వెంక నాగిరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని వారు సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, పీ సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు రమేశ్ అల్లంకి, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా హాజరయ్యారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబరు 21వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ పది మందిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది.

వన్యప్రాణి సంరక్షణకు చర్యలు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వన్యప్రాణుల జీవనానికి ఎలాంటి అవరోధాలూ లేకుండా వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల్లో టైగర్ రిజర్వ్ ప్రాజెక్టులకు ఎలాంటి విధానాలు అనుసరించాలో అధికారులు వివరించగా, దీనిపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. వన్యప్రాణి సంరక్షణ, భారత మాల పరియోజన ద్వారా చేపట్టే నాలుగు వరుసల రోడ్ల నిర్మాణానికి షార్ సమీపంలో తీరప్రాంత రక్షణ, జెట్టి నిర్మాణం, కడప-రేణిగుంట మధ్య రైల్వేలైన్‌లో రోడ్డు నిర్మాణాలకు అనుమతిపై ఆయన అధికారులతో చర్చించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



వరద బాధితుల కోసం సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న లిబర్టి గ్రూప్ ఎండీ జైద్ కదీర్, చిత్రంలో మంత్రి నిమ్మల

విరాళాలతో వరద బాధితులకు ఊరట

- ఎల్‌అండ్‌టీ రూ.3.50కోట్లు.. సిద్ధార్థ లూథ్రా రూ.40లక్షలు..
- సీఎం చంద్రబాబుకు చెక్కులిచ్చిన దాతలు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం ఇంకా అనేక మంది దాతలు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో పలువురు దాతలు సీఎం చంద్రబాబును కలిసి, విరాళాల చెక్కులు, డీడీలు అందజేశారు. ఎల్‌అండ్‌టీ బోర్డు డైరెక్టర్ ఎం.వి.సతీష్ రూ.3.50కోట్లు, రామ్‌కో గ్రూప్ చైర్మన్ పీఆర్ వెంకట్రామరాజు రూ.2కోట్లు, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ ఫెడరేషన్ తరపున చిట్టూరి రవీంద్ర రూ.కోటి, కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ చైర్మన్ కె.ఎం.వి.ప్రసాదరావు, డైరెక్టర్ కె.పృథ్వీరాజ్ రూ.కోటి, ఖాదర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జైదీ అఫ్జల్ ఖాదర్ రూ.కోటి, కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ రూ.కోటి, పళని అప్పన్ రూ.కోటి, సీబీఆర్ ప్రసాద్ రూ.54లక్షలు, ది ఇండియన్ టొబాకో అసోసియేషన్ ప్రతినిధులు రూ.50లక్షలు, అడ్వకేట్ సిద్ధార్థ లూథ్రా రూ.40లక్షలు, ఫిల్మ్ నగర్ క్లబ్ ప్రతినిధులు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు రూ.25లక్షలు, బొండాడ గ్రూప్స్ చైర్మన్ బొండాల రాఘవేంద్రరావు రూ.25లక్షలు, పెనమలూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల తరపున ఎమ్మెల్యే బోడే ప్రసాద్ రూ.22లక్షలు, సత్య ఏజెన్సీస్ ఏపీ హెడ్ సెంథిల్‌కుమార్ తదితరులు రూ.10లక్షలు, పి.శ్యామ్ సుందర్ రూ.10లక్షలు, అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ప్రతినిధులు రూ.8.11లక్షలు, ఇంకా అనేక మంది తమకు తోచినంత విరాళాలు ఇచ్చారు.

సూపర్ సిక్స్‌పై శ్వేతపత్రం ఇవ్వండి

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్.. విజయవాడలో కాంగ్రెస్ ధర్నా



విజయవాడలో నిర్వహించిన ధర్నాలో పళ్లాలు మోగిస్తున్న షర్మిల, కాంగ్రెస్ నేతలు

విజయవాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి నిజంగా మంచి ప్రభుత్వమే అయితే సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో ఎప్పటి నుంచి అమలు చేస్తారో శ్వేతపత్రం విడుదల చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాల అమలు కోరుతూ కాంగ్రెస్ పార్టీ బుధవారం విజయవాడ ధర్నాచౌక్‌లో 'థాలి బజావ్' కార్యక్రమాన్ని నిర్వహించింది. కాంగ్రెస్ శ్రేణులు పళ్లాలను చేతబట్టి, గరిటెలతో మోగించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో ఉద్యోగాల కల్పన మీద ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదన్నారు. ఖాళీగా ఉన్న 3 లక్షల ఉద్యోగాలను ఎలా నింపుతారో ప్రణాళికలు లేవని విమర్శించారు. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రంలో 7 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, చంద్రబాబు మాత్రం 2 లక్షల ఎకరాల్లోనే నష్టం జరిగిందని చెబుతున్నారని పేర్కొన్నారు. విజయవాడలో వరద బాధితులు సర్వం కోల్పోతే కనీసం తాగడానికి నీళ్లు ఇవ్వలేదన్నారు. గతంలో జగన్ మీద ప్రజలు విశ్వాసం కోల్పోతే, ఇప్పుడు బాబుపై కోల్పోతున్నారని చెప్పారు.

దర్యాప్తునకు సహకరించండి

- ఐపీఎస్ విశాల్ గున్నీకి హైకోర్టు ఆదేశం
- 1 వరకు చర్యలొద్దని పోలీసులకు స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో దర్యాప్తునకు సహకరించాలని ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీని హైకోర్టు ఆదేశించింది. విచారణను అక్టోబరు 1వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి..: హనుమంతురావు

కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయవాడ అప్పటి ఏసీపీ హనుమంతురావు బుధవారం హైకోర్టులో పిటిషన్ వేశారు. జెత్వానీ ఫిర్యాదులో తనపై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు. జెత్వానీ, ఆమె కుటుంబ సభ్యుల అరెస్టులో గానీ, వారిపై కేసు నమోదులో గానీ తన పాత్ర లేదన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది.

అవే పొంతన లేని సమాధానాలు

- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో విచారణకు సహకరించని వైసీపీ నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 25: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నేతలు విచారణకు అస్సలు సహకరించడం లేదు. విచారణలో పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. విచారణలో భాగంగా వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, న్యాయవాది ఒగ్గు గవాస్కర్ బుధవారం మంగళగిరి పోలీసుల ఎదుట హాజరయ్యారు. తొలుత గవాస్కర్‌ను పోలీసులు గంటపాటు విచారించారు. తర్వాత అప్పిరెడ్డిని సుమారు గంటన్నరపాటు ప్రశ్నించారు. కాగా, విచారణలో వైసీపీ నేతలు సహకరించడం లేదని మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. తమ వద్ద ఉన్న సాంకేతిక ఆధారాలకు, వారు చెబుతున్న సమాధానాలకు ఏమాత్రం పొంతన ఉండడం లేదన్నారు. గతంలో విచారించిన సమయంలో ఇచ్చిన చిరునామాలో కాకుండా మరోచోట ఉంటున్నారని చెప్పారు. టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిన రోజు వినియోగించిన సెల్‌ఫోన్లు ఇవ్వమని కోరగా, అందుకు నిరాకరిస్తున్నారని, కోర్టు అనుమతితోనే ఇస్తామని చెబుతున్నట్టు వెల్లడించారు. ఘటన జరిగిన రోజు కొందరు వ్యక్తులకు వైసీపీ నేతలు డబ్బులు ఇచ్చినట్లుగా కూడా తమకు సమాచారం ఉందని, దాని నిమిత్తం నిందితుల బ్యాంకు ఖాతా వివరాలను కూడా కోరామన్నారు. ఆ వివరాలను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని తెలిపారు.

పదేళ్లలో ఏపీకి రూ.35,491 కోట్లిచ్చాం: కేంద్రం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కి గత పదేళ్లలో ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.35,491.57 కోట్లు ఇచ్చినట్టు కేంద్ర ఆర్థిక శాఖ ఒక ఆర్టీఐ కార్యకర్తకు ఇచ్చిన సమాధానంలో తెలిపింది. ఈ పదేళ్లలో ఈఏపీ ప్రాజెక్టుల రుణం, వాటి వడ్డీ కింద రూ.15.81 కోట్లు విడుదల చేసినట్టు వెల్లడించింది. 2014-15 రెవెన్యూ లోటు కింద రూ.16,078.76 కోట్లు ఇచ్చామంది. వెనుకబడిన జిల్లాలకు ఐదేళ్లలో రూ.1,750 కోట్లు, రాజధాని అభివృద్ధిలో అత్యవసర మౌలిక సదుపాయాలకు రూ.2,500 కోట్లు, పోలవరానికి రూ.15,147 కోట్లు ఇచ్చినట్టు చెప్పింది.

హైకోర్టుకు విద్యాసాగర్

- ట్రయల్ కోర్టు రిమాండ్ ఆదేశాలు సవాల్

సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తనకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితుడు కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని విద్యాసాగర్ తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇది విచారణకు వచ్చింది. విద్యాసాగర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ... పోలీస్ కస్టడీకి సంబంధించి గురువారం ట్రయల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేయబోతోందని, వాటిని తాత్కాలికంగా వాయిదా వేసేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ... కేసు ఫైళ్లు పది నిమిషాల క్రితమే అందాయని తెలిపారు. వివరాలు తెప్పించుకొనేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప వ్యాజ్యంపై విచారణను గురువారానికి వాయిదా వేశారు.

ఈ ఆక్రమణలను అడ్డుకునేవారేరి..?

● భవానీపురంలో ఇరిగేషన్ స్థలం కబ్జా చేసి ధ్యానమందిర్ నిర్మాణం ● రిటైనింగ్‌వాల్ వద్ద స్థలం ఆక్రమించి పశువుల పాక ఏర్పాటు

- కరకట్ట సౌత్ స్థలం ఆక్రమించి ధ్యానమందిర్ నిర్మాణం
- తవ్వకాల వల్లే కృష్ణానది వరద నీటితో బాలభాస్కర్‌నగర్ మునక
- పట్టించుకోని ఇరిగేషన్, వీఎంసీ అధికారులు





భవానీపురం కరకట్ట సౌత్ ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం, ఇసుకలో పశువుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలు

విద్యాధరపురం: భవానీపురం కరకట్ట సౌత్ ప్రాంతాన్ని స్థానికులు కబ్జా చేసి దర్జాగా ఆ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారు. కబ్జాదారులు కరకట్ట తవ్వటం వల్లే ఇటీవల కృష్ణానదిలోకి భారీగా వచ్చిన వరద నీరు బాల భాస్కర్‌నగర్, బ్యాంక్ సెంటర్, మసీదు రోడ్డు, 40, 41వ డివిజన్‌లోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. ఇంత జరుగుతున్నా కనీసం ఇరిగేషన్ అధికారులుగాని, వీఎంసీ అధికారులుగానీ పట్టించుకోకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వరద ముంపునకు రెండు రోజుల ముందు 40వ డివిజన్‌కు చెందిన ఓ వైసీపీ నేత ధ్యాన మందిర నిర్మాణం కోసం సుమారు 200 గజాలకు పైగా ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేశాడు. ఆ స్థలంలో నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నాడు. ఈ నేత నిర్వాకం వల్లే ఇటీవల వచ్చిన వరదకు స్థానిక ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వరద తగ్గాక మళ్లీ అదే ప్రాంతంలో నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నాడు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి నియోజకవర్గంలో ఏ ప్రాంతంలోనైనా స్థలాలు కబ్జా, ఆక్రమణలు, అనధికార భవన నిర్మాణాలు జరగకూడదని అధికారులకు సూచించారు. అయిన జాతీయ రహదారి పక్కన ఇరిగేషన్‌కు చెందిన కరకట్ట స్థలం కబ్జాకు గురవుతుంటే అధికారులు చర్యలు తీసుకోకపోవటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఇరిగేషన్‌కు చెందిన స్థలాన్ని కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

కృష్ణానది రిటైనింగ్ వాల్ వద్ద..

రామలింగేశ్వరనగర్: కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణానంతరం ఆ ప్రాంతంలో ఆక్రమణలు లేకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోవపోవడంతో ఆక్రమణలు వెలుస్తున్నాయి. రామలింగేశ్వరనగర్ గుమ్మడి లక్ష్మణరావు వీధి చివర 10 ఎంజీ ప్లాంట్ వెనుక స్థానికంగా ఉన్న వ్యక్తులు పశువుల కోసం తాత్కాలికంగా పందిరి వేయడంతో పాటు వాల్ పక్కనే వాటిని కట్టివేసేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయడంతో అక్కడ అపరిశుభ్రత వాతావరణం ఏర్పడింది. వాల్ నిర్మాణానంతరం ఇళ్లు తొలగించిన ప్రాంతాన్ని పూర్తిగా ఇసుకతో నింపేయడంతో పాటు ఎలాంటి ఆక్రమణలు లేకుండా అధికారులు నిషేదం విధించారు. అయితే ఈ ప్రాంతంలో గేదెలు పెంచుతున్న వారు స్థానిక వైసీపీ నేతల అండతో కొంత ప్రాంతాన్ని ఆక్రమించి పశువులకు అడ్డా ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం వేళల్లో వాకింగ్ వచ్చేవారు భరించలేని దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు ప్రశ్నిస్తే ఆక్రమణదారులు వివాదానికి దిగడంతో పాటు స్థానిక ప్రజాపతినిధి తన వెనుక ఉన్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు సమాచారం. అధికారులు ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ఇకముందు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

జగన్ పాలనలో దేవాలయాలపై దాడులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

గన్నవరం, సెప్టెంబరు 25: కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్పుతోనే గత వైసీపీ పాలన కొనసాగించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని కృష్ణాజిల్లా గన్నవరం మండలం జక్కులనెక్కలంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ పాలనలో హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. జగన్ ఎంత నొక్కేశారో ప్రజలు గమనించి ఎన్నికల్లో ఓడించారన్నారు. బాధ్యతతో మెలుగుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ప్రపంచంలో 5వ ఆర్థికశక్తిగా భారతదేశం ఎదిగిందన్నారు. 2019లో బీజేపీకి 23కోట్ల ఓట్లు వచ్చాయనని, 2024లో 24కోట్లు ఓట్లు వచ్చినట్టు తెలిపారు. బీజేపీకి గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓట్ల సంఖ్య పెరిగిందన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారం వల్ల ఎంపీ సీట్ల సంఖ్య కొంచెం తగ్గిందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి ఏపీకి సుపరిపాలన అందిస్తుందని ప్రజలు అధికారం ఇచ్చారని పురందేశ్వరి గుర్తుచేశారు. కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, మట్టా ప్రసాద్, పంతం గజేంద్ర, షేక్ బాజీ, నాదిండ్ల మోహన్, ఎల్ మల్లిఖార్జునరావు, కానూరు శేషమాధవి, జి.దుర్గా ప్రసాద్, ఫణికుమార్, శేషబాబు, వెంకటేశ్వరరావు, అంజనేయులు, అశోక్, సర్పంచ్ మాకుల చిరంజీవి పాల్గొన్నారు.

టీటీడీ, ఇతర దేవస్థాన కమిటీల్లో

హిందువులనే నియమించాలి

- హిందూ జేఏసీ

ధర్నాచౌక్, సెప్టెంబరు 25: పవిత్ర తిరుమలను సంపూర్ణ ప్రక్షాళన చేయాలని హిందూ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. తిరుమల పవిత్ర సంరక్షణకు గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో జేఏసీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సనాతన ధర్మ పరిరక్షణకు పలు కార్యాచరణలపై చర్చించారు. టీటీడీ ఆధ్వర్యంలో గోశాల ఏర్పాటు చేసి తద్వారా మాత్రమే మేలిమి నెయ్యిని పవిత్ర లడ్డు తయారీకి వినియోగించాలని తీర్మానించారు. టీటీడీ, ఇతర దేవస్థానం కమిటీల్లో పరిపూర్ణ హిందువులను మాత్రమే నియమించాలని, తక్షణమే సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. తిరుమల, తిరుపతిలోని అన్ని అన్యమత ఆక్రమిత కట్టడాలను తొలగించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ వచ్చే నెల 6న హైదరాబాద్‌లో ధర్మపరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ హిందువులు మహాప్రసాదంగా స్వీకరించే టీటీడీ లడ్డూను కలుషితం చేయడం క్షమించరాని నేరమన్నారు. దీనికి కారణమైన వారిని శిక్షించాలన్నారు. లడ్డూ అంశంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తున్న తీరును జేఏసీ నేతలు అభినందించారు. కమలానంద భారతీస్వామి, మతా శివ చైతన్యజీ, పలువురు స్వామిజీలు, ఆధ్యాత్మికపరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలంటూ నిరసన దీక్ష

లబ్బీపేట: తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో జరిగిన అపచారాలు, అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని సనాతన హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం వద్ద బుధవారం నిరసన దీక్ష చేశారు. ఈ శిబిరాన్ని శివస్వామి సందర్శించి సంఘీభావం తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న శివస్వామి, హజరత్తయ్యగుప్తా

డీలర్లకు కూటమి ప్రభుత్వం అండ

- టీడీపీ పొలిట్‌బ్యూర్ సభ్యుడు టీడీ జనార్ధన్

వన్‌టౌన్, సెప్టెంబరు 25: రేషన్ డీలర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూర్ సభ్యుడు టీడీ జనార్ధన్ అన్నారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం జరిగిన రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో పాటుపడతున్న చంద్రబాబుకు అండగా నిలవాలని రేషన్ డీలర్లకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం డీలర్లకు అండగా ఉంటుందన్నారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం డీలర్లను గాలికొదిలేసిందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వంభర్ బసు మాట్లాడుతూ పప్పులు, నూనెలు, పంచదార, ఉప్పు అమ్మకానికి ఇవ్వాలని, కమీషన్ పెంచాలని కోరారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం డీలర్లను ఎంతో ఇబ్బంది పెట్టిందన్నారు. తెలంగాణ రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు నాయకోటి రాజు డీలర్ల సమస్యలను విస్మరిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. డీలర్ల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరామరెడ్డి, ఉపాధ్యక్షుడు పల్లయ్య, వి.నరసింహారావు, కార్యదర్శి కామిరెడ్డి నాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూర్ సభ్యుడు టీడీ జనార్ధన్

చలపతి, విజయవర్ధన్‌రావులను విడుదల చేయండి

ధర్నాచౌక్: 32 ఏళ్ల నుంచి జైల్లో మగ్గుతున్న చలపతి, వి జయవర్ధన్‌రావును విడుదల చేయాలని ప్రజాసంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. 1993లో చిలకలూరిపేటలో జరిగిన బస్సు దహనం కేసులో జీవిత శిక్ష అనుభవిస్తున్న చలపతి, విజయవర్ధన్‌రావును విడుదల చేయాలని కోరుతూ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం బుధవారం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ ఇప్పటికే మూడు జీవితకాల శిక్షలు అనుభవించిన వీరిని విడుదల చేయాలని కోరారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని గుంటూరులో బహిరంగ సభ నిర్వహించాలని తీర్మానించారు. ఏపీ పౌరసంఘం నేత టి.ఆంజనేయులు, హైకోర్టు న్యాయవాది సురేష్‌కుమార్, ఖైదీల విడుదల సాధన సమితి నేత భరద్వాజ్, విరసం అధ్యక్షుడు అరవిల్లి కృష్ణ, దళిత నేత దుర్గం సుబ్బారావు, ప్రముఖ న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ వివిధ ప్రజాసంఘాల నేతలు ప్రసంగించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఎం

అజిత్‌సింగ్‌నగర్: వరదలతో సర్వం కోల్పోయి, దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రజలు తమ గోడు చెప్పుకుందామని ఐదు రోజులుగా ఎమ్మెల్యే కార్యాలయానికి వస్తున్నారని అలా వచ్చిన ఓ వ్యక్తిపై బొండా ఉమా అనుచరులు 15 మంది విచక్షణారహితంగా స్తంభానికి కట్టేసి కొట్టడం దుర్మార్గపు చర్యని సీపీఎం సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శి వర్గ సభ్యుడు కె. దుర్గారావు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ దాడికి గురైన వ్యక్తికి వైద్యం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పోలీసులు అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులపై ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరుల దాడి హేయమైన చర్యని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఓ ప్రకటనలో అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు శుభాకాంక్షలు

బస్టేషన్, సెప్టెంబరు 25: ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన పార్లమెంట్ మాజీ సభ్యుడు కొనకళ్ల నారాయణను ఏపీఎస్‌ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. బుధవారం వెలగపూడి సచివాలయం ప్రాంగణంలో కొనకళ్ల నారాయణను ఆర్టీసీ కార్మికపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కొనకళ్లకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్మికపరిషత్ రాష్ట్ర కోశాధికారి కోసూరి సురేంద్ర, ప్రచార కార్యదర్శి వై.రమేష్ పాల్గొన్నారు. అలాగే ఏపీఎస్‌ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

'మైనారిటీ'పై సీఎం నిర్ణయం హర్షణీయం

విజయవాడ: రాష్ట్రంలో మైనారిటీ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలపై మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షిబ్లీ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీనిపై సీఎం, మైనారిటీ మంత్రి ఫరూక్‌కు అభినందనలు తెలిపారు. వక్ఫ్‌బోర్డు అభివృద్ధిలో ఆ వర్గానికి చెందిన వాళ్లే భాగస్వాములుగా ఉండేలా చూడాలని, మతపరమైన వాటిలో ప్రభుత్వ శాఖలు అనవసర జోక్యం వద్దని సీఎం ఆదేశించడం హర్షణీయమన్నారు.

క్రైమ్స్ డీసీపీగా తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడ: ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ క్రైమ్స్ డీసీపీగా కె.తిరుమలేశ్వరెడ్డిని నియమించారు. రాష్ట్రంలో 16 మంది ఐపీఎస్‌ల బదిలీలు బుధవారం జరిగాయి. అందులో వెయిటింగ్‌లో ఉన్న తిరుమలేశ్వరరెడ్డికి కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. క్రైమ్స్ డీసీపీగా రాజకుమారి పనిచేశారు. ఆమె బదిలీ తర్వాత ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. ఐదేళ్ల పాటు ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పుడు తిరుమలేశ్వరరెడ్డితో భర్తీ చేశారు.

రేపు కరాటే, తైక్వాండో ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా ఈ నెల 27న ఉదయం 9 గంటలకు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థలో కరాటే, తైక్వాండో బాలబాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వేమూరి రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. ఆదేరోజున ఐజీఎంసీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 బాలికలకు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు.

నేడు, రేపు నేషనల్ కాన్ఫరెన్స్

విజయవాడ: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లానర్స్ ఇండియా ఏపీ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో 26, 27న టెక్నో ట్రెడిషనల్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ ఫర్ ఎకో సెన్సిటివ్ కోస్టల్ సెటిల్‌మెంట్ ప్లానింగ్‌పై జాతీయ సదస్సును నగరంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రెసిడెంట్ ఎన్‌కే పటేల్, డైరెక్టర్ డాక్టర్ రమేశ్ శ్రీకొండ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పీ నారాయణ హాజరవుతున్నట్టు తెలిపారు.

జర్నలిస్ట్స్ హెల్త్‌కార్డు పరిమితిని పెంచండి

విజయవాడ: జర్నలిస్ట్స్ హెల్త్‌కార్డు పరిమితిని రూ.10లక్షలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ ఆధ్వర్యంలో పలు జర్నలిస్ట్స్ సంఘాలు మంత్రి సత్యకుమార్‌ను కోరాయి. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన మంత్రిని జర్నలిస్ట్స్ సంఘాలు కలి సి తమ సమస్యలను పరిష్కరించాలని కోరాయి. ముఖ్యం గా హెల్త్‌కార్డుల్లో వస్తున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారానే

ఆయుష్ ఖాళీల భర్తీ: మంత్రి సత్యకుమార్

వన్‌టౌన్, సెప్టెంబరు 25: మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారానే ఆయుష్ ఆసుపత్రుల్లో మెడికల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్, అడ్వకేట్ డాక్టర్ కృష్ణప్రసాద్, సభ్యులు శివకృష్ణ, మల్లిఖార్జున్, రమేష్, రాజీవ్, తదితర సభ్యులు బుధవారం మంత్రిని కలిసి డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేదిక్ కాలేజీలో ఒకేసారి 15మంది మెడికల్ ఆఫీసర్లను లెక్చరర్లుగా డిప్యూటేషన్ ఇస్తూ తీసుకువచ్చిన జీవోను రద్దుచేయాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా త్వరలోనే ఖాళీలను భర్తీచేస్తామని, కొత్తవారికి అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు.

రవాణా సమస్యలు పరిష్కరించండి

- ఆ శాఖ కమిషనర్‌ను కలిసిన లారీ ఓనర్స్ నేతలు

కృష్ణలంక, సెప్టెంబరు 25: రవాణా రంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్‌సిన్హాను రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కృష్ణా డిస్ట్రిక్ట్ ట్రైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని సురేష్, కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ కోశాధికారి అనుమకొండ హరివెంకట సురేష్, సహాయ కార్యదర్శి వత్సవాయి కృష్ణంరాజు తదితరులు సిన్హాను కలిసి రవాణా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమ పరిధిలోని వాటిని పరిష్కరిస్తామని, ఆర్థికపరమైన అంశాలను ఆర్థికశాఖకు పంపిస్తామని కమిషనర్ సిన్హా తెలిపారు.

జాతీయ విద్యా విధానం వద్దు: ఏఐఎస్ఏ

గవర్నర్‌పేట, సెప్టెంబరు 25: నూతన జాతీయ విద్యా విధానంతో ఉన్నత విద్య పూర్తిగా నిర్వీర్యమైందని, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తిగా పడిపోయాయని ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ (ఏఐఎస్ఏ) పిలుపు మేరకు బుధవారం ఎంజీ రోడ్డులోని జిల్లా కార్యాలయం వద్ద జాతీయ విద్యావిధానం రద్దు వద్దు, రాష్ట్ర విద్యా విధానం కావాలంటూ అసోసియేషన్ నగర, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహేష్, అధ్యక్షుడు శివ, నేతలు రాంబాబు, ధనుష్ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

రూ.53లక్షల విరాళం

పటమట, సెప్టెంబరు 25: ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్స్ లిమిటెడ్ సీఎం సహాయ నిధికి 14 బ్యాంకులు, సొసైటీల తరపున ఫెడరేషన్ నుం చి రూ.53 లక్షల 65వేలు, మిగిలిన ఐదు అర్బన్ బ్యాంకులు రూ.30లక్షలు విరా ళం ప్రకటించారు. 2023-24 ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ నగర 9వ వార్షికోత్సవ సమావేశం అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, ఉపాధ్యక్షుడు అబ్దుల్ జిలానీ, కార్యదర్శి చలసాని రాఘవేంద్రరావు సమక్షంలో బుధవారం గవర్నర్‌పేట మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఫెడరేషన్ ఆర్థిక సంవత్సరం కార్యకలాపాల నివేదికను ప్రకటించారు.

నేటి నుంచి తిరుపతిలో మత్తు వైద్యుల వార్షిక సదస్సు

వన్‌టౌన్, సెప్టెంబరు 25: మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో 33వ వార్షిక సదస్సు తిరుపతిలో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్తు వైద్యుల సమస్యలు, ఇబ్బందులు, ఆధునిక సాంకేతిక విధానాలపై చర్చ జరుగుతుందన్నారు. దేశ, విదేశాల నుంచి వెయ్యి మందికి పైగా మత్తు వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, 100 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ అధ్యాపకులు హాజరవుతారన్నారు. సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేవీ దివేషియాతో పాటు కార్యదర్శి ఎస్.ఎస్. భజన, తదితరులు హాజరవుతారన్నారు.



వరద బాధితుల సహాయార్థం ఏపీ సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.15 లక్షల విరాళం చెక్కును ఏపీ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌కు అందజేస్తున్న తెలుగు న్యాయవాదులు

వరద బాధితులకు సుప్రీం లాయర్ల విరాళం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టుకు చెందిన తెలుగు న్యాయవాదులు ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితుల సహాయార్థం రూ.15లక్షలు అందజేశారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌కు ఈమేరకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వై.రాజగోపాలరావు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఏపీతోపాటు తెలంగాణకు సాయం చేయాలని భావిస్తున్నామని, త్వరలోనే అందిస్తామని న్యాయవాది అల్లంకి రమేశ్ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇచ్చిన వారిలో విశ్రాంత న్యాయమూర్తి చల్లా కోదండరాం (రూ.5 లక్షలు), సీనియర్ న్యాయవాది వై.రాజగోపాలరావు (రూ.2లక్షలు), హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దామా శేషాద్రినాయుడు (రూ.లక్ష), న్యాయవాదులు ఆర్.ఆనంద్ పద్మనాభన్ (రూ.75వేలు), అల్లంకి రమేశ్ (రూ.50వేలు), ఉదయకుమార్ సాగర్ శెట్టి (రూ.50వేలు) తదితరులు ఉన్నారు.

ఆర్‌టీజీఎస్ సీఈవోగా దినేశ్‌కుమార్

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రియల్ టైమ్ గవర్నెన్స్ సర్వీసెస్(ఆర్‌టీజీఎస్) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఏపీ ఫైబర్ నెట్ ఎండీ దినేశ్ కుమార్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం మంగళవారం ఆర్‌టీజీఎస్ సీఈవోగా దినేశ్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

ఎక్సైజ్‌లో అధికారుల బదిలీలు

» పూర్వ విధానంలో జిల్లాలకు నియామకం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ అనంతరం భారీగా బదిలీలు జరిగాయి. పాత విధానంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లను ఆ శాఖ నియమించింది. కొత్త జిల్లాల ప్రకారం జిల్లాకో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. ఒకట్రెండు రోజుల్లో ఏఈఎస్‌లు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియను పూర్తిచేయనున్నారు. కాగా బదిలీల్లో కొందరు 'వైసీపీ' అనుకూల అధికారులకు మంచి పోస్టింగులు ఇచ్చారనే విమర్శలు వస్తున్నాయి. తిరుపతి, కాకినాడ, ప్రకాశం, రాజమండ్రిలకు నియమించిన అధికారులు గత ప్రభుత్వంతో అంటకాగారన్న అనుమానాలు ఉన్నాయి.

మద్యం నిల్వలు సరిపడా ఉన్నాయి: ఎక్సైజ్ డైరెక్టర్

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20 రోజులకు సరిపడా మద్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. డిపోల్లో 20లక్షల కేసుల లిక్కర్, 5.6లక్షల కేసుల బీరు ఉందని, షాపుల్లో 6.93లక్షల కేసుల లిక్కర్ ఉందన్నారు. షాపుల్లో ఉన్న లిక్కర్ తొమ్మిది రోజులకు సరిపోతుందన్నారు. అయితే బీరు ఎంత ఉందో వెల్లడించలేదు. రాష్ట్రంలో మద్యం కొరతపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై బుధవారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. షాపుల్లో ప్రీమియం బ్రాండ్లు ఎక్కువగా ఉన్నాయని కథనంలో ప్రస్తావించగా ఆయన దానికి సమాధానం ఇవ్వలేదు. మద్యం డిపోల నుంచి సరఫరా నిలిపివేశారా? లేదా? అనే విషయాన్ని పేర్కొనలేదు.

రిజిస్ట్రార్ వద్ద రూ.లక్ష జమ చేయండి

» అపార్టుమెంట్ నిర్మాణంపై పిల్ దాఖలులో దురుద్దేశం ఉందని తేలితే ఖర్చులు విధిస్తాం

» పిటిషనర్‌ను హెచ్చరించిన ధర్మాసనం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తన సతీమణికి ఫ్లాటు విక్రయించేందుకు నిరాకరించిన అపార్ట్‌మెంట్ యజమాని, మరికొందరు ఫ్లాటు ఓనర్లతోపాటు పురపాలక శాఖ అధికారులపై పలు ఆరోపణలతో ఏపీ యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు సత్యనారాయణ పిల్ దాఖలు చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. తక్షణం రిజిస్ట్రార్ వద్ద రూ.లక్ష జమ చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. పిల్ దాఖలులో దురుద్దేశం ఉందని తేలితే భారీగా ఖర్చులు విధిస్తామని హెచ్చరించింది. ఫ్లాటు కొనుగోలు చేసేందుకు పిటిషనర్ ప్రయత్నించారని నిరూపించే ఆధారాలను సమర్పించాలని అపార్ట్‌మెంట్ యజమాని, ఫ్లాటు ఓనర్ల తరఫు న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడ గుణదల పరిధిలోని కార్మెల్ నగర్ సర్వే నం.150/2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 90 ఫ్లాట్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇచ్చిన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై చర్యలకు ఆదేశించాలని కోరుతూ సత్యనారాయణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అయితే తన సతీమణికి ఫ్లాటు విక్రయించని కారణంగానే పిటిషనర్ పిల్ దాఖలు చేశారని అపార్ట్‌మెంట్ యజమాని, ఫ్లాటు ఓనర్ల తరఫు న్యాయవాది తెలియజేయడంతో.. న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేస్తూ రూ.లక్ష డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

1 నుంచి 7 వరకు బీమా లోక్ అదాలత్

» రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బబిత

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 1 నుంచి 7 వరకు విజయవాడలో ఇన్సూరెన్స్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి) ఎం.బబిత తెలిపారు. వరదల వల్ల విజయవాడలోని పలు ప్రాంతాలు ముంపునకు గురై దెబ్బతిన్న మోటారు వాహనాల బీమా క్లైముల సత్వర పరిష్కారానికి ఈ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరద బాధితులందరూ ఈ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీమా క్లైమ్‌లు విషయంలో సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సేవలు పొందవచ్చన్నారు. సమావేశంలో సంస్థ ఉప కార్యదర్శి రంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు 20 శాతం ఇన్‌సర్వీస్ కోటా

» జీవో 85 సవరణకు మంత్రి సత్యకుమార్ అంగీకారం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ)ని వైద్యులు సమ్మె విరమించి వెంటనే విధుల్లో చేరాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. మంగళగిరిలో ఏపీఐఐసీ భవనంలో పీహెచ్‌సీ వైద్యులతో 2 గంటలపాటు ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వైద్యులు కోరుతున్న జీవో 85ను సవరించేందుకు అంగీకరించారు. అదేవిధంగా.. క్లినికల్ విభాగంలో 15 శాతానికి తగ్గించిన సర్వీస్ కోటాను 20శాతానికి పెంచుతామని చెప్పారు. అంతేకాకుండా దీనిని 6 విభాగాలకే పరిమితం చేయకుండా అన్ని విభాగాలకు వర్తింపజేస్తామన్నారు. దీనివల్ల 258 సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. సర్వీసులో చేరకముందే వైద్యులు ఏదైనా విభాగంలో డిప్లొమా పూర్తి చేసినా పీజీకి అనుమతిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు ఇన్‌సర్వీస్‌లో రెండో పీజీ చేసుకునే వెలుసుబాటు కల్పిస్తామన్నారు. జీవో 85ను సవరించడంతోపాటు ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైద్యులు వెంటనే సమ్మె విరమించి విధుల్లో చేరాలన్నారు. అపోహలు, అసత్యాలకు తావు లేకుండా వైద్యుల సంఘం ప్రతినిధులు వ్యవహరించాలని మంత్రి కోరారు.

లడ్డూపై అత్యవసర విచారణ: పాల్

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యి విషయంలో రాజకీయ నాయకులు ఇష్టారీతిన ప్రకటనలు చేస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టుకు నివేదించారు. ప్రజలు నిరసనలు చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై తాను వేసిన పిల్‌ను లంచ్ మోషన్‌గా విచారణకు స్వీకరించి, అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ నిరసనలు ఎక్కడ, ఏ ప్రాంతంలో జరుగుతున్నాయి... మీరు చూశారా అని పాల్‌ను ప్రశ్నించింది. పిల్‌పై సాధారణ పద్ధతిలో వచ్చే బుధవారం విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించండి

» 'స్టాప్ వర్క్' ఉత్తర్వులను అమలు చేయండి

» జీవీఎంసీకి హైకోర్టు ఆదేశం



అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విశాఖ ఎర్రమట్టి దిబ్బల విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జియో హెరిటేజ్ సైట్‌గా ప్రకటించిన ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని పరిరక్షించాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ)ను ఆదేశించింది. మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన స్టాప్ ఆర్డర్ ఉత్తర్వులను తూ.చ.తప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మైనింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, జిల్లా కలెక్టర్, భీమునిపట్నం తహశీల్దార్, జిల్లా అటవీ అధికారి, భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి నోటీసులు జారీ చేసింది. విచారణను 8వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా, భీమునిపట్నం మండలం, నేరెళ్లవలస గ్రామ పరిధిలోని సర్వే నం.118/5ఏ, 49/1 ఎర్రమట్టి దిబ్బలను హెరిటేజ్ సైట్‌గా ప్రకటిస్తూ జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జారీ చేసిన నోటిఫికేషన్ అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీవీఎల్ఎన్ మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఎర్రమట్టి దిబ్బలున్న ప్రాంతాన్ని ఇళ్ల నిర్మాణం కోసం భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి కేటాయిస్తూ ఇచ్చిన జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. ఎర్రమట్టి దిబ్బలను హెరిటేజ్ సైట్‌గా ప్రకటిస్తూ 2014లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం భూవిని కేటాయిస్తూ ఇచ్చిన జీవోను ఆధారంగా చేసుకొని భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ మట్టిదిబ్బలను తవ్వేసిందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) తిరుమాను విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ... ఇళ్ల నిర్మాణం కోసం సొసైటీకి మొత్తం 373 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం 2012లో జీవో ఇచ్చిందని తెలిపారు. అందులోని 91 ఎకరాలు వినియోగించలేదన్నారు. ఈ భూమిలో ఎలాంటి తవ్వకాలు జరపవద్దని జీవీఎంసీ స్టాప్ వర్క్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన స్టాప్ ఆర్డర్ ఉత్తర్వులను తూ.చ.తప్పకుండా అమలు చేయాలని జీవీఎంసీకి స్పష్టం చేసింది. ఈ వ్యవహారం పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

రేషన్ షాపుల హేతుబద్ధీకరణ

» కొత్తగా 2,774 చౌక దుకాణాల ఏర్పాటు

» ప్రతి కిలోమీటరు పరిధిలో ఒక షాపు

» పౌర సరఫరాల శాఖ కమిషనర్ మార్గదర్శకాలు

» త్వరలో కొత్త డీలర్ల నియామకానికి నోటిఫికేషన్



అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకమైన రేషన్ షాపుల హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్)కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2,774 కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేయనుంది. అలాగే ప్రస్తుతం ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాలకు డీలర్లను నియమించనుంది. చౌకధరల దుకాణాల రేషనలైజేషన్, కొత్త షాపుల ఏర్పాటు, డీలర్ల నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలను పౌరసరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ ఇటీవల విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 29,795 రేషన్ షాపులు ఉన్నాయి. వీటిద్వారా మొత్తం 1,48,43,671 మంది కార్డుదారులకు ప్రతినెలా బియ్యం, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. ఎక్కువ కార్డులు ఉన్న డీలర్లకు లాభదాయకంగానే ఉన్నా.. అతి తక్కువ కార్డులున్నవారికి దుకాణాల నిర్వహణ కష్టతరంగా మారింది. ప్రతినెలా వచ్చే కమీషన్ షాపుల అద్దెకు కూడా సరిపోని పరిస్థితుల్లో ఎక్కువమంది డీలర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. అస్తవ్యస్తంగా మారిన ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సిద్ధమైంది. అన్ని రేషన్ షాపులకు సమాన ప్రాతిపదికన కార్డులు సర్దుబాటు చేసి దుకాణాల నిర్వహణను లాభదాయకంగా మార్చడం, వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులు తదితర కార్డుదారులందరికీ సౌలభ్యంగా ఉండేలా ప్రతి కిలోమీటరు పరిధిలో ఒక రేషన్ షాపు ఏర్పాటు చేయనుంది.

కార్డుల సర్దుబాటు ఇలా..

రాష్ట్రంలో 800 కంటే ఎక్కువ రేషన్ కార్డులున్న షాపుల పరిధిలోని కార్డులను నిబంధనల మేరకు సర్దుబాటు చేసి.. కొత్తగా మరో 2,774 చౌక ధరల దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రేషన్ షాపులకు 400 నుంచి 450 కార్డులు, పట్టణాల్లో 500 నుంచి 550 కార్డులు, నగరాల్లో 600 నుంచి 650 కార్డులు చొప్పున కేటాయిస్తారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం ఒక రేషన్ షాపు ఏర్పాటు చేస్తారు. 600 కంటే ఎక్కువ కార్డులు ఉన్న పెద్ద పంచాయితీల్లో రెండు షాపులను ఏర్పాటు చేసి ఉన్న కార్డులను సమానంగా కేటాయిస్తారు. వచ్చేనెల 22లోపు ఈ ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, కొత్తగా ఏర్పాటు చేయనున్న 2,774 రేషన్ షాపులతోపాటు ఇన్‌చార్జి డీలర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపులకు డీలర్లను నియమించేందుకు ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా డీలర్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

కొత్త షాపులతో డీలర్లకు అన్యాయమే

కొత్త రేషన్ షాపులను ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న డీలర్లకు ఎలాంటి మేలు జరగదని, అన్యాయమే జరుగుతుందని రాష్ట్ర డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 10ను అమలు చేయవద్దని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్త షాపులు ఏర్పాటు చేయకుండా ప్రస్తుతం ఉన్న వాటికే గ్రామీణ ప్రాంతాల్లో 650 కార్డులు, పట్టణాల్లో 800 నుంచి 850 కార్డులు, నగరాల్లో 1,000 నుంచి 1,200 కార్డులు చొప్పున కేటాయిస్తే నిర్వహణ ఖర్చులు పోను డీలర్ల కుటుంబ పోషణకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని పేర్కొన్నారు.

విజయపాల్ ఎక్కడ?

» సీఐడీ మాజీ అదనపు ఎస్పీ కోసం గాలింపు

» రాయలసీమ వైసీపీ నేత ఆశ్రయం ఇచ్చినట్లు అనుమానాలు



గుంటూరు, సెప్టెంబరు 25: నాటి నరసాపురం ఎంపీ, నేటి ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కేసులో నిందితుడైన సీఐడీ మాజీ ఏఎస్పీ కె.విజయ్‌పాల్ కోసం పోలీసులు వేట ప్రారంభించారు. విజయపాల్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం కోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో విజయపాల్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గుంటూరులోని కన్నావారితోటకు చెందిన విజయ్‌పాల్ కొంతకాలంగా విజయవాడలో ఉంటున్నారు. రఘురామపై నమోదైన కేసులో సీఐడీ అదనపు ఎస్పీగా ఉన్న విజయపాల్ విచారణ అధికారిగా ఉన్నారు. ఆ కేసులో 2021 మే 14న రఘురామపై సీఐడీ కస్టడీలో హత్యాయత్నం జరిగింది. దీనిపై గత జులై 11న గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో మాజీ సీఎం జగన్, సీఐడీ మాజీ డీజీ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పి.సీతారామాంజనేయులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతితోపాటు విజయపాల్ నిందితులుగా ఉన్నారు. కేసులో విజయపాల్ ఏ4గా ఉన్నా.. విచారణ అధికారి కావడంతో కేసు విచారణను ఆయన నుంచే ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ కేసులో సుమారు 10 మంది కింది స్థాయి అధికారులు, సిబ్బందిని గుర్తించారు. వారిని కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉంది. అయితే కేసు నమోదయినప్పటి నుంచి విజయపాల్ అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయన రాయలసీమలో తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రాయలసీమకు చెందిన వైసీపీ నేత ఆయనకు ఆశ్రయం ఇచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రితోపాటు డీజీ స్థాయి ఐపీఎస్ అధికారులు నిందితులుగా ఉన్న నేపథ్యంలో విజయపాల్ నోరు విప్పితే వారి మెడకు చుట్టుకుంటుందనే భయం కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

పదవులకు వన్నె తెచ్చేలా పనిచేయండి!

» కార్పొరేషన్ల చైర్మన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

» ఇవ్వాల్సిన పదవులు చాలా ఉన్నాయని వ్యాఖ్య

» దశల వారీగా ఇస్తామని వెల్లడి

» కొందరు నాయకులు ఎక్కువ మాట్లాడుతున్నారని అసంతృప్తి

» క్రమశిక్షణ తప్పితే కఠినంగా ఉంటానని హెచ్చరిక



సీఎం చంద్రబాబుతో కొత్తగా ఎంపికైన కార్పొరేషన్‌ల చైర్మన్‌లు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వికసిత్ ఆంధ్ర లక్ష్యసాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా తమ పదవుల ద్వారా పారదర్శకంగా ప్రజాసేవ చేస్తామని వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమితులైన నేతలు చెప్పారు. నామినేటెడ్ పదవులు పొందిన కూటమి పార్టీ నాయకులతో బుధవారం అమరావతి సచివాలయంలో సీఎం భేటీ అయ్యారు. పదవులకు వన్నె తెచ్చేలా వ్యవహరించాలని వారికి సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం పలు కార్పొరేషన్ల చైర్మన్లు మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసేవ లక్ష్యంతో పని చేస్తుందని, తమపై నమ్మకంతో నామినేటెడ్ పదవులు అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

పట్టాభికి న్యాయం చేస్తాం: సీఎం

టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడి జైలుకు వెళ్లారని, ఆయనకు పార్టీ నుంచి చేయాల్సి ఉందని, చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయనకు న్యాయం చేస్తామన్నారు. 'ప్రతిపక్షంలో ఉన్న కాలంలో ఎవరేం చేశారో అన్నీ చూశాను. ఎవరు జైళ్లకు వెళ్లారో? ఎవరు దాడులకు గురయ్యారో? ఎవరు కేసుల్లో ఇరుక్కొన్నారో? అన్నీ చూశాను. ఇవ్వాల్సిన పదవులు చాలా ఉన్నాయి. వాటిని దశల వారీగా ఇచ్చుకొంటూ వెళ్తాం. పార్టీ అన్న తర్వాత అనేక కోణాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. సామాజిక, ప్రాంతీయ సమీకరణలవంటివి అనేకం చూడాలి. మూడు పార్టీలను కలుపుకొని వెళ్లాలి. ఎవరికి ఇచ్చే గౌరవం వారికి ఇస్తాం. నేను, పవన్ కల్యాణ్ అన్నీ చర్చించి నిర్ణయాలు తీసుకొంటున్నాం. అదే సమయంలో పార్టీలో క్రమశిక్షణను అందరూ పాటించాలి. కొందరు నాయకులు ఎక్కువ మాట్లాడుతున్నారు. అది సరికాదు. కలుపుకొని పోవడంలో నేను ఎంత ఉదారంగా ఉంటానో క్రమ శిక్షణ తప్పితే అంత కఠినంగా ఉంటాను. మొదటి జాబితా ఇచ్చిన తర్వాత నేను ఐవీఆర్‌ఎస్ సర్వే చేయించాను. 95% మంది ఈ ఎంపికలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అవకాశాలు ఇవ్వాల్సిన వాళ్లు ఇంకా అనేక మంది ఉన్నారు. వారందరికీ వీలు మేరకు అన్నీ చూసుకొంటూ ఇస్తాం' అని అన్నారు. తమకు లభించిన కార్పొరేషన్లు, వాటి ద్వారా చేయాల్సిన పనికి సంబంధించి పీతల సుజాత, దీపక్ రెడ్డి, మంతెన రామరాజు, బొరగం శ్రీనివాసులు, రవి నాయుడు, లంకా దినకర్, తోట సుధీర్ ఈ సమావేశంలో మాట్లాడారు.

జెన్కోపై ఈఆర్‌సీ తీవ్ర ఆగ్రహం

» థర్మల్ కేంద్రాల నిర్మాణ జాప్యంపై అసంతృప్తి

» విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లను రద్దు చేస్తామంటూ హెచ్చరిక

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయకపోవడాన్ని ఏపీఈఆర్‌సీ తీవ్రంగా తప్పు పట్టింది. కర్నూలు ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య, విజయవాడ ఎన్‌టీటీపీ థర్మల్ యూనిట్ల ధరల నిర్ణయంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, ఏపీజెన్కోపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జాప్యాన్ని ఇంకా కొనసాగించి, దానివల్ల కలిగే నష్టాలను ప్రజలపై మోపలేమని స్పష్టం చేశారు. ఈ మూడు యూనిట్లకు సంబంధించి విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను రద్దు చేస్తామంటూ జెన్కోను హెచ్చరించారు. దీనికి జెన్కో ఎండీ చక్రధర్‌బాబు స్పందిస్తూ... 'జాతీయ స్థాయిలో మాతోపాటు ప్రారంభించిన పలు సంస్థలు ఇప్పటికీ ప్లాంట్లను పూర్తి చేయలేదు. రాష్ట్రంలో యూనిట్‌లను పూర్తి చేసి, ఉత్పత్తి కూడా చేస్తున్నాం. థర్మల్ యూనిట్లను సకాలంలో పూర్తిచేసే లక్ష్యంతోనే పనులు చేపడుతూ వచ్చాం' అని వివరించారు. కాగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతూ 'అదనపు క్యాపిటల్ భారం వినియోగదారులపై వేయడం భావ్యం కాదు. అదాని కంపెనీతో సోలార్ విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు.

చట్టవిరుద్ధంగా పదవి నుంచి తొలగించారు

» హైకోర్టును ఆశ్రయించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఈ నెల 23న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గజ్జల వెంకటలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. తన పదవీకాలం 2026 మార్చి 16 వరకు ఉన్నప్పటికీ అర్ధాంతరంగా తొలగించారన్నారు. ఈ ఏడాది మార్చి 15న చైర్‌పర్సన్‌గా నియమితులయ్యానని, నిబంధనల ప్రకారం నాటి నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగేందుకు అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మెమోను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరపనుంది.

కొడాలి నాని అనుచరుల దొంగ రిజిస్ట్రేషన్

» రీ సర్వేలో మా భూమిని పక్కనోళ్లకు రాసేశారు

» టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కొనకళ్ల నారాయణ, షరీఫ్ తదితరులు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కొడాలి నాని అనుచరులు తమ స్థలాన్ని కబ్జా చేసి, ఇంటిపై దాడి చేశారని, రీసర్వే పేరుతో తమ భూములను పక్కనోళ్ల లెక్కలో వేసి, తమకు అన్యాయం చేశారని అధికార పార్టీ కార్యకర్త టీడీపీ నేతలకు మొర పెట్టుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వైసీపీ దౌర్జన్యాల బాధితులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ వినతులు స్వీకరించారు. కొడాలి నాని, శశిభూషణ్ అనుచరులైన అడబాల అప్పారావు కుమారులు తన స్థలానికి దొంగ రిజిస్ట్రేషన్ చేయించి, అక్రమంగా తన స్థలంలోకి ప్రవేశించి, చెట్లను ధ్వంసం చేశారని, 25 ట్రక్కుల మట్టి, ఇటుక రాళ్లను ఎత్తుకెళ్లారని, అడ్డుకోబోయిన తన భార్య, బిడ్డలను హింసించారని గుడివాడకు చెందిన గుర్రాల సుబ్బారావు వాపోయారు. పల్నాడు జిల్లా మన్నేసుల్తాన్ పాలెంలోని రామలింగేశ్వరస్వామి పాత గుడిని తొలగించినప్పుడు విలువైన వస్తువులు బయటపడ్డాయని, ఈవో రామకోటిరెడ్డి, డీఈవో సత్యనారాయణరెడ్డి, గుమస్తా మధుసూదన్ రెడ్డి వాటిని గుట్టుచప్పుడు కాకుండా పంచుకున్నారని, దీనిపై విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అక్కల సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలంలో గతంలో ఇన్‌చార్జి ఎమ్మార్వోగా పని చేసిన పిల్లి సునీత తమ వద్ద రూ.14లక్షలు తీసుకుని, అటవీ భూమికి నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చి మోసం చేశారని మన్నేసుల్తాన్‌పాలెంకు చెందిన బాధితులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో తన పేరున ఉన్న భూమిని మరొకరి పేరు మీదకు మార్చి, వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని గుంటూరు జిల్లా సిరిపురం గ్రామానికి చెందిన కడియాల సాంబశివరావు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అనుచరులు తమపై కక్ష కట్టి, ఇబ్బందిపెడుతున్నారని కదిరికి చెందిన గూడూరు సౌభాగ్యవతి ఫిర్యాదు చేశారు.

వ్యక్తులను బట్టి రూల్స్!

» దేవదాయ శాఖలో అధికారుల పక్షపాతం

» విజయరాజు ఏసీబీ కేసు ప్రాసిక్యూషన్‌కు.. అజాద్ కేసు పెండింగ్‌లో..

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో వ్యక్తుల బట్టి రూల్స్ మారిపోతుంటాయి. మనోళ్లు అనుకుంటే ఒక రూల్.. కానివాళ్లకు మరో రూల్ అన్నట్లు ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తుంటారు. అందుకు ఉదాహరణ ఇదే!. దేవదాయ శాఖలో కొంతమంది అవినీతిపరులైన అధికారులు 2016, 2017లో ఏసీబీకి చిక్కారు. వీరిలో ఇద్దరు ముగ్గురిపై అక్రమాస్తుల కేసులు నమోదయ్యాయి. దాదాపు ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకూ వీరిపై చర్యలు లేవు. ఏసీబీకి పట్టుబడిన కొంతకాలంపాటు సస్పెన్షన్‌లో ఉన్నారు. ఆ తర్వాత మళ్లీ సర్వీస్‌లోకి వచ్చి అందినకాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఏళ్లతరబడి ఆ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు వీరిని ప్రోత్సహిస్తూ శాఖ మొత్తాన్నీ అవినీతిమయం చేస్తున్నారు. ఏసీబీ పట్టుబడిన వారి కేసులను డిపార్ట్‌మెంట్ విచారణ చేయాలా..? లేదా ఏసీబీ ద్వారానే ప్రాసిక్యూషన్ చేయాలనే దానిపై ఆయా శాఖ ఉన్నతాధికారులు, మంత్రులే తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రాసిక్యూషన్‌కు ఇస్తే ఏసీబీ అధికారులు తమ పని తాము చేసుకుంటూ వెళ్తారు. అయితే, ఈ మధ్య కాలంలో డిప్యూటీ కమిషనర్ విజయరాజు కేసును దేవదాయ శాఖ ప్రాసిక్యూషన్‌కు పంపించింది. ఆయన తర్వాత అక్రమాస్తుల కేసులో చిక్కుకున్న జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ కేసును మాత్రం ప్రాసిక్యూషన్‌కు పంపించలేదు. ఇద్దరు అధికారులపైనా ఒకేరకమైన ఆరోపణలున్నాయి. అయితే ఒక అధికారి కేసును ప్రాసిక్యూషన్‌కు పంపించి, మరో అధికారి కేసును పంపించకపోవడం ఇప్పుడు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.


ఎంతమంది ప్రాసిక్యూటర్లు అవసరమో తేల్చండి

» టెన్యూర్ బేసిస్‌లో ఖాళీలు భర్తీ చేయండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోర్టుల్లో ఎంతమంది ప్రాసిక్యూటర్లు, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్లు అవసరమో అధ్యయనం చేసి వివరాలను కోర్టు ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు కమిటీ సిఫార్సులకు అనుగుణంగా టెన్యూర్ బేసిస్ (నిర్దిష్ట కాలపరిమితి) విధానంలో దిగువ కోర్టుల్లో ప్రాసిక్యూటర్ల ఖాళీలను భర్తీ చేయాలని స్పష్టం చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని కోర్టుల్లో ప్రాసిక్యూటర్ల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని, ఆరు నెలల్లో ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలో 323 మేజిస్ట్రేట్ కోర్టులు ఉండగా, 230 మంది ప్రాసిక్యూటర్ల నియామకానికి ప్రభుత్వ అనుమతి ఉందన్నారు. ఈ పోస్టుల్లో కూడా 40 ఖాళీగా ఉన్నాయన్నారు. కోర్టుల అవసరాలకు అనుగుణంగా ప్రాసిక్యూటర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ హైకోర్టు కమిటీ సిఫార్సులకు అనుగుణంగా టెన్యూర్ బేసిస్ విధానంలో ప్రాసిక్యూటర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం పిటిషనర్ చెబుతున్న స్థాయిలో ప్రాసిక్యూటర్లు నియామకం అవసరం ఉండదన్నారు. ఎంతమంది అవసరమో అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పీపీలు, ఏపీపీల పోస్టులు భర్తీ చేయకపోవడంతో కోర్టుల పనితీరుపై ప్రభావం పడుతోందని గుర్తు చేసింది. రాష్ట్రంలోని కోర్టుల్లో ఎంతమంది ప్రాసిక్యూటర్లు అవసరమో అధ్యయనం చేయాలని ఆదేశించింది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 26 సెప్టెంబరు 2024



ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

● వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.

- కోర్సు ఫీజు: రూ.7000
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.

- కోర్సు ఫీజు: రూ.17,500
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- కోర్సు ఫీజు: రూ.9,800
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- కోర్సు ఫీజు: రూ.10,000
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7

ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్న వారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద వాల్తేర్, విశాఖపట్నం-530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in



సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు

- సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
- కంప్యూటేషనల్ బయాలజీ
- డిసీజ్ బయాలజీ
- జెనెటిక్స్
- మాలిక్యులర్ మైక్రో బయాలజీ
- ఇమ్యూనాలజీ

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

లెటర్ రిపీటెడ్ సిరీస్

టీజీపీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పార్ట్-2

13. c - ab - d - bcd - bc - ab

ఎ) aacdd బి) dcaad సి) cadad డి) acadd

సమాధానం: (బి)

వివరణ: cdab/ cdab/cdab/cdab

ఒకే విధమైన నాలుగేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడ్డాయి.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు dcaad.

14. a - abb - c - caa - b - b

ఎ) abacb బి) acaba సి) abcab డి) aabbc

సమాధానం: (సి)

వివరణ: aaa/bbb/ccc/aaa/bbb

ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉంది

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు abcab.

15. d - ab - dca - d - cab - d - abd

ఎ) cdbddc బి) cbdcdc సి) bcddcd డి) abccdd

సమాధానం: (ఎ)

వివరణ: dcabd/dcabd/dcabd/dcabd

ఒకే విధమైన ఐదేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడ్డాయి

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు cdbddc.

16. L - N - NL - LM - M -

ఎ) MMNLN బి) LMNMN సి) LMMNN డి) MNMNL

సమాధానం: (ఎ)

వివరణ: LMN/MNL/NLM/LMN

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు MMNLN.

17. l - mm - n - l - l - m.

ఎ) mnmnl బి) mnnlm

సి) lmmnn డి) mnnnl

సమాధానం: (బి)

వివరణ: lmm /mnn / nll / lmm

ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు mnnlm.

18. k - ln - ml - k - ln - m - n.

ఎ) kmkmln బి) kmlkmn సి) mknmkl డి) kkmmnl

సమాధానం: (సి)

వివరణ: kmln/kmln/kmln/kmln.

ఒకే విధమైన నాలుగేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడ్డాయి. ∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు mknmkl.

19. a - ca - b - aab - ca - bb - c

ఎ) bacbac బి) aabbcc సి) abcabc డి) ababcc

సమాధానం: (ఎ)

వివరణ: abc/aabc/aabbc/aabbcc

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు bacbac.

20. PQ - SQR - P - SP - S - QRP - RS

ఎ) PQRQRS బి) RSRQPQ సి) PQQRRS డి) PQRSRQ

సమాధానం: (బి)

వివరణ: PQRS/QRSP/RSPQ/SPQR/PQRS

మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. ఈవిధంగా ఒక సక్రమమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు RSRQPQ.

21. P - P - QP - P - PP - PQ

ఎ) QPPQP బి) PPPQQ సి) PQPQP డి) QQPPQ

సమాధానం: (ఎ)

వివరణ: PQ/PPQ/PPPQ/PPPPQ

రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'P' అదనంగా చేరుతున్నది.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు QPPQP

22. P - QQQ - R - PP - Q

ఎ) RPRP బి) PRRP సి) PRPR డి) RRPP

సమాధానం: (బి)

వివరణ: PPQ/QQR/RRP/PPQ

ప్రతి సమూహంలో మొదటి రెండు ఒకటే.

∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు PRRP.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

జాబ్ కార్నర్

వెస్ట్రన్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 5,066

ముంబయి ప్రధాన కేంద్రంగా గల రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

డివిజన్/వర్క్‌షాప్‌లు: బీసీటీ డివిజన్, బీఆర్‌సీ డివిజన్, ఏడీఐ డివిజన్, ఆర్‌టీఎం డివిజన్, ఆర్‌జేటీ డివిజన్, బీవీపీ డివిజన్, పీఎల్ వర్క్‌షాప్, ఎంఎక్స్ వర్క్‌షాప్, బీవీపీ వర్క్‌షాప్, డీహెచ్‌డీ వర్క్‌షాప్, పీఆర్‌టీఎన్ వర్క్‌షాప్, ఎస్‌బీఐ ఇంజనీరింగ్ వర్క్‌షాప్, ఎస్‌బీఐ సిగ్నల్ వర్క్‌షాప్, హెడ్ క్వార్టర్ ఆఫీస్.

ట్రేడ్: ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, మెకానిక్, పీఏఎస్ఏ, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, వైర్‌మన్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, పైప్ ఫిట్టర్, ప్లంబర్, డ్రాఫ్ట్స్‌మన్, స్టెనోగ్రాఫర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 22 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

ఎంపిక ప్రక్రియ: పదో తరగతి, ఐటీఐ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్ష/వైవా ఉండదు.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 22

వెబ్‌సైట్: https://www.rrc-wr.com/

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్స్

ఖాళీలు: 250

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)లో 2025 జూన్ నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు పచేసుకోవచ్చు.

1. జనరల్ సర్వీస్(జీఎస్-ఎక్స్/హైడ్రో క్యాడర్): **56 పోస్టులు**
2. పైలెట్: **24 పోస్టులు**
3. నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(ఎయిర్ క్రూ): **21 పోస్టులు**
4. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: **20 పోస్టులు**
5. లాజిస్టిక్స్: **20 పోస్టులు**
6. నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: **16 పోస్టులు**
7. ఎడ్యుకేషన్: **15 పోస్టులు**
8. ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **36 పోస్టులు**
9. ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **42 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీకాం, బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

లిటిల్స్


అపాయంలో ఉపాయం



ఒక అడవిలోని కొలనులో ఒక తాబేలు నివసించేది. అది ఒక సాయంత్రం కొలనులోనుంచి బయటకు వచ్చి అటుఇటు తిరుగుతూ ఉంది, దూరమునుండి ఓ నక్క అటుగా రావడం చూసిన తాబేలు నీళ్లలోకి వెళ్లిపోవాలి అనుకున్నది,కానీ ఈలోగానే దాన్ని ఆ నక్క చూసింది నక్క తాబేలును తినాలి అనుకుని దగ్గరగా వచ్చితాబేలు డిప్ప మీద దాకి ఇదేమిటి ఆఇంత గట్టిగా ఉంది అన్నది. విషయం అర్థమైన తాబేలు నక్కతో ఇలా అన్నది. 'ఓ నక్కబావా నేను నీళ్లలో ఉన్నంత సేపే మెత్తగా ఉంటాను నీళ్లలో నుండి బయటకు రాగానే ఇలా గట్టిపడిపోతాను కాబట్టి నన్ను మరలా కాసేపు నీళ్లలో నాననివ్వు.అపుడు నన్ను తిందువుగాని' అన్నది. ఆ మాటలు జిత్తులమారి నక్క కొంత వరకే నమ్మింది.తాబేలు తననుండి తప్పించుకోవడానికి ప్రయత్నించకుండా చూడాలి అనుకుంది.

తాబేలును నీళ్లలో మునగనిచ్చి తాబేలు డిప్ప మీద తన కాలును అదిమిపట్టి తాబేలు తప్పించుకుని పోకుండా చూసింది. కాసేపటి తర్వాత తాబేలు 'నక్క బావా నేను మొత్తంనీళ్లలో నాని మెత్తబడ్డాను ఒక్క నువ్వు కాలు అదిమి పెట్టిన ప్రదేశంలో తప్ప. కాబటిట్ట, ఆకాలును కొద్దిగా పక్కకితీస్తే,నేను అక్కడ కూడా మెత్తబడిపోయి వస్తాను అనగానే అది నమ్మిన నక్కతనకాలు పక్కకు జరిపింది. ఇదేఅదనుగా తాబేలు చటుక్కున కొలనులోకి జారి మాయమైపోయింది.

7 తేడాలను కనిపెట్టండి





ఎవి ఎన్ని?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 419

		7			6			
	3	4	8					5
1	6				4			
	4				8	9	3	
8								1
	1	5	2				4	
			6				9	3
6					3	4	8	
			1			5		

సుడోకు - 418 సమాధానం

5	9	1	2	3	8	4	6	7
4	2	3	6	5	7	1	8	9
6	8	7	1	4	9	5	2	3
2	3	8	7	6	1	9	5	4
9	7	4	5	2	3	8	1	6
1	6	5	9	8	4	7	3	2
7	4	2	8	1	6	3	9	5
3	1	6	4	9	5	2	7	8
8	5	9	3	7	2	6	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.